www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం



సంపుటి : 68 | సంచిక : 212 | శుక్రవారం 25-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

# జనధనమన..!

దేశభక్తి పేరిట బీజేపీ సర్కారు విచ్చలవిడి దుబారాకు తెరలేపింది. మరీ ముఖ్యంగా రైల్వేశాఖ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ జెండాల పండగ చేసేస్తోంది. రైల్వే ప్లాట్‌ఫారం మీదకు వెళ్తే.. కుళాయిలు ఉంటాయి. నీళ్లు రావు. విద్యుత్తు స్తంభాలు ఉంటాయి..దీపాలు వెలగవు. మరుగుదొడ్లు ఉంటాయి. వినియోగానికి అవకాశం ఉండదు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చటానికి నిధులు విదిలించని రైల్వే..తాజాగా జాతీయ జెండాల ఆవిష్కరణకు సుమారు రూ.40 కోట్లు ఖర్చు చేస్తోంది. ఆగస్టు 15, జనవరి 26న విధిగా జాతీయ జెండాను ఎగుర వేస్తుంటారు. ఇందుకు ఘనంగా ఖర్చు పెడతారు. తాజాగా జాతీయ జెండాకు నిత్యహారతి కార్యక్రమాన్ని రైల్వే చేపట్టింది. విద్యుల్లతలతో అతి సుందరంగా అలంకరిస్తున్నారు. ఇలా ఏడాది పొడుగునా విద్యుత్తు బిల్లులూ తడిచి మోపెడు కావటం తథ్యమే. ప్రయాణికులకు ఉపయోగపడని ఈ పండుగ అంత అవసరమా? అనేది జనబాహుళ్యం ప్రశ్న.

## దేశభక్తికి రూ.40 కోట్ల హారతి

- ఒక్కో జెండాకు రూ.10 లక్షలు
- బజాజ్ ఎలక్ట్రికల్‌కు నేరుగా లబ్ధి
- మౌలిక సదుపాయాలు గాలికి..
- జెండా పండుగ పేరిట దుబారా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి :
ప్రయాణికుల్లో జాతీయ భావాన్ని పెంచే సాకుతో రైల్వేశాఖ కార్పొరేట్ సంస్థకు భారీగా లబ్ధిని చేకూరుస్తోంది. దేశవ్యాప్తంగా రోజుకు 50వేలు అంతకంటే ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఏ-1 కేటగిరికి చెందిన ప్రధాన రైల్వేస్టేషన్లలోని సర్క్యులేటింగ్ ఏరియాల్లో వంద అడుగుల పొడవున్న త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలని రైల్వేశాఖ గత ఏడాది డిసెంబరులో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే కేంద్ర కార్యాలయం సికింద్రాబాద్‌లో పతాకాన్ని ఎగురవేసిన రైల్వే అధికారులు..తర్వాత విజయవాడ, తిరుపతి రైల్వేస్టేషన్లలో వీటిని ఆవిష్కరించారు. ఒక్కో పతాకాన్ని తయారు చేసేందుకు రూ.10లక్షలు వెచ్చిస్తున్న రైల్వేశాఖ వీటిని సమకూర్చే కాంట్రాక్టును బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

- మిగతా 2 లో


గుంతకల్లు అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం రైల్వేశాఖ సహాయ మంత్రి రాజేన్‌గోహెన్ వంద అడుగుల జాతీయ జెండాను ఎగురవేసిన దృశ్యం.

వెనిజులాలో మదురో అనుకూల ప్రదర్శన


## అమెరికాపై ఆగ్రహోగ్రం

### వెనిజులాలో తిరుగుబాటుకు ట్రంప్ కుట్ర
### అధ్యక్షుడికి జనం మద్దతు

తమకు నచ్చని స్వతంత్రదేశాలలో ప్రభుత్వాలను ఏదో విధంగా తొలగించి తమ కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడం అమెరికా చిరకాలం నుంచి అనుసరిస్తున్న విధానం. లాటిన్ అమెరికాలో స్థిరంగా ఉన్న వెనిజులాను అస్థిరీకరించి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడిగా హ్యూగో ఛావెజ్ పాలన నాటినుంచే అమెరికా యత్నిస్తోంది. ఛావెజ్ మరణం తర్వాత అధికారం చేపట్టిన నికొలస్ మదురో ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కొన్నేళ్ల నుంచి కుట్ర పన్నింది. అక్కడి ప్రతిపక్షానికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని తిరుగుబాటు యత్నానికి ముందే అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ వీడియో సందేశాన్ని పంపారు. ఆ తర్వాత ప్రతిపక్ష ఫ్రంట్ నేత గుయ్‌డొ తానే తాత్కాలిక అధ్యక్షుడినని ప్రకటించుకున్న వెంటనే ఆయనను గుర్తిస్తున్నామని, ఆయన చెప్పినట్టుగా సహాయం అందిస్తామని ట్రంప్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. మదురోకు రష్యా, చైనా, క్యూబా, బొలీవియా, టర్కీ మెక్సికో తదితర దేశాలు మద్దతునివ్వగా గుయ్‌డొకు అమెరికా, దాని అనుంగుదేశాలు మద్దతు ప్రకటించాయి. అక్కడి సమస్యకు చర్చలే పరిష్కారమని ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ సూచించారు. పరిస్థితులు ఏ మలుపు తీసుకుంటాయోనని ప్రపంచదేశాలు నిశితంగా గమనిస్తున్నాయి.

2లో



## నేనూ విచారణ చేయలేను

- సుప్రీంకోర్టు జస్టిస్ సిక్రీ
- మరో ధర్మాసనానికి బదలాయింపు

న్యూఢిల్లీ :
కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నే నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఏకే సిక్రి కూడా నిరాకరించారు. ఇటీవల మన్నే నియామకంపై దాఖలైన పిటిషన్‌ను విచారణ చేయలేనని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ వైదొలిగిన విషయం విదితమే. సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో రెండోస్థానంలో ఉన్న ఏకే సిక్రీ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. అయితే, సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ కుమార్ వర్మను తొలగించిన హైపవర్ కమిటీలో సీజేఐ ప్రతినిధిగా సిక్రీ పాల్గొన్నారు. దీంతో ఆయన కూడా విచారణ నుంచి వైదొలుగుతున్నట్లు గురువారం వెల్లడించారు. అలోక్ వర్మను తొలగించి తాత్కాలిక డైరెక్టర్ నియామక కమిటీలో సభ్యుడుగా ఉన్నందున నాగేశ్వరరావు నియామకంపై దాఖలైన పిటిషన్‌పై విచారణ జరపలేనంటూ వైదొలిగిన సిక్రీ, ఈ పిటిషన్‌ను శుక్రవారం మరో ధర్మాసనం విచారణ చేస్తుందని

- మిగతా 2 లో

## అడిగితే .. జోన్లు ఇచ్చేస్తారా!? !!

- విశాఖ జోన్‌పై నిర్ణయం తీసుకోలేదు
- అధ్యయనానికి కమిటీని వేశాం
- రైల్వే శాఖ సహాయమంత్రి వెటకారం

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం :
దేశంలో ఇప్పటికే రైల్వే జోన్లు చాలా ఉన్నాయని, ప్రజలు అడిగినట్లుగా ఎక్కడపడితే అక్కడ రైల్వే జోన్లు ఇవ్వలేమంటూ పరోక్షంగా నవ్యాంధ్రకు విశాఖ రైల్వే జోన్‌ను మంజూరు చేయలేమని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజేన్ గోహెన్ స్పష్టం చేశారు. దక్షిణ గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో గురువారం ఆయన ఆరు రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించారు. అనంతరం గుంతకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న విశాఖపట్నం రైల్వే జోన్‌ను ఎప్పుడు మంజూరు చేస్తారంటూ ? విలేకరులు ప్రశ్నించగా జోన్ ఏర్పాటుపై ఏ ఆలోచన చేయలేదని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయవచ్చా ? లేదా ? అన్న అంశం తేల్చడం కోసం నిపుణుల కమిటీని నియమించగా... ఇంతవరకు ఫీజుబిలిటీ రిపోర్టును తమ శాఖకు సమర్పించలేదన్నారు. రైల్వే జోన్ లాంటి సున్నిత అంశాన్ని తేల్చడం

- మిగతా 2 లో


సభలో ప్రసంగిస్తున్న రైల్వే శాఖ సహాయమంత్రి రాజేన్‌గోహెన్

# మీరే కొండంత అండ..!

- అందుకే సంక్షేమ పథకాలతో రుణం తీర్చుకుంటున్నాం
- ఇక టీడీపీని ఏ శక్తీ కదిలించలేదు
- 27న రాజమహేంద్రవరం జయహో సదస్సుకు లక్షలాదిగా తరలిరండి
- బీసీ నేతలతో సీఎం చంద్రబాబు భేటీ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
వెనుకబడిన వర్గాలే టీడీపీకి కొండంత అండని, తాను సీఎం కావడానికి కారణమైన బీసీల రుణం తీర్చుకుంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ నెల 27న రాజమహేంద్రవరంలో జరుగనున్న జయహో బీసీ సదస్సుకు సన్నాహకంగా బీసీ నేతలతో గురువారం ఉండవల్లిలోని ప్రజావేదికలో బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. తొలుత అనేక సంక్షేమం పథకాలు అమలు చేస్తున్న సీఎంకి శాలువాలు కప్పి, గజమాలతో బీసీ నేతలు సత్కరించారు. రాష్ట్రంలోని 139 బలహీన వర్గాల కులాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగున్నరేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందించారని మంత్రి అచ్చెన్నాయుడు కొనియాడారు. బీసీలకు ఇంకా ఏ విధంగా సహాయం చేయొచ్చు, వారి ఉన్నతికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో అందరి అభిప్రాయాలు అడిగి తెలుసుకునే ఒకే ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. టీడీపీ ఏర్పడక ముందు బీసీలను కేవలం ఓటు బ్యాంకులుగానే వాడుకున్నారు. టీడీపీ ఏర్పాటైన తర్వాత ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయుడు వరకు బీసీలకు అండదండగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా చూశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి 2014 వరకు జరిగిన బీసీల అభివృద్ధికి మించి ఈ నాలుగున్నరేళ్లలో రెట్టింపు అభివృద్ధి సాధించేలా చంద్రబాబు ప్రోత్సాహం అందించారని మంత్రి అచ్చెన్నాయుడు సీఎంను పొగడ్తలతో ముంచెత్తారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30 బీసీ సంఘాలు జయహో బీసీ సన్నాహక సమావేశానికి రావడం సంతోషకరమన్నారు. బీసీల అభివృద్ధికి 'మేధో మథనం' జరగాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామన్నారు. వెనుకబడిన వర్గాలే టీడీపీకి వెన్నుముక.వెనుకబడిన వర్గాలు అండ ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీని ఏ శక్తి ఏం చేయలేదని ధీమా వ్యక్తం చేశారు. మొట్టమొదటిసారిగా బీసీలకు గుర్తింపుతీసుకు వచ్చింది. వారిని ఆదరించి, గుర్తింపుతీసుకువచ్చిన పార్టీ టీడీపీ అన్నారు. గత పాలకులు బీసీలకు ఫెడరేషన్లు

- మిగతా 2 లో

## జనసేన, లెఫ్ట్ నేతల భేటీ నేడు





విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో:
జనసేన, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ, సీపీఎం అగ్రనేతల సమావేశానికి విశాఖ వేదికైంది. రుషికొండ సమీపంలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ భేటీ జరుగుతుందని జనసేన పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమిని ఏర్పాటు చేసేందుకు గత కొంతకాలంగా జనసేన, సీపీఐ, సీపీఎం కలిసి పనిచేస్తున్న విషయం తెలిసిందే. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటంతో పాటు రాష్ట్రంలో అనేక సమస్యలపై జనసేన, వామపక్షాలు పోరాడుతున్నాయి.

ఇప్పటి వరకు జనసేన, వామపక్షాల మధ్య జరిగిన పలు సమావేశాల్లో రాష్ట్రానికి చెందిన అగ్ర నేతలు మాత్రమే పాల్గొన్నారు. కానీ శుక్రవారం జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తొలిసారిగా అధికారికంగా జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌తో భేటీ కానున్నారు. జనసేన, వామపక్షాల మధ్య నెలకొన్న స్నేహబంధం భవిష్యత్‌లో మరింత విస్తృతపరచడానికి జనసేన మూల సిద్ధాంతాలలో సారుప్యత కలిగిన అంశాలను ముందుకు తీసుకువెళ్లడానికి ఈ సమావేశంలో చర్చిస్తారని తెలిసింది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై ఉభయ కమ్యూనిస్టు పార్టీలు జనసేన అనుసరించాల్సిన వ్యూహంపై అగ్రనేతలు చర్చించనున్నారు. దేశ రాజకీయాలతోపాటు రాష్ట్ర రాజకీయాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ సాగుతుందని తెలుస్తోంది. వామపక్షాలు, జనసేన భేటీపై ఇతర రాజకీయ పార్టీలు తెలుగు రాష్ట్రాల ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

ఈ సమావేశంలో జనసేన పార్టీ తరపున పవన్‌కల్యాణ్, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌తోపాటు మరికొంతమంది ముఖ్య నేతలు పాల్గొంటారని, సురవరం సుధాకరరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొంటారని, సీపీఎం నుంచి బీవీ రాఘవులు, పి.మధు, వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, సీహెచ్ నర్సింగరావు పాల్గొంటారని జనసేన ఓ ప్రకటనలో తెలిపింది.

## విద్వేష చిహ్నం మోడీ




- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- బీజేపీని గద్దెదించుతాం.. ఎవ్వరూ ఆపలేరు
- యూపీలో గెలుపే ప్రియాంక, సింధియా టార్గెట్
- అమేథి సభలో రాహుల్‌గాంధీ

అమేథి :
నరేంద్రమోడీ అంటేనే ద్వేషం... ఆయన ద్వేషానికి చిహ్నం.. అంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈసారి మోడీని గద్దెదించుతామని, అలా చేయకుండా తమను ఎవరూ ఆపలేరన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సంపూర్ణ బలంతో పోటీచేస్తుందని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా రాష్ట్ర తూర్పు ప్రాంత బాధ్యతలు చేపట్టిన ప్రియాంక గాంధీ, యువనేత జ్యోతిరాదిత్య సింధియా పనిచేస్తారని తెలిపారు. గురువారం అమేథిలో పర్యటించిన ఆయన..మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాఫెల్ ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ కేంద్రప్రభుత్వం పారిశ్రామికవేత్తల రుణాలు మాఫీ చేస్తూ, రైతులను నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. కాపాలాదారుడే దొంగని రుజువైందని ఎద్దేవా చేశారు. తాను మోడీలా కాదని, 'బీజేపీ ముక్త్ భారత్' అంటూ మాట్లాడనని, గౌరవంగా మాట్లాడతానని ప్రధాని 'కాంగ్రెస్ ముక్త్ భారత్' వ్యాఖ్యలనుద్దేశించి రాహుల్

- మిగతా 2 లో

# ఉద్యోగాల ఎర...!



న్యూఢిల్లీ :
ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడు కంచు కోటల్ని కోల్పోయిన బీజేపీ నష్ట నివారణ చర్యల్లో భాగంగా... గిమ్మిక్కులకు తెరతీసింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీతో 2014లో యువతను ఆకర్షించి... నాలుగున్నర ఏళ్లపాటు ఈ హామీని గాలికి వదిలేసిన బీజేపీ సర్కారుకు యువజనం కళ్లు తెరిపించారు. సార్వత్రిక ఎన్నికలు అతివేగంగా దూసుకు వస్తున్న దశలో... యువజనాన్ని బుజ్జగించి ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ఇటీవలే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ బిల్లును తీసుకు వచ్చిన సంగతి విదితమే. అంతే కాదు జాతీయ స్థాయి విద్యాసంస్థల్లోనూ భారీ సంఖ్యలో సీట్లను పెంచారు. ఐతే, ఉద్యోగాల మీదే యువత ఎక్కువ మక్కువ చూపిస్తున్న తరుణంలో... రైల్వేలో నాలుగు లక్షల ఉద్యోగాలు సృష్టించినట్టు మంత్రి పీయూష్ గోయెల్ నిరుద్యోగులను ఊరించే ప్రయత్నం చేశారు. ఇంతకాలం ఉద్యోగాల గురించి పల్లెత్తు మాట్లాడని కేంద్రం అకస్మాత్తుగా రైల్వేమంత్రి ద్వారా ప్రకటన ఇప్పించటాన్ని

### యువతకు బీజేపీ గాలం

- రైల్వేలో 2.30 లక్షల పోస్టుల భర్తీకి కసరత్తు
- 4 లక్షల పోస్టులు భర్తీ లక్ష్యం : మంత్రి పీయూష్ గోయెల్
- ఇది మరో టోకరా : చిదంబరం

యువతపై ఎన్నికల వల విసిరినట్టు ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపడుతున్నట్టు కేంద్ర రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయెల్ ప్రకటించారు. కనీసం 2.30 లక్షల మందిని నియమించాలని భారతీయ రైల్వే నిర్ణయించిందని తెలిపారు. గత ఏడాది రైల్వే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన లక్షా యాభైవేల మంది ఉద్యోగాల్లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికే నోటిఫై చేసిన ఖాళీలను భర్తీ చేసిన తర్వాత మరో 1,32,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, దీనికి తోడు రానున్న రెండేళ్లలో దాదాపు లక్షమంది ఉద్యోగ విరమణ చేయనున్నారని, ఈ పోస్టులకు

- మిగతా 2 లో

## ఇదీ లోకం!



ప్రపంచం

## సిరియాలో 43 మంది ఉగ్రవాదుల హతం

**బాగ్దాద్ :** తమ దేశ సరిహద్దుకు అవల సిరియాలో తిష్టవేసిన ఇస్లామిక్ ఉగ్రవాదుల స్థావరాలపైన తమ సైన్యం కాల్పులు జరపగా 43 మంది ఉగ్రవాదులు హతమైనట్టుగా ఇరాక్ పార్లమెంటులో అదేశ పదాతి దళాల విభాగం హషద్‌షాబి తెలిపింది. తమకు తెలిసిన సమాచారం ప్రకారం ఉగ్రవాదుల అప్రమత్తమయ్యేలోపే తమ దళాలు వారి స్థావరాలపై నిర్దిష్టంగా షెల్లింగ్ నిర్వహించారని హషద్‌షాబి వెల్లడించింది. ఇరాక్‌లోని పశ్చిమప్రాంతంలోగల అన్‌బర్ రాష్ట్రంలో హషద్‌షాబి బ్రిగేడ్స్ ఉన్నాయి. ఇరాక్ సిరియా సరిహద్దుల్లో తమ సైన్యాన్ని నిలిపివుంచినట్టుగా పదాతిదళాల నాయకుడు ఖాసింముస్లిహ్ వెల్లడించారు. ఇరాక్‌లో ఐఎస్ ఉగ్రవాదులను ఆదేశ సైన్యం దాదాపు పూర్తిగా తుడిచిపెట్టింది. ఈనేపథ్యంలో అక్కడి పరిస్థితి గణనీయంగా మెరుగుపడినట్టు వార్తలు అందుతున్నాయి. అయితే అక్కడక్కడ తీవ్రవాదులు ఇప్పటికీ పనిచేస్తూనే ఉన్నారు.

## ఖతార్ సాయం కోరిన సూడాన్

**దుబాయ్ :** సూడాన్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వారంరోజులకు పైగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సూడాన్ అధ్యక్షుడు వొమర్‌అల్-బషీర్ ఖతార్ రాజు షేక్‌తమీమ్‌బిన్‌అహమ్మద్‌అల్‌థని ఆర్థిక సహాయాన్ని కోరారు. బషీర్ ఖతార్‌లో పర్యటించి థనీని కలుసుకున్నారని మీడియా వార్తలు తెలియజేస్తున్నాయి. వీరిరువురు కలుసుకుని చర్చించిన దృశ్యాలను ఖతార్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసింది. బషీర్‌తో పాటు పలువురు అధికారులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. సూడాన్‌లో ఆందోళనలు ప్రారంభమయ్యాక బషీర్ ఖతార్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. సూడాన్‌లో పరిణామాలపైన అక్కడి ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లపైన థనీ చర్చించారు. గత డిసెంబరులోనే సూడాన్ సహాయాన్ని కోరుతూ ఖతార్‌రాజుతో మాట్లాడగా అవసరమైన సహాయాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లుగా సూడాన్ అధికారులు తెలిపారు. 2011లో సూడాన్‌లోని దక్షిణప్రాంతాన్ని వదులుకున్న తర్వాత ఆ దేశంలోని ముడిచమురు సంపదలో 3వంతులు కోల్పోవడంతో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. కరెన్సీ విలువ గణనీయంగా పడిపోవడంతో ధరలు పెరిగాయి. గతనెలలో బ్రెడ్‌పైన సబ్సిడీని ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో ప్రజలలో తీవ్ర ఆందోళన ఏర్పడింది. ఇంధనం, గ్యాస్‌కొరత తీవ్రంగా ఉన్నది. ఎమెన్‌లో సౌదీ నాయకత్వంలో పోరాడుతున్న సంకీర్ణ దళాలకు మద్దతుగా సూడాన్ కూడా తమ దళాలను పంపింది.

# అమెరికా బరితెగింపు

**కారకాస్ :** స్వతంత్ర దేశాలలో జోక్యం చేసుకుంటూ తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటుచేసే అమెరికా వెనిజులాలోను అదేమార్గాన్ని అనుసరిస్తోంది. ఆ దేశ ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని ధిక్కరిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నికొలస్‌మదురో ప్రభుత్వాన్ని తొలగించి తాను చెప్పినట్టువినే ప్రభుత్వం ఏర్పాటుకు కొన్ని సంవత్సరాలుగా అమెరికా ప్రయత్నిస్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ ప్రతిపక్షానికి అన్ని విధాలుగా తాము అండగావుంటామని హామీయిస్తూ వీడియో మెసేజ్ పంపినవెంటనే అక్కడి ప్రతిపక్షనేత జువాన్‌గుయ్‌డొ ఆధ్వర్యంలో ప్రతిపక్షఫ్రంట్ మదురొ ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించారు. తానే తాత్కాలిక అధ్యక్షుడినని గుయ్‌డొ ప్రకటించుకున్నారు. రెండురోజులుగా దేశంలో ప్రతిపక్ష ఫ్రంట్ మదురొ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తూ హింసాయుత ఘర్షణలకు తెరలేపింది. గుయ్‌డొను తాము సమర్థిస్తున్నామని, అన్నిరకాల సహాయాన్ని అందిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వెంటనే అధ్యక్షుడు మదురొ అమెరికాకు చెందిన దౌత్యవేత్తలంతా 72 గంటల్లో దేశాన్ని విడిచివెళ్లాలని ఆదేశించారు. మదురొకు క్యూబా, బొలీవియా, రష్యా, లాటిన్ అమెరికాలోని లిమా గ్రూపులో కొన్ని దేశాలతో పాటు మెక్సికో తమ తోడ్పాటును ప్రకటించాయి. గుయ్‌డొ తానే అధ్యక్షుడినని ప్రకటించుకున్న సందర్భంగా మదురొకు అనుకూలంగా వేలాదిమంది ప్రజలు అధ్యక్ష భవనంవద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాతో దౌత్య సంబంధాలను తెంచుకుంటున్నట్లు ప్రకటించారు. క్యూబా, బొలీవియాతోపాటు టర్కీ కూడా మదురొకు తన తోడ్పాటును ప్రకటించింది. మెక్సికో, గయానా, శాంటాలుసియా దేశాలు మదురొకు తోడ్పాటును ప్రకటించాయి.

**అమెరికాతో సంబంధాలు కట్ :**

తిరుగుబాటు నాయకుడు గుయ్‌డొను గుర్తిస్తూ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ఆదేశ దౌత్యవేత్తలంతా 72 గంటలలోపు దేశం విడిచి వెళ్లాలని మదురొ ఆదేశించారు. బుధవారం జరిగిన తిరుగుబాటు సంఘటనపై మదురొ మీడియాతో మాట్లాడారు. వెనిజులాలో ఆర్థిక సంక్షోభానికి ప్రధాన కారణం అమెరికా విధించిన ఆంక్షలే. వెనిజులా నుండి ముడిచమురు ఎగుమతికి కూడా అమెరికా ఆంక్షలు విధించడంవల్ల అక్కడ ఆర్థిక పరిస్థితులు తల్లకిందులయ్యాయి. దీన్ని ఆసరా చేసుకుని ప్రతిపక్షం అమెరికా అండతో దేశవ్యాప్తంగా ఆందోళనలను నిర్వహిస్తూ వస్తోంది. మదురొ



ఆదేశాన్ని తాము తెక్కచేయబోమని, తమ దౌత్యవేత్తలంతా అక్కడే ఉంటారని అమెరికా విదేశాంగశాఖ పేర్కొంది. గుయ్‌డొ తాను అధ్యక్షుడిగా ప్రకటించుకున్న తరువాత విదేశాల సహకారానికి విజ్ఞప్తి చేశారు. ఈనెలలోనే మదురొ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. అత్యధిక ద్రవ్యోల్బణ పరిస్థితుల నుండి దేశాన్ని రక్షించేందుకు తాత్కాలిక ప్రభుత్వాన్ని కూడా తాను అన్ని చర్యలు తీసుకుంటానని, అమెరికా వాషింగ్టన్ నుండి వెనిజులాను పరిపాలించాలని కోరుకుంటున్నదని మదురొ విమర్శించారు. కీలుబొమ్మ ప్రభుత్వం అవసరమా? సొంత ప్రభుత్వం కావాలా? కీలుబొమ్మ ప్రభుత్వం కావాలా? ప్రజలు నిర్ణయించుకోవాలని తన మద్దతుదారులనుద్దేశించి మాట్లాడుతూ మదురొ అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక ముడిచమురు నిల్వలు వెనిజులాలో ఉన్నాయి. అమెరికా చర్యలమూలంగా ఈ చమురును కావల్సినంతగా ఎగుమతి చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రూపొందించిన కొత్త రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవి ఖాళీ అయితే ఆ తర్వాత 30 రోజుల్లో ఎన్నికలు జరుపవలసి ఉంటుంది. ఎన్నికలు పూర్తయ్యేవరకు జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు తాత్కాలికంగా దేశ అధ్యక్షుడుగా పనిచేస్తారు. మదురొ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ అసెంబ్లీలో (కాంగ్రెస్) చేసిన నిర్ణయాలన్నీ చెల్లబోవని ప్రకటించింది.

**మదురొకు పలు దేశాల మద్దతు :**

మదురొకు బొలీవియా, రష్యా, చైనా, టర్కీ, క్యూబా, మెక్సికొ, గుయానా, శాంటాలుసియా తదితర దేశాలు మద్దతు ప్రకటించాయి. అదే సమయంలో లిమా గ్రూపుకు చెందిన 11 దేశాలు గుయ్‌డొకు మద్దతు ప్రకటించాయి. గుయ్‌డొ ఆధ్వర్యంలోని ప్రతిపక్ష ఫ్రంట్ ప్రదర్శనల పేరుతో అల్లకల్లోలం సృష్టించింది. బొలీవియా అధ్యక్షుడు ఎఒమొరేల్స్ అమెరికా బరితెగింపు చర్యను

- వెనిజులాలో తిరుగుబాటును రెచ్చగొట్టిన ట్రంప్ ప్రభుత్వం
- అమెరికాతో సంబంధాలు కట్ : మదురొ
- మదురొకు రష్యా, క్యూబా, బొలీవియా తదితర దేశాల తోడ్పాటు
- అధ్యక్షుడిగా ప్రకటించుకున్న ప్రతిపక్షనేత గుయ్‌డొ
- గుయ్‌డొకు అమెరికా అనుంగుదేశాల మద్దతు
- అమెరికా దౌత్యవేత్తల బహిష్కరణ

సామ్రాజ్యవాద దాడిగా ప్రకటిస్తూ మదురొకు, దేశ ప్రజలకు తమ పూర్తి తోడ్పాటును తెలియజేశారు. సామ్రాజ్యవాదం ప్రజాస్వామ్యాన్ని, ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని హరించివేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్‌మాన్యుయల్‌లోపెజ్‌ఒబ్రడార్ ప్రతినిధి మాట్లాడుతూ తాము మదురొకు మద్దతు ప్రకటిస్తున్నామని, అయితే ఆదేశ వ్యవహారాలలో జోక్యం చేసుకోబోమని తెలిపారు. పరిస్థితిని విశ్లేషిస్తున్నామని ఆ ప్రతినిధి వెల్లడించారు. ఆ దేశంతో దౌత్యసంబంధాలను కొనసాగిస్తామని అక్కడ పరిస్థితులు దిగజారడానికి అమెరికా సామ్రాజ్యవాదం, దాని అనుచర కొలంబియా తీరుతెన్నులు కారణమని ఆయన పేర్కొన్నారు. మదురొకు వ్యతిరేకంగా అమెరికా తీసుకున్న చర్యలను రష్యా తీవ్రంగా ఖండించింది. వెనిజులా మిత్రదేశంగావున్న రష్యాకు చెందిన ఎంపీలంతా మదురొకు తోడ్పాటును ప్రకటించారు. ఆదేశంలో కలర్ విప్లవాన్ని తీసుకురావాలని అమెరికా కోరుకుంటున్నదని రష్యా విదేశీ వ్యవహారాల కమిటీ డిప్యూటీ ఛైర్మన్ ఆండ్రయ్‌క్లిమోవ్ అన్నారు. అక్కడి పరిస్థితులను గమనించి తగిన విధంగా స్పందిస్తామని ఆయన పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్ వెనిజులా పరిణామాలపై స్పందిస్తూ అక్కడ స్వేచ్ఛగా ఎన్నికలు జరిపి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం పరిష్కారంగా భావిస్తున్నట్టు పేర్కొంది.

# ట్రంప్ లేఖపై కిమ్ సంతృప్తి

**సియోల్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంపిన లేఖపైన తాను పూర్తి సంతృప్తిగా ఉన్నట్టు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌వున్ తెలియజేశారని ప్రభుత్వ మీడియా ప్రకటించింది. ఇటీవల ట్రంప్‌ను కలుసుకుని తిరిగివచ్చిన దూత గురువారం కిమ్‌కు లేఖ అందించారు. ఫిబ్రవరి చివరిలోపు కిమ్, ట్రంప్‌లు 2వసారి భేటీకానున్నారు. ఇందుకు సంబంధించిన తేదీలను, వేదికను త్వరలో ప్రకటిస్తామని కూడా ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ట్రంప్‌నుండి వ్యక్తిగతమైన లేఖ అందిందని, తాను ఎంతగానో సంతృప్తి చెందానని కిమ్ పేర్కొన్నట్టు దక్షిణకొరియా సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ట్రంప్‌నుండి అందిన లేఖను చదువుకున్న కిమ్ నవ్వుతూ కనిపించారని, ఆయనతోపాటు ఆయనకు సన్నిహితుడైన కిమ్‌యాంగ్‌చోల్ కూడా ఉన్నారని ఆ వార్తాసంస్థ తెలిపింది. ట్రంప్ సానుకూలమైన మార్గంలోనే ఆలోచిస్తున్నట్టు తాము విశ్వసిస్తున్నామని కిమ్ పేర్కొన్నట్టుగా ఆ వార్తాసంస్థ తెలిపింది. 2వ



శిఖరాగ్ర సమావేశానికి ఏర్పాట్లు చేయవలసిందిగా కిమ్ అధికారులను కోరారు. గత ఏడాది జూన్‌లో సింగపూర్‌లో ట్రంప్, కిమ్ మొదటిసారి భేటీ అయ్యారు. అప్పుడు అస్పష్టమైన అవగాహనతో కూడిన ఒడంబడికపై సంతకాలు జరిగాయి. కొరియా ద్వీపకల్పంలో అణునిరాయుధీకరణను అమలు చేస్తామని కిమ్ వాగ్దానం చేశారు. అయితే తమ భద్రతకు హామీ లేకుండా ఏకపక్షంగా అణునిరాయుధీకరణను అమలు చేయబోమని కిమ్ స్పష్టం చేశారు. అమెరికా చేసిన వాగ్దానాలకు కూడా అది నెరవేర్చుకోవాలని ఆయన కోరారు.

# మళ్లీ జైలుకు ఫుజిమోరి

**లిమ :** పెరూ మాజీ అధ్యక్షుడు ఫుజిమొరికి 2009లో 25 ఏళ్ల జైలుశిక్షను కోర్టు విధించింది. ఆయన ప్రభుత్వకాలంలో తిరుగుబాట్లు అణచివేసేందుకు పౌరులను సామూహికంగా హత్యగావించేందుకు అవసరమైన స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్టు వచ్చిన ఆరోపణలు రుజువుకావడంతో 25 ఏళ్ల జైలుశిక్షకు గురయ్యారు. ఈనెల 23వ తేదీతో 12 ఏళ్ల జైలుశిక్షను ఆయన పూర్తి చేశారు. 80 ఏళ్ల ఫుజిమొరి తీవ్ర అస్వస్థతకు గురైనందున వైద్యబృందం ఆయనను ఆసుపత్రికి తరలించి పరీక్షలు చేయించింది. అనంతరం మళ్లీ జైలుకు తరలించారు. ఆయన పెట్టిన క్షమాభిక్షను కూడా ప్రభుత్వం రద్దుచేసింది. పెరూను 1990 నుండి 2000 వరకు ఆయన పాలించారు. అత్యంత నిరంకుశమైన పాలన అందించినట్టు ప్రజలు ఆయనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి బాగా క్షీణించిందని వైద్య బృందాలు తెలిపాయి. జైలులోనే ఆయనకు అన్నివిధాలుగా వైద్య చికిత్సను అందించనున్నట్టు



ప్రభుత్వం తెలిపింది. ఏడాది క్రితం ఆయనకు క్షమాభిక్ష పెట్టినప్పుడు ఆయన మద్దతుదారులు సంబరాలు జరుపుకున్నారు. అప్పటి అధ్యక్షుడు పెడ్రొపాబ్‌లోవుజినిస్కి ఫుజిమొరికి క్షమాభిక్ష ప్రకటించారు. ఫుజినెస్కిపైన అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన పదవికి రాజీనామా చేశారు. దీంతో సుప్రీంకోర్టు ఫుజిమొరికి పెట్టిన క్షమాభిక్షను రద్దు చేసింది.

## మళ్లీ వెనక్కి వెళ్లం : అరోరా

**న్యూఢిల్లీ :** వచ్చే సార్వత్రిక ఎన్నికలలోనూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలను) కొనసాగిస్తామని ఎన్నికల ప్రధానాధికారి సునీల్ అరోరా స్పష్టం చేశారు. ఈవీఎంలపై ఎలాంటి విమర్శలు, వివాదాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈవీఎంలను వినియోగించవద్దని, బ్యాలెట్ బాక్సులకు వెళ్లమని ఎవరూ తమను బెదిరించ లేదా భయపెట్టలేరని అన్నారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఇక్కడ నిర్వహించిన ఒక కార్యక్రమంలో అరోరా మాట్లాడుతూ, ఈవీఎంలను 'ఫుట్‌బాల్'గా వినియోగిస్తున్నారని విమర్శించారు. కొన్ని వర్గాలు ఈ అంశాన్ని కావాలని వివాదం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంలను హ్యాకింగ్ చేయొచ్చని, 2014 ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిం దంటూ సైబర్ నిపుణుడిగా చెప్పుకున్న సయ్యద్ షుజా ఇటీవల చేసిన ఆరోపణలు రాజకీయ దుమారానికి దారితీశాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్లే వాడలంటూ ప్రతిపక్షాలు డిమాండు చేస్తున్నాయి. 'తిరిగి కాగితం బ్యాలెట్ల రోజులకు వెళ్లే ప్రసక్తే లేదు. మేం ఈవీఎంలనే కొనసాగిస్తాం. 2014 నుంచి ఇప్పటివరకు అనేక ఎన్నికలు జరిగాయి. కొందరు గెలిచారు. కొందరు ఓడిపోయారు. గెలిచిన వారికి ఈవీఎంలు మంచివే. ఓడిపోయిన వారు అవి సరిగా లేవని అంటారు. ఈవీఎంలేం ఫుట్‌బాల్ కాదు. దేశంలో రెండు దశబ్దాలుగా ఈవీఎంలను ఉపయోగిస్తున్నాం. రాజకీయ పార్టీల డిమాండ్ల దృష్ట్యా ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు వీవీప్యాట్ యంత్రాలను కూడా తీసుకొచ్చాం' అని అరోరా చెప్పారు. "రాజకీయ పార్టీలతో సహా సంబంధికులందరి నుంచి ఏ విమర్శనైనా, సూచననైనా ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని స్పష్టం చేశారు.

## అడిగితే .. జోన్లు ఇచ్చేస్తారా!? !!

(మొదటిపేజీ తరువాయి)

విధానపర నిర్ణయమన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం కూలంకషంగా పరిశీలిస్తుందన్నారు. ప్రజల నుంచి జోన్లు ఏర్పాటు చేయాలంటూ ఎన్నో డిమాండ్లు వస్తుంటాయని, ప్రజలు అడిగినట్లుగా తాము రైల్వేజోన్లను మంజూరు చేస్తూ పోలేమని కాస్త కటువుగానే వ్యాఖ్యానించారు. ఇప్పటికే చాలినన్ని రైల్వే జోన్లు ఉన్నాయని, ఇక కొత్తగా ఎక్కడ రైల్వే జోన్లు ఏర్పాటు చేయాలంటూ ? ఎదురు ప్రశ్నించారు.

**కొత్త రైల్వే మార్గాలకు అధిక ప్రాధాన్యం**

రాయలసీమను నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతితో సంపూర్ణంగా అనుసంధానిస్తామని, ఇందుకోసం రైల్వే శాఖ కంకణం కట్టుకుని పనిచేస్తోందని రైల్వే శాఖ సహాయమంత్రి రాజేన్‌గోహెన్ స్పష్టం చేశారు. గుంతకల్లులో రూ.50 కోట్లతో నిర్మించిన నూతన రైల్వే స్టేషన్‌ను భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సీమను అమరావతికి అనుసంధానించే అతిముఖ్య మార్గమైన గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని గుత్తి - పెండేకల్లుతోపాటు సుమారు 426 కిలోమీటర్ల గుంతకల్లు - నల్లపాడు సెక్షన్‌ను పూర్తిగా విద్యుదీకరించామన్నారు. రూ. 432 కోట్ల రుపాయల అంచనా వ్యయంతో 2012-13 లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు పనులను గడచిన మూడేళ్లల్లో పరుగులు పెట్టించామన్నారు. ఇక ఢిల్లీ, ముంబై, సికింద్రాబాద్‌ల నుంచి బెంగుళూరు వెళ్లే ప్రధాన రైలు మార్గంతో అనుసంధానమయ్యే గుంతకల్లు - కల్లూరు బైపాస్ రైలు మార్గం దాదాపు 41 కిలోమీటర్లను డబ్లింగ్ పనులు పూర్తి చేయబోతున్నామన్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గూళపాల్యం నుంచి ఖాదర్‌పేట స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజ.క్టుపై రూ.210 కోట్లు వెచ్చించామన్నారు. ఈ మార్గం పూర్తి అయితే గుంతకల్లు - గుత్తి ప్రధాన మార్గంపై ట్రాఫిక్ భారం తగ్గుతుందన్నారు. బెంగుళూరు వైపు నిరంతరాయంగా రవాణా సాగడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఇదే సందర్భంలో ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్యాసింజరు రైళ్లను నడపడానికి అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎం విజయప్రతాప్‌సింగ్, గుంతకల్లు మున్సిపల్ ఛైర్ పర్సన్ కోడెల అపర్ణ, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా, సీనియర్ డీసీఎం రాకేష్, మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ హరిప్రసాద్, పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట సవరణపై
## స్టేకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట సవరణపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

ఈ చట్టం కింద అరెస్టు చేసిన వారికి ముందస్తు బెయిల్‌ను రద్దు చేస్తూ చట్ట సవరణ చేయుటంపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలో జస్టిస్ యుూయుూ లలిత్‌తో కూడి ద్విసభ్య ధర్మాసం గురువారం తోసిపుచ్చింది. గతేడాది మార్చి 20న సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టంలో సవరణ చేస్తూ తీర్పు వెలువరించింది. చట్టంలో సవరణలు చేయటాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలవ్వగా, కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

## మీరే కొండంత అండ..!

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారే కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా వారిని అవమానించారని గుర్తు చేశారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని ఎన్టీ రామారావు అంటే, పేదరికం లేని సమాజం చూడాలనేది తాను ఆశయంగా పెట్టుకున్నానన్నారు. పేదల్లో ఎక్కువ మంది బీసీలే. అందుకే బీసీల ఉన్నతికి కృషి చేస్తూ వచ్చామన్నారు. కులవృత్తులు, చేతివృత్తులతో ఆర్థికంగా నిలదొక్కుకోని బీసీల కోసం ఆదరణ పథకం ప్రవేశపెట్టామన్నారు. పేదల పట్ల తమకు ప్రేమ, మనసు ఉండబట్టే, ఆర్థికంగా లోటులో ఉన్నా పెన్షన్లు పది రెట్లు పెంచామన్నారు. టీడీపీకి అండగా ఉండే వారి రుణం వచ్చే ఐదేళ్లలో తీర్చుకుంటామన్నారు. బీసీలు లేకపోతే తెలుగుదేశం పార్టీ లేదు. వారు వెన్నంటి ఉన్నంతవరకు టీడీపీని ఏ శక్తి ఏమీ చేయలేదన్నారు. పసుపు-కుంకమ కింద స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.10 వేల చొప్పున ఇస్తున్నామని, ఇందులో ఎక్కువ లబ్ధిపొందేది వెనుకబడిన తరగతికి చెందిన వారే ఉన్నారని చెప్పారు. చంద్రన్న బీమా, పెళ్లికానుక వంటి సంక్షేమ పథకాలతో పాటు, అన్న క్యాంటిన్ల ద్వారా వారికి సేవ చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వాలు బీసీ ఫెడరేషన్లకు కుర్చీలు,బెంచీలు కూడా ఇవ్వలేదని, టీడీపీ బలపడుతుందనే అణిచేశారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పేద చిన్నారుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని నేనే ప్రవేశ పెట్టాను. ఇప్పుడు గర్భిణీలకు సీమంతాలు చేస్తున్నాం, ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.5లక్షలకు పెంచుతున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగే వరకు, ఆదాయం పెరిగేదాకా మేం అండగా ఉంటామని అభయమిచ్చారు. చేతివృత్తులే బీసీల ఆస్తి. వారసత్వ సంపద. ఆధునీకరణ వల్ల చేతివృత్తులు దెబ్బతిన్నాయి. అందుకే ఆదరణ పథకం తెచ్చామన్నారు.

## ఉద్యోగాల ఎర...!

(మొదటిపేజీ తరువాయి)

కూడా భర్తీ చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించినట్టు తెలిపారు. త్వరలోనే నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని చెప్పారు. 2019 ఫిబ్రవరి, మార్చిలో 131,328 పోస్టుల భర్తీకి తొలి దశ ప్రారంభమవుతుందని గోయెల్ చెప్పారు. రిజర్వేషన్ పాలసీ ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు 19,715 పోస్టులు, షెడ్యూల్డ్ తెగలకు 9,857 పోస్టులు, ఓబీసీలకు 35,485 పోస్టులను రిజర్వు చేసినట్టు చెప్పారు. పార్లమెంట్ ఆమోదించిన 103వ రాజ్యాంగ సవరణ ప్రకారం, ఈబీసీలకు 10 శాతం (సుమారు13,100 పోస్టులు) కేటాయిస్తామని, 2020, ఏప్రిల్ 20, నాటికి ఈ మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని పియూష్ గోయల్ వివరించారు.

**కేవలం టోకరా : చిదంబరం**

న్యూఢిల్లీ : వచ్చే రెండేళ్లలో రైల్వేలో 3 లక్షలకు పైగా ఉద్యోగాలిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనపై మరో మోసపూరిత ఎత్తుగడని, ఎన్నికల జిమ్మిక్ అని కాంగ్రెస్ నేత పి.చిదంబరం విమర్శించారు. 'ఒకవైపు ప్రభుత్వ విభాగాలలో ఖాళీ పోస్టులు.. మరో వైపు నైరాశ్యంలో నిరుద్యోగులు.. కథ పాతదే' అంటూ చిదంబరం ట్వీట్ చేశారు. ఐదేళ్ల వరకు 2,82,976 పోస్టులను భర్తీ చేయని రైల్వే శాఖ ఇప్పుడు ఆకస్మికంగా మూడునెలల్లో భర్తీ చేస్తామనడం మోసపూరిత ఎత్తుగడ తప్ప మరేమీ కాదు అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆరు నెలల్లో 1.31 లక్షల ఉద్యోగాలు, మరో రెండేళ్లలో మరో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని రైల్వేమంత్రి పియూష్ గోయల్ బుధవారం ప్రకటించారు. దీనిని చిదంబరం జిమ్మిక్‌గా అభివర్ణించారు. కాగా, ఇండియన్ రైల్వేస్‌లో మొత్తం 15,06,598 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 12,23,622 మంది మాత్రమే ఉన్నారు. మిగతా 2,82,976 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1,51,548 పోస్టుల భర్తీ కొనసాగుతుండగా మరో 1,31,428 ఖాళీ పోస్టులు ఉన్నాయి.

## విద్వేష చిహ్నం మోడీ

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గుజరాత్ అయినా యూపీ లేదా తమిళనాడైనా.. ఏ రాష్ట్రమైనా కాంగ్రెస్ అగ్రభాగన ఉండి పోరాడుతుందని తెలిపారు. యూపీ విధాన సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్న విశ్వాసాన్ని రాహుల్ వ్యక్తం చేశారు. తాను, తన తల్లి సోనియాగాంధీ, సోదరి ప్రియాంక గాంధీ అమేథి ప్రజల తరపు సైనికులంటూ ఆయన అభివర్ణించారు. ఇచ్చిన ఒక్క హామీని మోడీ నిలబెట్టుకోలేదని, ఉద్యోగ కల్పనలో విఫలమయ్యారని మోడీని విమర్శించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్నందునే ఈ నియోజకవర్గంలో అభివృద్ధిని యోగి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయిలో మోడీ, యోగి ప్రభుత్వాలు అడ్డుకున్న పనులన్నింటిని చేపడతామని, ఫుడ్‌పార్క్‌ను 99శాతం కాదు 101 శాతం చేసి చూపిస్తామని రాహుల్ హామీనిచ్చారు. కులం, మతం, ప్రాంతం అంటూ విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు బీజేపీ వర్గాలు యత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'యూపీ, బీహార్‌లలోని గుజరాతీలను వారు వెళ్లగొడతారు.. హిందువులు, ముస్లింల మధ్య చిచ్చు పెడతారు. నరేంద్ర మోడీ అంటేనే ద్వేషం. ఆయన ద్వేషానికి చిహ్నం. 2019లో మోడీని గద్దెదించుతాం. మమ్మల్ని ఎవ్వరూ ఆపలేరు' అని రాహుల్ ఉద్ఘాటించారు.

## నేనూ విచారణ చేయలేను

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఈ నెల పదిన ప్రధాని మోడీ, ప్రతిపక్ష పార్టీ సభ్యుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ ప్రతినిధి ఏకే సిక్రీతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ కుమార్ వర్మను తొలగించిన విషయం విధితమే. అదే రోజున తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నే నాగేశ్వరరావును కమిటీ సిఫార్సు చేసింది. తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు నియామకాన్ని సవాల్ చేస్తూ సమాచార హక్కు చట్టం కార్యకర్త అంజలీ భరద్వాజ్‌తోపాటు మరో ఎన్‌జీఓ సంస్థ పిటిషన్‌ను దాఖలు చేసింది. వీరి తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావే వాదిస్తున్నారు. ఈ పిటిషన్‌ను తాను విచారణ చేయలేనని, అందుకే వైదొలుగుతున్నట్లు న్యాయవాదికి తెలిపారు. 'నా పరిస్థితిని అర్థం చేసుకోండి. నేను ఈ కేసును విచారణ చేయలేను' అని సిక్రీ స్పష్టం చేశారు. దీనిపై దావే మాట్లాడుతూ, 'ఈ కేసు అందరికీ విసుగు తెప్పిస్తోంది. తొలుత సీజేఐ గొగోయ్ విచారణ నుంచి వైదొలగారు. ఇప్పుడు మీరు కూడా విచారణ చేయలేనంటున్నారు' అని పేర్కొన్నారు. జస్టిస్ సిక్రీ కేసును విచారణ చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరంలేదని చెప్పారు. సీబీఐ డైరెక్టర్ నియామక విధానం పారదర్శకంగా ఉండాలనే కోరుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ తరపు న్యాయవాది అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ మాట్లాడుతూ, సిక్రీ ధర్మాసనం విచారణ చేసేందుకు తమకూ అభ్యంతరంలేదన్నారు.

## జనధనమన..!

(మొదటిపేజీ తరువాయి)

(బీఏఎల్)కు అప్పగించింది. వంద అడుగుల పొడువు కలిగిన ఉక్కు స్తంభానికి 20 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవు కలిగిన మువ్వన్నెల జెండాను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో దూరం నుంచి అందరికీ స్పష్టంగా కన్పించే విధంగా రంగు రంగుల విద్యుద్దీపాలను అమర్చారు. వీటి నిర్వహణ బాధ్యతలను ఆయా స్టేషన్లలోని రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్)కు అధికారులు అప్పగించారు. ఒక్కో జెండాకు రూ. 10లక్షలు వెచ్చించడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 75 ఏ-1 కేటగిరి స్టేషన్ల పరంగా మొత్తం రూ. 7.50 కోట్లను రైల్వేశాఖ వెచ్చిస్తోంది. అయితే తాజాగా గురువారం గుంతకల్ రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పథకాల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రైల్వేశాఖ సహాయమంత్రి రాజెన్ గోహేన్ వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దీంతో ఏ-1 కేటగిరితోపాటు ఏ కేటగిరి స్టేషన్లలోనూ భారీ త్రివర్ణ పతకాలను ఎగుర వేయనున్న సంకేతాలను మంత్రి ఇచ్చినట్లయింది. ప్రస్తుతం దేశంలో 75 ఏ-1 కేటగిరి స్టేషన్లు ఉండగా దక్షిణ మధ్య రైల్వేలో 5 ఉన్నాయి. అలాగే ఏ కేటగిరిలో దేశంలో 332 స్టేషన్లు ఉంటే వాటిలో దక్షిణ మధ్య రైల్వేలో 31 స్టేషన్లు ఉన్నాయి. ఈవిధంగా ఏ-1 కేటగిరితోపాటు ఏ కేటగిరి స్టేషన్లలో జాతీయ పతకాలను ఏర్పాటు చేయాలంటే రూ. 33.20 కోట్లను వెచ్చించాల్సి ఉంటుంది. ఇంత భారీ మొత్తం ప్రజాధనాన్ని త్రివర్ణ పతకాలను ఏర్పాటు చేసేందుకు ఖర్చు చేయడం అవసరమా? అనే ప్రశ్నలు రైలు విని యోగదారుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కేవలం జాతీయ పతాకాల కోసం సుమారు రూ. 40 కోట్లు గాలిలో పోసినట్లే అవుతుందని విమర్శలు వస్తున్నాయి. ఏటా స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ప్రధాన స్టేషన్ భవనాలపై ఎలాగూ జాతీయ జెండాలను ఎగురవేస్తారు. నిత్యం ఎగిరే జండా ఎండకు, వానకు పాడైపోవడం ఖాయం కనుక వీటి కోసం ఏటా మరింత ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఇక విద్యుద్దీపాల నిర్వహణకు కూడా అదనంగా ఏటా వ్యయం కానుంది. జాతీయ భావాన్ని పెంచడానికి కోట్లాది రూపాయలు వెచ్చించాలా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**తాగునీరు లేని స్టేషన్లెన్నో..**

రైల్వేశాఖ ప్రయాణీకులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తామంటూ ఏటా వందలాది కోట్లను ఖర్చు చేస్తున్నప్పటికీ తాగునీరు కూడా లభించని అనేక స్టేషన్లు ఇప్పటికీ ఉన్నాయంటే అతిశయోక్తిలేదు. చాలా స్టేషన్లలో ప్లాట్‌ఫారాలపై కుళాయిలు దర్శనం ఇస్తాయే తప్ప వాటిలో నీటి బొట్టు కూడా రాలని పరిస్థితి. అనేక రైల్వేస్టేషన్లలో 'రాత్రి వేళల్లో విద్యుద్దీపాలు వెలగవు.. ఫ్యాన్లు తిరగవు.. మరుగుదొడ్లు వినియోగానికి పనికిరావు.. ఎండా, వానలనుంచి రక్షణకు సరైన షెల్టర్లు లేవు.. కడుపు నింపుకునేందుకు తినుబండారాలు లభ్యంకావు..' అని ప్రయాణీకులు రైల్వేశాఖ తీరును ఎండగడుతున్నారు. కనీస సౌకర్యాలను విస్మరించి భారీ త్రివర్ణ పతాకాలను ఎగురవేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేస్తున్నారు. ప్రధాన స్టేషన్లలో ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫుడ్‌ప్లాజాలు, మల్టీప్లెక్స్‌లు, ఏసీ విశ్రాంతి మందిరాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి వాటి నిర్వహణను ప్రైవేటుకు అప్పగించి ప్రయాణీకులను దోచుకుంటోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న, మధ్య తరహా రైల్వేస్టేషన్లలో కనీస సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తే గ్రామీణ ప్రాంతాలకు చెందిన సాధారణ ప్రయాణీకులకు మేలు చేకూరగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దిశలో రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాబుతో పరోక్ష పొత్తు అవాస్తవం..!

## వైసీపీ దుష్ప్రచారం తిప్పికొడతాం : రఘువీరా



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీతో కాంగ్రెస్ పార్టీ పరోక్ష పొత్తులకు దిగుతోందంటూ వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడతామని, దీనిపై జగన్ తమకు క్షమాపణ చెప్పాలని పీసీసీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి డిమాండు చేశారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 22, 23 తేదీల్లో పీసీసీ సమన్వయ కమిటీ, కార్యవర్గ సమావేశాల్ని ఏర్పాటు చేసుకుని, ఒంటరిగా బరిలోకి దిగాలని నిర్ణయించామన్నారు. రాయలసీమ, దక్షిణ కోస్తాలలో ఓట్లు చీల్చడమే లక్ష్యంగా కాంగ్రెస్, టీడీపీల మధ్య రహస్య అవగాహన ఉన్నట్లు వైసీపీ ప్రచారం చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ అభ్యర్థులను చంద్రబాబే ఎంపిక చేస్తారని, వారికి డబ్బులూ టీడీపీనే ఇస్తుందని దుష్ప్రచారం చేయడం దారుణమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నుంచి వైసీపీ చీలి చిన్న పార్టీగా ఉందన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్‌పై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు సీడీ మెయ్యప్పన్, క్రిష్టోఫర్ తిలక్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు జంగా గౌతమ్, మీసాల రాజేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్ పాల్గొన్నారు.

## సీఎంకి జేఏసీ కృతజ్ఞతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చిరు ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చడానికి ప్రభుత్వం జీవోలు 43,34ను విడుదల చేయడం సంతోషకరమని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఫణిపేర్రాజులు పేర్కొన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఉద్యోగులు హైదరాబాద్‌లో ఇళ్లు, ఆస్తులు వదులుకుని రావాల్సి వచ్చిందన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా స్థలాలు కేటాయించలేదని ప్రభుత్వం దృష్టికి ఏపీ జేఏసీ అమరావతి తీసుకెళ్లిందన్నారు.

## అడుగడుగునా అవమానాలే..!

### జగన్‌పై వంగవీటి రాధాకృష్ణ ఆరోపణలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైసీపీలో అడుగడుగునా తనకు అవమానాలు ఎదురయ్యాయని, రంగా ఆశయ సాధన కోసమే పార్టీ మారుతున్నానని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ వెల్లడించారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. 'తండ్రి ఆశయాలే నాకు ముఖ్యం. నా వాళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. రంగాను అభిమానించే వాళ్లు అన్ని పార్టీల్లోనూ ఉన్నారు. ఇక్కడ ఏ పార్టీ అనేది ముఖ్యం కాదు' అని రాధాకృష్ణ చెప్పుకొచ్చారు. రంగా ఒక వ్యవస్థ అని, 10మందికి ఉపయోగపడాలనే ఆశయంతో సీఎం చంద్రబాబు తనను టీడీపీలోకి ఆహ్వానించారని తెలిపారు. ఊపిరి ఉన్నంత వరకు రంగా పేరును చెడగొట్టబోనని నొక్కిచెప్పారు. తన తండ్రి విగ్రహావిష్కరణకు వెళ్లాలంటే జగన్ అనుమతి తీసుకోవాలా? అని అంటూ దీనిపై జగన్ తనను నిలదీయడం బాధించిందని, ఇది ఆయన దుశ్చర్యని మండిపడ్డారు. విగ్రహావిష్కరణకు వెళ్లినప్పుడు ఎవరి అనుమతీ అవసరం లేదన్నారు. రంగాను గౌరవించాలని జగన్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. తనపై సోషల్ మీడియాలో వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. తనను తమ్ముడిగా భావించిన జగన్..ఇంత జరుగుతున్నా తనకు ఫోన్ ఎందుకు చేయలేదని పేర్కొన్నారు. 'మీ నాన్న రంగాను చంపారనే ప్రచారమున్న పార్టీలోకి ఎలా వెళ్తారని పలువురు విలేకరులు అడిగిన ప్రశ్నలపై రాధా ఆగ్రహంగా సమాధానమిచ్చారు. తన తండ్రి హత్యకు కొంతమంది వ్యక్తులే కారణమని, దీన్ని టీడీపీపైనే రుద్దడం తగదన్నారు. తన తండ్రి హత్యకు టీడీపీనే కారణమని ఆవేశంలో చెప్పా నంటూ రాధా వివరణిచ్చారు.

# అగ్రిగోల్డ్ పోరు అద్వితీయం

- ప్రజాసంఘాలకు ఆదర్శం
- రూ.250 కోట్లు సాధించడం చారిత్రకం: ఎమ్మెల్సీ కత్తి
- సంపూర్ణ విజయమే ధ్యేయం అప్పటి వరకు విశ్రమించం
- సీతారామ్ సహా బినామీలను అరెస్టు చేయాలి :ముప్పాళ్ల



మాట్లాడుతున్న నరసింహారెడ్డి. చిత్రంలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశ్వనాథ్ రెడ్డి, తిరుపతిరావు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- తిరుపతి : అగ్రిగోల్డ్ అసోసియేషన్ నిర్వహించిన అలుపెరగని పోరాటం అద్వితీయమని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం తిరుపతి అన్నమయ్య సర్కిల్ నుంచి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశం నిర్వహించారు. కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అనేక సం ఘాల్లో పని చేశానన్నారు. ఆత్మ విశ్వాసం కోల్పోయి అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్య లకు పాల్పడుతున్న తరుణంలో అసోసియేషన్ నెలకొల్పి మనోధైర్యాన్ని కల్పించి పోరాటాల వైపు నడిపిన రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, తిరుపతిరావు, విశ్వనాథరెడ్డిల కృషి అభినందనీయమన్నారు. మీరు మోసపోతే మేము డబ్బులు కట్టివ్వాలా? దీనికి ఒక అసోసియేషన్... మిది ఒక పోరాటమా? .. సాధ్యం కాని పని అని మంత్రులు, ప్రతిపక్ష నేతలు హేళన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దశలవారీ ఉద్యమాన్ని చేపట్టి చివరకు నిరవధిక నిరాహార దీక్ష వరకు వెళ్లి రూ.250 కోట్లు సాధించడం మామూలు విషయం కాదన్నారు. ఈ ఉద్యమాన్ని మొదట హేళన చేసిన మంత్రులు, నాయకులకు ఇది చెంపపెట్టు అన్నారు. ఎనిమిది రాష్ట్రాల్లో అగ్రిగోల్డ్ బాధితులున్న ఆంధ్రప్రదేశ్‌లో అసోసియేషన్ చేసిన పోరాట ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. దీనికి సీపీఐ, ప్రజాసంఘాలు సహకారాన్ని అందించాయని తెలిపారు. ప్రతి పైసా ఇప్పించే వరకు ఉద్యమించాలని, దీనికి తన వంతుగా మండలిలో బాధితుల తరపున పోరాడుతానని హామీ ఇచ్చారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడేళ్లుగా నిర్వహించిన అలుపెరగని పోరాటం ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి బాధితులను ఆదుకునేందుకు రూ. 250 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించిందని అన్నారు. దేశంలోని 25 రాష్ట్రాల్లో ఎక్కడా ప్రభుత్వాలు కనీసం రూ. 5 కోట్లు ఇచ్చిన చరిత్రలేదని, ఆంధ్రప్రదేశ్‌లో అసోసియేషన్ సుదీర్ఘ పోరాటంతోనే అసాధ్యం సుసాధ్య మైందన్నారు. విజయవాడలో చేపట్టిన అమరణదీక్ష ప్రభుత్వానికి నిద్రలేకుండా చేసిందన్నారు. సీతారామ్‌తో పాటు బినామీలను తక్షణం అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గాంధీని చంపిన గాడ్సేకి గుడులు కట్టించిన బీజేపీ నేతలు గాంధేయ సోషలిజం పేరు చెప్పుకుని తిరగడం శోచనీయమన్నారు. ఈ కోవకు చెందిన కొందరు రాజకీయ స్వలాభం కోసం అగ్రిగోల్డ్ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తు న్నారని, బాధితులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి బాధితుడికి న్యాయం జరిగే వరకు అసోసియేషన్ అండగా నిలిచి చివరి వరకు పోరాడుతుందని పునరుద్ఘాటించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు విశ్వనాథరెడ్డి, తిరుపతి రావు మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చి రూ.250 కోట్లు ప్రకటించిందని, దీని ద్వారా దాదాపు ఏడు లక్షల మందికి లబ్ధిచేకూరుతుందన్నారు. రాష్ట్రంలో 24 సంస్థలు ప్రజలను మోసం చేశాయని, అందులో అగ్రిగోల్డ్ ద్వారా నష్టపోయిన బాధితులతో అసోషియేషన్ ఏర్పాటు చేసి సీపీఐ సహకారంతో అలుపెరగని పోరాటం సాగించామన్నారు. చివరి రూపాయి సాధించే వరకు అలసత్వం, అధైర్యం లేకుండా పోరాడేందుకు సభ్యులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా తొలి ఫలితం దక్కేవరకు పోరాటం సాగించిన ముపాళ్ల నాగేశ్వరరావు, విశ్వనాథరెడ్డి, తిరుపతి రావులను సభ్యులు శాలువ, పూలహారాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాయికృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెల్లంకొండ శ్రీనివాస్, ఉమాశంకర్, నాయకులు కృష్ణదేవరాయులు, సురేష్, సుబ్రమణ్యం, జయంతి, భాగ్యలక్ష్మి, సుబ్బు పాల్గొన్నారు.

## గ్రూప్-1, 2 దరఖాస్తుల గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహించబోయే గ్రూప్-1, 2 ప్రిలిమినరీ పరీక్షల దరఖాస్తులకు గడువు తేదీలు పొడిగించారు. గ్రూప్-1 పోస్టుల కోసం ఫిబ్రవరి 7వ తేదీలోగా అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలి. వాటికి 6వ తేదీలోగా ఫీజు చెల్లించాలి. గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు ఫిబ్రవరి 10లోగా దరఖాస్తులు, 9వ తేదీలోగా ఫీజు చెల్లించాలి. ముందస్తుగా జారీచేసిన ప్రకటనల ఆధారంగా ఈ నెలాఖరులోగా గ్రూప్-1, 2 పరీక్షలకు దరఖాస్తుల గడువు తేదీలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. యూపీపీఎస్సీ తరహాలో సిలబస్ విస్తృతంగా ఉండటం, ప్రిలిమినరీ పరీక్షకు సమయం తక్కువగా ఉండటంతో గడువు పెంచాలని పలువురు అభ్యర్థులు ఏపీపీఎస్సీ కమిషన్ కార్యాలయాన్ని అభ్యర్థించారు. దీనిపై ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో సమీక్షించి, గ్రూప్-1,2, ప్రిలిమ్స్ పరీక్షలకు దరఖాస్తుల గడువును పొడిగిస్తూ గురువారం ఏపీపీఎస్సీ తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది.

**యూనిఫాం పోస్టులకు వయోపరిమితి పెంపు**

ఏపీపీఎస్సీ గ్రూప్-1,2 విభాగాల్లోని యూనిఫాం పోస్టులకు రెండేళ్ల పాటు వయస్సు పొడిగిస్తున్నట్లు ఏపీపీఎస్సీ గురువారం వెల్లడించింది. గ్రూప్-1,2లోని పీసీ నంబరు-7,3,4 పోస్టులకు 18-28 ఏళ్లు తొలుత నిర్ణయించగా, దాన్ని 18-30కు అదనంగా రెండేళ్లపాటు పొడిగించారు. పీసీ-5, 8 పోస్టులకు 21-26 వయస్సుకు 21-28, పీసీ-8 పోస్టులకు 18-26 నుంచి 18-28కి వయోపరిమితి అవకాశం కల్పించారు. పూర్తి వివరాలను 'పీఎస్‌సీ.ఏపీ.గౌవ్.ఇన్' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

**రీసెర్చ్ ఆఫీసర్ల పోస్టులకు నోటిఫికేషన్**

ఏపీ సచివాలయంలో ఖాళీగా ఉన్న రీసెర్చ్ ఆఫీసర్ల(2-ఖాళీలు) పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పోస్టులకు డిగ్రీతోపాటు లైబ్రరీ సైన్స్ డిగ్రీని అదనపు అర్హతగా నిర్ణయించారు. అభ్యర్థుల వయస్సు 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థుల వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది. అర్హులైన వారంతా ఫిబ్రవరి 13 నుంచి మార్చి 6లోగా దరఖాస్తు చేయాలి. సిలబస్, అర్హతల సమాచారాన్ని 'పీఎస్‌సీ.ఏపీ.గౌవ్.ఇన్' వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

### పంటల బీమా ప్రీమియం

## రూ.283 కోట్లు విడుదల

- అగ్రికల్చర్ బీమా కంపెనీకి చెల్లింపు
- కరవుతో దెబ్బతిన్న రైతులకు పరిహారం
- వ్యవసాశాఖ మంత్రి సోమిరెడ్డి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కరవుతో పంటలు కోల్పోయిన రైతులకు పంటల బీమా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ వాటా ప్రీమియం విడుదలైంది. 2018-19 ఖరీఫ్, 2017-18 రబీ సీజన్‌కు సంబంధించి రూ.283.63 కోట్ల ప్రీమియం వాటాను విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ వాటా ప్రీమి యాన్ని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు చెల్లించనున్నట్లు తెలిపారు. విజయవాడలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత సంవత్సరం రబీ సీజన్‌లో తీవ్ర వర్షాభావం వల్ల రైతుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటల బీమా పథకంలో చేరిన 70 వేల మంది రైతులకు బీమా కింద కంపెనీల నుంచి రూ.129 కోట్ల పరిహారం అందించినట్లు తెలిపారు. ఒక్క కడప జిల్లాలోనే శనగపంట రైతులకు రూ.100 కోట్లు పరిహారం చెల్లించామని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌నూ వర్షాభావం వెంటాడటంతో రైతులు పంటలు వేయలేకపోయారన్నారు. దీంతో రైతులకు 25 శాతం పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. కడప జిల్లాలో 48వేల మంది రైతులకు రూ.136 కోట్లు పరిహారంగా అందనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 1.18 లక్షల మంది రైతులకు రూ.265 కోట్ల పరిహారం చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బీమా కంపెనీలకు ప్రభుత్వం రూ.205కోట్ల ప్రీమి యం వాటాను చెల్లించాల్సి ఉందన్నారు. ఈ మొత్తం చెల్లిస్తే 2018-19 ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు రూ.1,500 కోట్ల పరిహారం వచ్చే అవకాశం ఉందన్నారు. మార్చిలోగా ప్రీమియం వాటాను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# రెండు రోజుల్లో పార్లమెంట్ కమిటీలు

- కమిటీలలో 11 మంది సభ్యులు
- నాలుగు నెలల పదవీకాలం
- సహాయ సహకారాల కోసం స్పీకర్ ప్యానల్
- ప్రజా పునాదితో ఎన్నికలకు సమాయత్తం
- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖ సిటీ : జనసేన పార్లమెంట్ నియోజకవర్గాల కమిటీలు, సబ్ కమిటీలను రెండు రోజుల్లో ప్రకటించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనంలో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించటం ద్వారా గ్రామస్థాయిలో పార్టీకి ప్రజా పునాది ఏర్పాటుతో ఎన్నికలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. విశాఖ నగరంలోని సాయిప్రియ రిసార్ట్‌లో శ్రీకాకుళం జిల్లా కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పవన్ మాట్లాడుతూ, ఒక్కో పార్లమెంటరీ నియోజకవర్గానికి 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చైర్మన్‌తోపాటు పాలనా, న్యాయ విభాగాలు, స్పీకర్ ప్యానల్ ఉంటాయని చెప్పారు. నాలుగు నెలల కాలపరిమితితో ఏర్పాటు చేయనున్న కమిటీలకు ప్యానల్స్ సహాయ సహకారాలు అందిస్తాయన్నారు. వారానికి ఒకసారి ప్రజలతో పార్టీ అధ్యక్షుడు భేటీ అయ్యేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాత్రికి రాత్రే జనసేన బలాన్ని వ్యవస్థగా మార్చలేమని ఆయన స్పష్టం చేశారు. మాజీ సీఎం ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీకి క్షేత్రస్థాయిలో బలం ఉండగా, రాజకీయానుభవం గల కుటుంబం నుంచి వచ్చిన జగన్ వైసీపీని ఏర్పాటు చేశారన్నారు. రాజకీయంగా బలమైన రెండు పార్టీలను ఢీకొనా లంటే అంతకు మించిన బలాన్ని చేకూర్చుకో వాల్సిన అవసరం ఉందన్నారు. మేధావులు, అను భవజ్ఞులకు పార్టీలో ఎలాంటి స్థానం కల్పించా లోనన్న అంశంపై ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో ఎవరు తప్పుచేసిన ఉపేక్షించే ప్రసక్తేలేదని పవన్ హెచ్చరించారు. చివరకు తానే తప్పు చేసినా పార్టీ నంచి తప్పించేలా విధి విధానాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్దానం కిడ్నీ సమస్యను అనేక ఏళ్లగా ప్రభుత్వం పరిష్కరించలేదని తెలిపారు. వారికి కనీసం స్వచ్ఛమైన తాగునీటిని కూడా అందించలేకపోవటంతో వలసలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వలసలను నివారించటంలోనూ పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. భావితరాల భవిష్యత్తు కోసం రాజకీయాల్లోకి వచ్చానని, తప్పకుండా మార్పు సాధించి తీరుతామని చెప్పారు. డబ్బు పంపిణీలేని రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేయటమే జనసేన లక్ష్యమని, నోటు లేకుండా ఓటు వేసినప్పుడే నిజమైన నాయకులను ఎన్నుకుంటామని చెప్పారు. పార్టీ విధి విధానాలను జనంలోకి తీసుకువెళ్లే బాధ్యత కార్యకర్తలదేనని పవన్ కల్యాణ్ అన్నారు.

## సంక్షేమ పథకాలకు పుట్టిల్లు టీడీపీ : యామిని



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రజలకు మేలు చేకూర్చే సంక్షేమ పథకాలకు పుట్టినిల్లు టీడీపీ అనే విషయాన్ని ప్రతిపక్షనేత జగన్ గుర్తించాలని ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ సూచించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ ప్రకటించిన నవరత్నాలను అధికార పార్టీ నాయకులు దొంగిలిస్తున్నారని మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె తెలిపారు. పాదయాత్రతో పరుగుపోగొట్టుకుని, కోడికత్తి డ్రామాతో మతి భ్రమించిన ప్రతిపక్ష నేత తాజాగా ఎన్ఐఏను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఏపీ ప్రజలు, అధికారులు, ప్రభుత్వాన్ని నమ్మని వ్యక్తి పొరుగు రాష్ట్రం నేతలతో పొత్తుపెట్టుకొని ఇక్కడి ప్రజలపై రాజకీయాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్రం రిజర్వేషన్లు ఇస్తుంటే తప్పు కానప్పుడు, టీడీపీ కాపులకు రిజర్వేషన్ ఇవ్వడం ఏవిధంగా తప్పవుతుందో ఏపీ బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ఆమె డిమాండు చేశారు. రాష్ట్రంలో ప్రజలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడమే ధ్యేయంగా వైసీపీ, బీజేపీలు ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తున్నాయని యామినీశర్మ మండిపడ్డారు.

## విజయవాడ నుంచి 'వెన్నెల' స్లీపర్ బస్సులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) నూతనంగా సమకూర్చుకున్న బస్సులలో వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు నడుపుతున్నట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు బస్సు విజయవాడలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో అక్కడ రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు విజయవాడ చేరుతుంది. చెన్నై బస్సు విజయవాడలో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చెన్నై చేరుతుంది. తిరుగు ప్రయాణంలో చెన్నైలో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు విజయవాడ చేరుతుంది. హైదరాబాద్ రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి వెన్నెల ఏసీ స్లీపర్ బస్సు రాత్రి 7.30 గంటలకు విజయవాడలో బయలుదేరి అర్ధరాత్రి ఒంటి గంటకు హైదరాబాద్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో వేకువ జాము 3 గంటలకు బయలుదేరి ఉదయం 8.30 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ బస్సుల్లో మంచినీటి బాటిల్, ఫేస్ ఫ్రెషనర్‌తోపాటు బ్లాంకెట్ సదుపాయం ఉంటుంది. సురక్షిత ప్రయాణం కోసం ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.



# నెలాఖరులోగా సమస్యల పరిష్కారానికి కృషి

## ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రి అచ్చెన్నాయుడు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు గురువారం రవాణాశాఖమంత్రి కె.అచ్చెన్నాయుడుతో భేటీ అయ్యారు. ఆర్టీసీ కార్మికులు కోరుతున్న 50 శాతం వేతన సవరణ, సంస్థ పరిరక్షణ, సంస్థను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడం.. తదితర డిమాండ్లపై ఫిబ్రవరి 6వ తేదీ నుంచి సమ్మెకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రవాణాశాఖ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని నాయకులు కలసి వినతి పత్రాన్ని అందచేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. కార్మికుల కృషి వల్లే నష్టాలు 67 శాతానికి తగ్గాయని, ఆక్యుపెన్సీ రేటు 80 శాతానికి పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్టీసీలో సమ్మె లేకుండా సమస్యలు పరిష్కరించేం దుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 30, 31 తేదీల్లోగా సీఎం చంద్రబాబు, ఆర్టీసీ చైర్మన్, ఎండీలతో మాట్లాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. సంస్థ ఎండీ సురేంద్రబాబు ప్రభుత్వానికి నివేదించిన విధంగా రూ.3,720 కోట్లు ఆర్టీసీకి కేటాయించి ఆదుకోవాలని జేఏసీ నేతలు మంత్రిని కోరారు. సంస్థ నష్టాలకు కారణాలు, వివరాలను పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు. ఈ భేటీలో జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, సభ్యులు వైవీరావు, జిలానీ, శ్రీనివాసరావు, కొండారెడ్డి, ఈయూ నాయకులు పి.సుబ్రహ్మణ్యరాజు, ఆవుల ప్రభాకర్, జీవీ నరసయ్య, ఎండి.ఎ.సిద్ధిక్, వై.ఎస్.రావు పాల్గొన్నారు.

**నేడు సమ్మె సన్నాహక ధర్నాలు**

ఆర్టీసీ కార్మికుల సమ్మె సన్నాహకాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 128 డిపోలు, వర్క్‌షాపులలో జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు.

# ఉద్యోగాల భర్తీ వేగవంతం

• న్యాయ వివాదాలు లేకుండా చర్యలు • నియామక బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తెలంగాణ సర్కారు వేగవంతం చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ కొలువులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా భర్తీ చేస్తున్న ప్రభుత్వం నియామక ప్రక్రియల్లో న్యాయ వివాదాలు లేకుండా చర్యలు చేపట్టింది. ఇందుకోసం తెలంగాణ పోలీస్ నియామక బోర్డు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డులను ఏర్పాటు చేసింది. అటు విద్యుత్ సంస్థలు సొంతంగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. తాజాగా వైద్యరంగంలో నియామక ప్రక్రియను వేగవంతం చేయడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈ నెల 17న ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి దీనికి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఈ బోర్డుకు సపోర్టింగ్ స్టాఫ్ 14 మందిని డిప్యుటేషన్‌పై నియమించారు. మరో ఇద్దరు చీఫ్ ప్రోగ్రామర్లను కాంట్రాక్ట్ పద్ధతిన, నలుగురు డీఈఓలు, నలుగురు ఆఫీస్ సబార్డినేట్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకోవడానికి అనుమతి ఇచ్చింది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ భర్తీ ప్రక్రియలో వేగం పెరగనుంది. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ద్వారా దాదాపు 40 వేల పైచిలుకు ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేసింది. 9 వేల 355 గ్రామ పంచాయతీ కార్యదర్శుల నియామక ప్రక్రియ పూర్తయినప్పటికీ న్యాయ వివాదం కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపి వేయాల్సి వచ్చింది. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత కొంతమంది న్యాయ వివాదాలు సృష్టించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను అడ్డుకుంటున్నారు. తాజాగా గ్రామ పంచాయతీ కార్యదర్శుల నియామకాన్ని న్యాయ వివాదంలోకి లాగారు. దీంతో ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ నియామక ఉత్తర్వులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే వైద్య రంగంలో నియామకాలకు ప్రత్యేకంగా బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. న్యాయవివాదాలు లేకుండా జాగ్రత్తపడుతున్నది. దీంతో ఉద్యోగ నియామకాలు వేగంగా జరగనున్నాయి. సంవత్సరానికి 25 వేల చొప్పున ఉద్యోగాలు భర్తీ చేస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో టీఆర్ఎస్ హామీ ఇచ్చింది. ఆ హామీలో భాగంగా వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది. డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో తిరిగి అధికారం చేజిక్కించుకున్న టీఆర్ఎస్ గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముమ్మరం చేసింది. ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు భృతి ఇవ్వడంతో పాటు ఖాళీలన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది.

## సంపాదకీయం

# భిన్నాభిప్రాయమే నేరమా!?

సమాజంలో సంక్షోభాలున్నప్పుడు.. వాటికి మూలాలేమిటీ, కారణాలేమిటీ, పరిష్కారాలేమిటీ, ప్రత్యామ్నాయాలేమిటీ అనే అన్వేషణ సహజంగానే మొదలవుతుంది. అది మేధావులు చేయవచ్చు, విద్యార్థుల మదిలో అంకురించవచ్చు, ప్రజా ఉద్యమ రూపంలో కావచ్చు. భావాల సంఘర్షణ నుంచే నవోదయం ప్రారంభమవు తుంది. ఇది చరిత్ర, వాస్తవం.

నేడు మనదేశంలో సంఘపరివార్ భావజాలం తప్ప ఏ ఇతర భావజాలాలు, ప్రత్యామ్నాయాలను సహించలేని పాలక పాశవికత రాజ్యమేలుతోంది. విశ్వవిద్యాలయాల్లో భావ సంఘర్షణకు అవకాశమే లేకుండా చేసి సంఘపరివార్ భావజాలమే విద్యార్థుల మదికెక్కించేందుకు విఫలయత్నం చేసింది. ఈ క్రమంలో ప్రగతిశీల భావజాలం వైపు నిలిచిన కొందరు విద్యార్థులపై కేసులు నమోదు చేసింది.. దాడులకు తెగబడింది. ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థి నేత కన్హయ్య కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టి నానా ఇబ్బందులకు గురిచేసింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరోసారి అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేసి ఢిల్లీ పోలీసులు కోర్టు ఆగ్రహానికి గురయ్యారు. భావ ప్రకటనా స్వేచ్ఛతో తమ అభిప్రాయాలను వ్యక్తంచేయడమే దేశద్రోహంగా మోడీ దళం భావిస్తోంది. భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేసే వ్యక్తి, సహజంగానే చరిత్రను, వర్తమానాన్ని అధ్యయనం చేస్తాడు. సమాజ చలనాన్నీ, చరిత్ర పరిణామ క్రమాన్నీ అర్థం చేసుకుంటాడు. మానవాళి ఎటు ప్రయాణం చేస్తున్నదీ, దానిలో మంచీచెడులే మిటన్నది సునిశితంగా పరిశీలిస్తాడు. ప్రజల్లో సరికొత్త ఆలోచనలు ప్రేరేపిస్తాడు. అతడు మనుషుల్ని ప్రేమిస్తాడు, వారికి మంచి భవిష్యత్తు ఉండాలని కలగంటాడు. ఇది దేశద్రోహం ఎలా అవుతుంది? పాలక భావజాలానికి వ్యతిరేకంగా ఉన్నంత మాత్రనా దేశద్రోహి కింద లెక్కేనా? కేంద్రంలోని మోడీ సర్కారే కాదు, ఈశాన్య రాష్ట్రం అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం.. మేధావులు, రచయితలు, జర్నలిస్టులపై దేశద్రోహ నేరం కేసులు బనాయిస్తున్నది. జనవరి 10న అస్సాం సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత హిరేన్ గోహైన్, కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి నేత అఖిల్ గొగోయ్, ప్రముఖ జర్నలిస్టు మంజిత్ మహంతాలను దేశద్రోహ నేరం కింద ప్రభుత్వం అరెస్టు చేసింది. వారిపై 124ఏ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారన్న ఆరోపణలతో (121, 123)పలు సెక్షన్లపై కేసులు నమోదు చేసి జైల్లో పెట్టింది. జనవరి 7న ఓ సభలో పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఉపన్యసించటమే వారు చేసిన పాపం. అస్సోం ప్రభుత్వ చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. భావ స్వేచ్ఛను నేరంగా ప్రకటించడం అస్సోం సర్కారుకు కొత్తేమీ కాదు. 1979-85 మధ్యకాలంలో అస్సోం ఉద్యమం ఉధృతంగా ఉన్న కాలంలో ఉద్యమ నేతలను ఇలాంటి తీవ్ర నేరారోపణలతోనే నిర్బంధించారు. 1990 ప్రాం తంలో ఉల్ఫా ఉద్యమం ఉచ్ఛస్థాయిలో ఉన్న సమయంలోనూ భద్రతా బలగాలు, సైన్యం పెద్ద ఎత్తున మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డాయి. జర్నలిస్టులు అజిత్ భుయాన్, పరాగ్‌కుమార్ దాస్, న్యాయవాది నిలోయ్‌దత్తా తదితరులు అస్సోంలో భద్రతా బలగాలు చేస్తున్న లైంగికదాడులను, దౌర్జన్యాల ను ప్రపంచానికి చాటినందుకు వారిపై నాసా చట్టం ప్రయోగించి అరెస్టులు చేసింది. టాడా లాంటి క్రూర చట్టాన్ని కూడా అజిత్ భుయాన్‌పై మోపింది. ప్రభుత్వం పెట్టిన ఆ కేసులేవీ కోర్టులో నిలువలేదు. పరాగ్‌కుమార్ దాస్ హత్యకు గురయ్యారు. గోహైన్‌పై దేశద్రోహనేరం మోపడం దారుణమంటూ ప్రముఖ కవి, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత హరికృష్ణ దేకా ఖండించారు. సాధారణ ఎన్నికలకు ముందు ఇలాంటి చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు బీజేపీ సర్కారు గురిచేస్తున్నదని విమర్శించారు.

ఈశాన్య రాష్ట్రాలైన అస్సోం, మేఘాలయ, మణిపూర్‌లలో ఐపీసీ సెక్షన్లు 121, 121ఏ, 122, 123 కింద తీవ్రవాద గ్రూపులపై కేసులు ఎక్కువగా నమోదు చేస్తున్నారు. ప్రభుత్వాన్ని కూలదోయటానికి కుట్రపన్నారనే అభియోగం మోపడాన్ని సుప్రీంకోర్టు గతంలోనే తీవ్రంగా తప్పుపట్టింది. అయినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తరహా కేసులు మోపుతూనే ఉన్నాయి. మణిపూర్ ముఖ్యమంత్రిని సోషల్ మీడియాలో విమర్శించినందుకు జర్నలిస్టు కిశోర్ చంద్రవాంగ్ ఖేమ్‌పై దేశద్రోహ నేరం మోపి రెండు నెలలుగా నిర్బంధంలోనే ఉంచారు. ఇంఫాల్ కోర్టు ఆయనను నిర్దోషిగా విడుదల చేసింది. అంతేకాదు, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తదితరులను విమర్శించడం దేశద్రోహంగా పరిగణించడం తగదని కోర్టు హితవు పలికింది. ప్రశ్నించినందుకు చరిత్రలో అనేక మంది మేధావులు రాజ్యం చేతిలో బలైన ఘటనలు అనేకం ఉన్నాయి. అవే ప్రపంచానికి ఒక వెలుగు దివ్వెగా మారాయి. బానిస సమాజానికి వ్యతిరేకంగా పోరాడిన సోక్రటీస్‌తో మొదలై శాస్త్రీయ విజ్ఞానానికి బీజాలు వేసిన గెలీలియో, కోపర్నికస్‌లు నాటి రాచరికపు పాలనలో చిత్రవధలు అనుభవించారు. భగత్‌సింగ్ బ్రిటీష్‌వాళ్ల దృష్టిలో ఉగ్రవాదే, కానీ మనకు ఆయన స్వాతంత్ర పోరాట యోధుడుగా నిలిచారు. బీజేపీ సర్కారు కొత్తగా అర్బన్ నక్సల్స్ పేరిట కొందర్ని జైళ్లల్లో పెడుతున్నది. ఇటీవల ఆనంద్ తెల్తుంబ్డెను మోడీ సర్కారు టార్గెట్ చేసింది. ఆయన చేసిన నేరం ఏమిటి? పేద కుటుంబంలో పుట్టిన ఆయన కష్టపడి ఐఐటీ, ఐఐఎం చదివారు. ఐఐటీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అత్యంత ప్రతిభావంతుడైన ఆయన సమాజంలోని అసమానతలు, అన్యాయాలపై, దళితుల సమస్యపై, ఖైర్లాంజీ దురాగతాలపై రచనలు వెలువరించారు. సామాజిక అసమానతలపై, కుల వ్యవస్థ దుర్మార్గాలపై 'రిపబ్లిక్ ఆఫ్ క్యాస్ట్' పుస్తకాన్ని రచించారు. భీమా కోరేగాం ఘటన 'కుట్ర'లో ఆయనను పాలకులు భాగస్వామిగా చిత్రిస్తున్నారు. వాస్తవానికి ఆయన భీమా కోరేగాం ఘటనతో విభేదించి అనేకమంది ఆగ్రహానికి గురయ్యారు. ప్రశ్నించడం, సామాజిక అసమానతలను ఎత్తిచూపడం, పాలక విధానాలను, చర్యలను నిలదీయడం, భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేయడం నేరంగా పరిగణిస్తున్న మోడీ సర్కారు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. భావ ప్రకటన స్వేచ్ఛను భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రసాదించింది. దాన్ని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించింది. దాన్ని కాపాడడానికి చట్టబద్ధ పాలనను ఒక మౌలిక ప్రమాణంగా అందించింది. ఆ పాలనే నిరంకుశంగా వ్యవహరిస్తే.. పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తే.. ప్రజా తిరుగుబాటు అనివార్యమవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రాణప్రదంగా ఎంచే ప్రజలు ఓటు ద్వారా ఈ నిరంకుశ సర్కారుకు తగిన బుద్ధి చెప్పేందుకు సన్నద్ధంగా ఉన్నారన్నది సత్యం.. భవిష్యత్తు ప్రజా తీర్పు అదేననేది తథ్యం!

## చురక

కాంగ్రెసు కోట లోన
కొత్త చిగురు ప్రియాంక
కార్యదీక్ష కలిగుంటేనే
కలిసివచ్చు కాలమింక

ఇందిరమ్మ రూపు రేఖ
ఇంపు ఒక్కటే సరిపోదు
అదలిస్తే తప్ప జనం
అధికారం ఇవ్వబోదు

- వేల్పుల నారాయణ

# ఈసీ అప్రమత్తత ఆవశ్యకత

శిరందాసు నాగార్జున

దేశానికి ఎన్నికల వేళైంది. ఈ సమయంలో కొత్త రాజకీయ పార్టీలు, రాజకీయ ఫిరాయింపులు, రాజకీయాలు మాట్లాడటం సహజం. కానీ ఈ సారి దేశమంతటా ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ల ట్యాంపరింగ్ (దురుద్దేశంతో పాడుచే యడం)పై మాట్లాడుతున్నారు. మాటలు కాదు పెద్ద దుమారమే చెలరేగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుతో సహా చాలా మంది రాజకీయ నాయకులు ఈవీఎంలను విశ్వసించడంలేదు. వాటి నిర్వహణ, వినియోగంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తు న్నారు. ఎన్నికల ఫలితాలు తారుమారు చేస్తారని భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా సైబర్ నిపుణుడు సయ్యద్ షుజా ఈవీఎంల ట్యాంపరిం గ్‌లపై చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు ఊతం ఇచ్చాయి. ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్-యూరప్ విభాగం ఇటీవల లండన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో షుజా కాలిఫోర్నియా నుంచి లైవ్ వీడియో ద్వారా మాట్లాడారు. భారత్‌లో 2014 లోక్‌సభ ఎన్నికలలలో ఉపయోగించిన ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ గడ్, ఢిల్లీలలో రిగ్గింగ్ జరిగినట్లు వివరిం చారు. అలా చేయడం వల్లే కాంగ్రెస్ ఓడిపోయి బీజేపీ గెలిచిందని చెప్పారు. రిలయన్స్ కమ్యూనికే షన్స్ సంస్థ సాయంతో ఫ్రీక్వెన్సీ తగ్గించి ఈవీఎం లను హ్యాక్ చేశారని ఆరోపించారు. 2009 నుంచి 2014 వరకు తాను ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) లో పనిచేశానని, 2014 లోక్‌సభ ఎన్నికల్లో వాడిన ఈవీఎంలను రూపొందించిన బృందంలో తాను కూడా ఒక సభ్యు డిగా పనిచేసినట్లు షుజా చెప్పారు. ఈ ట్యాంపరిం గ్‌కు కేంద్రం హైదరాబాద్ అని కూడా అతను పేర్కొన్నారు. 2015 ఢిల్లీ శాసనసభ ఎన్నికలు, ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్-ఛత్తీసగఢ్-రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో కూడా ఈవీఎంలను హ్యాక్ చేసి గెలిచేందుకు బీజేపీ ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. అయితే, తమ బృందం ఆ ప్రయత్నా లను అడ్డుకోవడం వల్ల బీజేపీ ఓటమిపాలైంద న్నారు. కేంద్ర మంత్రి గోపీనాథ్ ముండే మృతి, జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్యలకూ ఈవీఎంల హ్యాకింగ్ కు సంబంధం ఉన్నట్లు కూడా షుజా సంచలన ఆరోపణలు చేశారు. అయితే ముందు చెప్పిన విధంగా షుజా ఆ కార్యక్రమానికి హాజరుకా లేదు. ఈవీఎంల ట్యాంపరింగ్ ని నిరూపించలేదు. లైవ్ లో చూపిస్తానని చెప్పి చూపించలేదు. సయ్యద్ షుజా ఆరోపణలను ఈసీఐఎల్ ఖండించింది. అతను తమ సంస్థలో రెగ్యులర్ ఉద్యోగిగా పనిచేయ లేదని, తాము సేవలు పొందుతున్న ఇతర సంస్థల్లో కూడా పనిచేయలేదని స్పష్టం చేసింది. షుజా ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) తీవ్రస్థాయిలో స్పందించింది. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఈసీఐఎల్ ఆధ్వర్యంలో ఉన్నత ప్రమాణాలతో, కట్టుదిట్టమైన భద్రత, నిఘా మధ్య తయారైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అనుమానాలకు తావులేదని ఈసీ పేర్కొంది. 2010లో నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో వీటిని తయారు చేసినట్లు తెలిపింది. ఈవీఎంలను ట్యాంపర్ చేయడం సాధ్యం కానేకాదని స్పష్టం చేసింది. ఈవీఎం అనేది ఓట్లను నమోదు చేసే యంత్రం మాత్రమేనని, దానిని ఎవరూ నియంత్రించ లేరని (ప్రోగ్రామ్ చేయలేరని) ఎన్నికల ప్రధాన అధికారి(సీఈసీ) సునీల్ అరోరా స్పష్టం చేశారు. ఢిల్లీలో 2014 లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తరువాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఫలి తాలు భిన్నంగా వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలలో మళ్లీ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు.

మానవుడు విజ్ఞానవంతుడైన దగ్గర నుంచి ఓ పక్క సౌకర్యాలు పెరుగుతుంటే, మరో పక్క ప్రమాదాలు కూడా ముంచుకొస్తున్నాయి. అణు విజ్ఞానం మానవాళికి అపారమైన అనుభవం మిగి ల్చింది. అమెరికా హిరోషిమా, నాగసాకీ నగరాలపై అణుబాంబుని ఉపయోగించడం వల్ల ఆ రెండు నగరాలు శవాల దిబ్బలయ్యాయి. వందేళ్లపాటు ఆ నేలపై మొక్క మొలవకుండా చేశారు. అదే అణు విజ్ఞానాన్ని మానవాళి సుఖంగా జీవించడానికి కూడా వినియోగించవచ్చు. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అణు ఆయుధాలతో ప్రపంచం మొత్తం విద్యుత్ వెలుగులు నింపవచ్చు. నిరంతరం పరిశ్రమలను నడపవచ్చు. మనిషి ఆలోచనా విధానాలకు, వికృత చేష్టలకు నిదర్శనాలు ఇవి. నేటి ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో బ్యాంకులకు వెళ్లకుండా దేశంలో ఎక్కడైనా ఏటీఎంల ద్వారా డబ్బు డ్రా చేసుకోగలుగుతున్నాం. మరో పక్క కొందరు ఆ విజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు ఎన్ని జరుగుతున్నాయో అంతకు మించి వాటిని దుర్వినియోగం చేసేవారు కూడా తయారవుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగిస్తున్నారో పరిశీలిస్తే ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమేమీ కాదని అర్థమవుతోంది. పలువురు సీనియర్ రాజకీయ నేతలతోపాటు టెక్నాలజీని ప్రమోట్ చేసే చంద్రబాబు నాయుడు కూడా ఈవీఎంలను వ్యతిరేకిస్తున్నారంటే ఆలోచించవలసిన విషయమే. ప్రజాస్వామ్యాన్ని యంత్రాలపై ఆధారపడేలా చేయడం సమంజసం కాదని చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా పోరాడతా మని కూడా ఆయన స్పష్టం చేశారు. దమ్ముంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బ్యాలెట్‌తో పోలింగ్ నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఛాలెంజ్ విసిరారు. ఈవీఎంలపై ఇన్ని అనుమానాలు, ఇంత దుమారం రేగుతున్న సమయంలో ఎన్నికల సంఘం బాధ్యత మరింత పెరుగుతోంది. రాజకీయ పరంగా ఈవీఎంలను దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉన్నందున ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తగిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు తీసుకోవలసిన అవసరం ఈసీఐపై ఉంది.

- సీనియర్ జర్నలిస్ట్ - 9440222914

# ప్రైవేటు ఆసుపత్రులపై పంజాబ్ మోజు

డా॥ అరుణ్‌మిత్రా

ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించడానికి, ఇబ్బందికర ప్రాంతాలలో వున్న ఆరోగ్య సంస్థలను నడపడానికి ప్రైవేటు ఎన్జీవోలు, డాక్టర్లు, ఇతరుల ఆసక్తి వ్యక్తీకరణను కోరుతూ పంజాబ్ ప్రభుత్వం వార్తాపత్రికల్లో బహిరంగ ప్రకటన ఇచ్చింది. వైద్యసంఘాలు, పౌర సంఘాలు, రాజకీయ పార్టీలతో సహా రాష్ట్రంలోని వివిధ వర్గాల నుండి దీనిపై తీవ్ర ప్రతిస్పందన వ్యక్తమైంది. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు రంగానికి అప్పగించాలన్న పంజాబ్ ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య సేవలపై వినాశకర ప్రభావం చూపుతుంది. అది చికిత్స వ్యయాన్ని పెంచడమేగాక, ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ప్రజల జేబులకు చిల్లులు పెడుతుంది. ప్రజారోగ్యంపై పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యయం ఇప్పటికే చాలా తక్కువగా వుంది. ప్రభుత్వం స్వస్థతోన్ముఖ ఆరోగ్య సంరక్షణను కలిగి వుంది. ప్రాథమిక సంరక్షణకు వనరులలో మూడింట రెండు వంతులు కేటాయించాలని జాతీయ ఆరోగ్య విధానపత్రం-2017 సిఫార్సులతో పోల్చుకుంటే నివారణ ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వ వ్యయం దాదాపు 8 శాతం మాత్రమే. అందుచేత సక్రమ పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సౌకర్యాలు లేకపోవడం కారణంగా ఆరోగ్య సంరక్షణకు పేద ప్రజలు భారీగా ఖర్చులను భరించవలసి వస్తున్నది. జె ఫ్యామిలీ మెడ్ ప్రైమ్ కేర్‌లో ప్రచురించిన 'పంజాబ్ గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ వినియోగం, వ్యయపద్ధతులు', "సబ్ నేషనల్ హెల్త్ అకౌంట్స్; పంజాబ్ రాష్ట్రం నుండి అనుభవాలు" శీర్షికతో పరిశోధన పత్రాలు కొన్ని సజీవాంశాలను ముందుకు తెచ్చి, రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ మెరుగుదలకు సిఫార్సులు చేశాయి. పంజాబ్ మొత్తం వ్యయం రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో (జీఎస్‌డీపీ) దాదాపు 4.11 శాతం. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం దీనిలో నాల్గవ వంతుకన్నా తక్కువ. రోగులు వారి జేబుల్లో నుండి ఆరోగ్య సంరక్షణకు 76 శాతానికి మించి ఖర్చుపెడుతున్నారు. ప్రభుత్వరంగ ఆసుపత్రులలో వైద్య చికిత్సకు ప్రజలు తమ జేబుల్లో నుండి అధిక మొత్తాలను చెల్లించవలసి వస్తోంది.

ఆరోగ్యంపై 10 శాతానికి మించి ఒక కుటుంబం ఖర్చుపెట్టడమంటే అదొక ఉపద్రవంగా పరిగణించబడుతోంది. అవుట్ పేషెంట్ చికిత్సకు 7 శాతం కుటుంబాలు, ఇన్‌పేషెంటులుగా చేరి చికిత్స పొందడానికి 53 శాతం కుటుంబాలు భారీగా డబ్బు ఖర్చుపెట్టినట్లు పై అధ్యయనాలలో కనుగొనబడింది. పేద కుటుంబాలు వైద్య చికిత్సల నిమిత్తం అప్పులు చేయవలసి వస్తోంది. వైద్య ఖర్చులకు తమ జేబుల్లో నుండి భరించవలసిరావడంతో గ్రామీణ పంజాబ్‌లో పేదరికం 67 శాతం పెరుగుతుందని అంచనా వేశారు.

స్వస్థతోన్ముఖ ఆరోగ్య సంరక్షణ (క్యురేటివ్ హెల్త్ కేర్) పై ఆధారపడటం మన ఆరోగ్య సంరక్షణ సమస్యలను పరిష్కరించలేదని ప్రపంచ దేశాల అనుభవం చాటుతోంది. కాబట్టి, నివారణ ఆరోగ్య సంరక్షణ (ప్రివెంటివ్ హెల్త్‌కేర్) అంశంపై అధికంగా ఖర్చు చేయవలసిన అవసరముంది. సార్వజనీన ఆరోగ్య సంరక్షణకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను పటిష్టపర్చడమే ఏకైక మార్గం. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం వెంటనే కనిష్టంగా 2.5 శాతానికి పెంచి, తరువాతి సంవత్సరాల్లో 4 శాతానికి పెంచాలి. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మందుల లభ్యతకు మందుల కొనుగోలుపై ఎక్కువ ఖర్చు పెట్టవలసి వుంటుంది.

ప్రజల నుండి తీవ్ర నిరసన వ్యక్తమైన తరువాత ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు రంగానికి అప్పగించే ఆలోచన లేదని ఆరోగ్యమంత్రి వెనుకడుగు వేయడం సంశయవాదంగా చూడవలసి వుంటుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య చికిత్సకు ప్రైవేటు వైద్య నిపుణులను ఆహ్వానించటం ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను పటిష్టపర్చడానికేనని, ఎంపిక చేసిన కొన్ని ఆసుపత్రులలో ప్రయోగాత్మకంగా ఆ విధంగా చేయవచ్చునని ఆరోగ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వానికి డాక్టర్ల కొరత వున్నదని, అందుచేత ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అవసరమన్నది సరైన అవగాహన కాదు. రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు లేకపోవడం కారణంగా వివిధ వైద్య చికిత్సా నైపుణ్యాలలో శిక్షణ పొందిన డాక్టర్లు రాష్ట్ర సేవలను ఎంచుకోవడం లేదు. వారి సామర్థ్యం మేరకు ప్రతిభను వినియోగించాలని వారు కోరుకొంటున్నారు. ప్రభుత్వరంగ వైద్య కేంద్రాలను ప్రైవేటు రంగానికి అప్పగించడానికి కేవలం ఇది ఒక సాకు మాత్రమే. మెరుగైన సేవలకు ప్రభుత్వ రంగ ఆసుపత్రులను ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయోగం ఇప్పటికే బీహార్‌లో చేయగా అది విఫలమైంది. పంజాబ్ రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో అసాధారణ ట్యూషన్ ఫీజులు కారణంగా అర్హులైన విద్యార్థులు ప్రవేశం పొందలేకపోతున్నారు. గత ఏడాది కొన్ని ప్రైవేటు వైద్యకళాశాలలు ఏకపక్షంగా ట్యూషన్ ఫీజులను పెంచేసినప్పుడు ఆరోగ్య మంత్రి వారికే మద్దతు పలికారు. అధిక ట్యూషన్ ఫీజులు వైద్య విద్యార్థులు, వారి కుటుంబాలపై ఇప్పటికే అధిక భారాన్ని మోపాయి. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు రంగానికి అప్పగించడం కన్నా, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అవినీతిని నియంత్రించడం ముఖ్యం. ఆరోగ్య సంరక్షణలో అక్రమ చర్యలను నియంత్రించడానికి, ఔషధాలు, వైద్యపరికరాల ధరలను అదుపు చేయడానికి చట్టబద్ధ, క్రమబద్ధీకరణ సంస్థలను పటిష్టవంతం చేయాలి.

పౌరులకు ఆరోగ్య సంరక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిది. సార్వజనీన ఆరోగ్య సంరక్షణ కొరకు 'ఆల్మాఅటా డిక్లరేషన్'పై భారత్ సంతకం దారు. ఆ విధంగా ఆ అంతర్జాతీయ ఒప్పందానికి భారత్ కట్టుబడి వుండాలి.

## విభజన హామీల అమలుకోసం

# 'జన ఘోష రైలు యాత్ర'



కొణతాల రామకృష్ణ

రాష్ట్ర విభజన సందర్భంగా జరిగిన నష్టాలను కొంతమేరకైనా భర్తీ చేయడం కోసం పార్లమెంట్ సాక్షిగా ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా ఇచ్చిన పలు హామీల అమలు పట్ల కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ళకు పైగా నేరమయ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. ఈ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ, చట్ట ప్రకారం చేయవలసిన పనులను సత్వరం చేయమని ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, మేధావులు, యువకులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ఎన్నో రూపాలలో ఆందోళనలు చేస్తూనే ఉన్నప్పటికీ ఎటువంటి స్పందన కనిపించడం లేదు.

ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆంధ్రుల జనఘోషను ఢిల్లీ పాలకులకు వినిపించడం కోసం పలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. రైల్వే జోన్ విషయమై హై కోర్టులో పిల్ వేశాము. వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించిన నిధులను వెనుకకు తీసుకోవడం పట్ల కూడా కోర్టులో న్యాయం కోరుతున్నాం. గత సంవత్సరం ఇదే సమయంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీకి రైలు యాత్ర నిర్వహించాము.

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చివరి బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31న ప్రారంభం కాబోతున్నాయి. ఈ ప్రభుత్వం చివరి బడ్జెట్ ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నారు. ఈ సందర్భంగా అంతకన్నా ముందే వెళ్లి ఈ ప్రాంత ప్రజల ఘోషను వివిధ పక్షాల నాయకులు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి "జనఘోష రైలు యాత్ర"ను తలపెట్టాము. రాజకీయాలతో సంబంధం లేకుండా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆంధ్రుల జనఘోషను ఢిల్లీలో వినిపించి, రాష్ట్ర హక్కులను సాధించడానికి ఈ యాత్ర చేపట్టాము.

జనవరి 27న విశాఖపట్నం నుండి ఉదయం 7.30 గంటలకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఉత్తరాంధ్ర ప్రతినిధి బృందంతో ఢిల్లీకి బయలు దేరుతున్నాము. ఈ నిరసన కార్యక్రమంలో వినూత్న రీతిలో ఢిల్లీలో ఉండే ఐదు రోజులు కూడా ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు అందరు కూడా నల్ల దుస్తులనే ధరించి కేంద్ర మంత్రులు, పార్లమెంట్ లోని వివిధ పక్షాల నాయకులు, రాష్ట్ర ఎంపీల వద్దకు వెళ్లి కలసి, వినతి పత్రాలను సమర్పిస్తారు. వినతి పత్రాలతో పాటు పలు ఆందోళన కార్యక్రమాలను సహితం చేపట్టి వారిపై వత్తిడి తీసుకు వచ్చి వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతానికి తగు న్యాయం చేయమని కోరతాము.

గత ఏడాది కూడా జనవరి 27నే వినూత్న రీతిలో 'రైలు దీక్ష'ను 48 గంటల పాటు చేపట్టాము. ఈ సందర్భంగా ఢిల్లీలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులను, సంబంధిత మంత్రులను కలసి వినతి పత్రాలను అందజేయడంతో పాటు ఢిల్లీలో వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలు జరిపారు. అదే తరహాలో ఈ సంవత్సరం కూడా అదే రోజున జనవరి 27న విశాఖపట్నంలో రైలు ద్వారా బయలుదేరి ఇంకా పెద్ద ఎత్తున ఈ ప్రాంత ప్రజల జన ఘోషను వినిపించడానికి రైలు యాత్రను చేపట్టాము. ఈ యాత్రకు మద్దతు ఇవ్వమని వివిధ రాజకీయ పక్షాలకు, రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేస్తున్న వివిధ సంఘాల నాయకులను కలుసుకొని కోరాము.

ఈ సారి జరిపే జనఘోష రైలు యాత్రలో ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల నుండి కూడా భారీ సంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారు. కళా బృందాలను కూడా తీసుకు వెళ్లి బీజేపీ ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ఈ బృందాల ద్వారా దేశ వ్యాప్తంగా తెలియచెప్పే విధంగా సన్నాహాలు చేస్తున్నాము.

రాష్ట్ర విభజన జరిగి ఐదు సంవత్సరాలు కావస్తున్నా పార్లమెంట్ సాక్షిగా అప్పటి ప్రధాని డా. మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలు, విభజన చట్టంలోని వివిధ అంశాలు అమలు కానందుకు నిరసనగా ఈ ఆఖరి ప్రయత్నం చేస్తున్నాము. రాష్ట్రానికి, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి, విశాఖపట్నానికి రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్‌ల కేటాయింపు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, విశాఖపట్నంలో హై కోర్ట్ బెంచ్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్ట్ ఖర్చును పూర్తిగా కేంద్రమే భరించడం, ఈ ప్రాజెక్ట్ పూర్తికి అవసరమైన అన్ని చర్యలను కేంద్రం సత్వరం తీసుకోవడం, వెనుకబడిన ఉత్తరాంధ్రలో ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం, ఉత్తరాంధ్ర మరో భోపాల్ కాకుండా పర్యావరణాన్ని రక్షించడం వంటి ప్రధాన డిమాండ్లతో "జనఘోష రైలు యాత్ర" చేపడుతున్నాము.

విభజన చట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రానికి రూ 75,000 కోట్ల మేరకు నిధులు చెల్లించ వలసి ఉన్నదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన సంయుక్త కార్యాచరణ కమిటీ నిర్ధారణకు వచ్చింది. అదే విధంగా డా.జయప్రకాశ్ నారాయణ్ కన్వీనర్‌గా ఏర్పడిన స్వతంత్ర నిపుణుల బృందం సుమారు రూ 80 వేల కోట్ల వరకు ఇవ్వవలసి ఉన్నట్లు వెల్లడి చేసింది. చట్ట ప్రకారం ఇవ్వవలసిన నిధుల గురించి మాట్లాడకుండా రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయలు ఇచ్చామని, మరే రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులు ఇచ్చామని అంటూ కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు అసంబద్ధ వాదనలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు.

ఒక విధంగా చట్టబద్ధంగా తన బాధ్యత పట్ల కేంద్రం నిర్లక్షపూర్వక ధోరణి అనుసరించడానికి మనలో ఐక్యత లోపించడమే కారణం అని చెప్పక తప్పదు. కేంద్రం చేస్తున్న అన్యాయం గురించి ఒక వంక అధికారంలో ఉన్న తెలుగు దేశం పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన వై ఎస్ ఆర్ సి పి లతో పాటు,కాంగ్రెస్, జన సేన, సిపిఐ, సిపిఎం, ఇతర వామపక్షాలు,లోకసత్తా, ఇతర ప్రజా సంఘాలు గొంతెత్తి ప్రశ్నిస్తున్నా, పలు ఆందోళనలు చేబడుతున్నా ఎవరికి వారుగా చేస్తూ ఉండడంతో కేంద్రంలోని పాలకులు లెక్క చేయడం లేదు.

తెలంగాణ ఉద్యమంలో జె ఏ సి నీడలో అని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు కలిసి సమైక్యంగా పోరాటం చేయడం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. సమైక్య ఉద్యమాల వల్లనే కేంద్రాన్ని మన రోదన వినేటట్లు చేయగలమని గ్రహించాలి. ఈ దిశలో ఇప్పుడొక్క ప్రయత్నం చేస్తున్నాము. అందరం ఒకే వేదికపైకి రాగలిగితేనే ఈశాన్య ప్రాంతాలకు కల్పిస్తున్న విధంగా మన రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు కూడా ఒక ప్రత్యేక ప్రతిపత్తి కలిపించే విధంగా సాధించుకోగలం.

ఏపీ పట్ల కేంద్ర నిర్లక్ష్య ధోరణికి ఇప్పటి వరకు మొదటి సంవత్సరానికి సంబంధించిన వనరుల లోటు అంశాన్ని పరిష్కరించక పోవడమే ప్రబల నిదర్శనంగా మనముందున్నది. 2014-15 సంవత్సరానికి నూతన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న వనరుల లోటు రూ.19,015.48 కోట్లు. అందులో ఇప్పటికే చేసిన ఖర్చులు, చెల్లించాల్సినవి ఉన్నప్పటికీ ఆదాయ వనరుల సమస్య, నిధుల కొరత వల్ల విభేదించిన వ్యయం కలిపి ఉన్నాయి. ఈ మొత్తం లోటులో రూ.10,335.07 కోట్లు స్పష్టంగా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేసిన వ్యయం. మార్చి 31, 2015 నాటికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు, చేసిన చెల్లింపులను కేంద్రం తనిఖీ చేసుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 నిబంధనలు, స్ఫూర్తి, పార్లమెంట్ లో ప్రధాన మంత్రి ఇచ్చిన నిబద్ధ హామీకి అనుగుణంగా ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలి. మిగిలిన రూ 8,660.41 కోట్లు ఖచ్చితంగా వనరుల లోటు అని తీర్మానించలేము. కొత్త పథకాలు, ప్రమాణీకరించని వ్యయం కింద పరిగణించి, భారత ప్రభుత్వం విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు. ఇంత స్పష్టంగా ఉన్న ఈ అంశాన్ని పరిష్కరించడం పట్ల కేంద్రం ఎటువంటి శ్రద్ధ చూపడం లేదు.

కాగా, చట్టంలోని అసంబద్ధత వలన రాష్ట్ర నికరాదాయంలో రూ 38,290.36 కోట్ల నష్టం వచ్చింది. ఇది పార్లమెంట్ ఆమోదించిన చట్టంలోని నిబంధనల తప్పిదాల వల్లన కలగడంతో, అవసరమైతే ఒక సారి తనిఖీ చేసుకొని, ఈ మొత్తాన్ని పూర్తి స్థాయిలో కేంద్రమే భర్తీ చేయవలసి ఉంది.

సి ఎస్ ఎస్ లో కేంద్ర నిధుల వాటా 90 శాతానికి బదులుగా రూ 16,447 కోట్లు కేంద్రం రాష్ట్రానికి చెల్లించాల్సి ఉంది. ఈ ప్రత్యేక సాయాన్ని అందించడానికి విదేశీ తోడ్పాటు ప్రాజెక్టు ఏ మాత్రం సరిపోదు. దీని ద్వారా ఇప్పటిదాకా అరకొర నిధులే విడుదలయ్యాయి. కాబట్టి ఇతర మార్గాల ద్వారా సాయం అందించవలసి ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు.

ఇక పోలవరం ప్రాజెక్టు మొదటి దశను 2019 నాటికి పూర్తి చేయడానికి అంతకు ముందు చేసిన వ్యయం తాలూకు పెండింగ్‌లో ఉన్న బిల్లులకు కలిపి రూ.8,711.19 కోట్లు, రెండవ దశను పూర్తి చేయడానికి 2019-20లో రూ.27,494 కోట్లు కేంద్ర సాయంగా అందవలసి ఉంది. సవరించిన ప్రాజెక్టు వ్యయ అంచనాలను నిబంధనలకు అనుగుణంగా కేంద్రం ఆమోదించవచ్చు. ఇటువంటి ప్రాథమిక అంశాలను తేల్చడానికి సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకని కేంద్రం కాలయాపన చేస్తున్నది ? పెండింగ్ లో ఉన్న సమస్యలను పది రోజులలో పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పి వెళ్లి సంవత్సరం గడుస్తున్నా దిక్కు లేకుండా పోయింది.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం రూ 24,350 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను రూపొందించింది. ఆ ప్యాకేజి గురించి ఇప్పటి వరకు కేంద్రం నోరు మెదపడం లేదు. జనాభా, ద్రవ్యోల్బణంలకు అనుగుణంగా ఇది దాదాపుగా బుందేల్ ఖండ్ ప్యాకేజి తో సమానంగా ఉంది. వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజి కింద ఇప్పటి వరకు మూడేళ్లకు పైగా కాలానికి రూ 1,050 కోట్లను విడుదల చేసింది. రానున్న సంవత్సరాలలో మరో రూ 700 కోట్లను చెల్లింప వలసి ఉంది. జిల్లాకు రూ 50 కోట్లు చొప్పున కేంద్ర చేస్తున్న సాయానికి, ఈ ప్రాంతాల అవసరాలకు మధ్య పెద్ద అగాధమే ఉన్నదని చెప్పాలి.

దుగ్గరాజపట్నం వద్ద నౌకాశ్రయం అభివృద్ధికి రూ 7,988 కోట్లు ఖర్చవుతుందని తాత్కాలికంగా అంచనా వేశారు. అయితే, ఆ ప్రాంతంలో పోర్టు ఏర్పాటు ఆచరణలో నష్టదాయకమని కేంద్రం తేల్చి, మరో ప్రాంతాన్ని సూచించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రామాయపట్నం పోర్ట్ గురించి రాష్ట్రం ప్రతిపాదనలు పంపితే కేంద్రం నుండి స్పందనే లేదు.

జాతీయ ప్రాధాన్యత గల 11 సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటుకు మొత్తం రూ 12,746.38 కోట్ల మేరకు వ్యయం కావలసి ఉండగా, అందులో కేవలం 6.63 శాతం మేరకు రూ 845.42 కోట్లను మాత్రమే కేంద్రం ఇప్పటి వరకు విడుదల చేసింది. 93 శాతం ఇంకా చెల్లింపవలసి ఉంది. విద్య, వైద్య ... ఇలా దాదాపు అన్ని సంస్థలు తాత్కాలిక ప్రాంగణాలలోనే నడుస్తున్నాయి. నిర్దిష్ట కాలపరిమితితో కేంద్రం ఒక ప్రణాళిక ఏమీ రూపొందించుకోవడం లేదు.

13వ షెడ్యూల్ లోని మౌలిక వసతుల ప్రాజెక్టులను సమీక్షిస్తే ఐదు ప్రాజెక్టుల అమలు అసలు ప్రారంభం కాలేదు. మూడు అమలులో తొలి దశలోనే ఉన్నాయి. వీటిల్లో పెట్రో కెమికల్ కాంప్లెక్స్, మెట్రో రైలు ప్రాజెక్ట్ లు, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్, రాజధాని ప్రాంతానికి వేగవంతమైన రైలు, రోడ్ రవాణా సంధానత, అంతర్జాతీయ విమానాశ్రయాలు కీలకం, పరిశ్రమలు, సేవల రంగాల్లో తక్కువ ఉద్యోగావకాశాలున్న ఏపీలో ఈ ప్రాజెక్టులు ఆర్థిక కలాపాలకు ఉద్దీపననిచ్చి పెట్టుబడులను పెంచుతాయి. పరిశ్రమలు, ఉద్యోగావకాశాలకు ఊపు ఇస్తాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేసే ఇటువంటి ప్రాజెక్టుల పట్ల కేంద్రం తగు దృష్టి సారించడం లేదు.

రాజధాని అభివృద్ధికి కేంద్రం రూ 1,500 కోట్లు విడుదల చేయగా, రాష్ట్రం రూ 1,632.48 కోట్లకు వినియోగ పత్రాలను సమర్పించింది. వీటి ఆధారంగా నీతి ఆయోగ్ రూ 666 కోట్లను వెంటనే, రూ 334 కోట్లను వచ్చే ఏడాది విడుదల చేయమని సిఫార్సు చేసినా కేంద్ర పట్టించుకోవడం లేదు. ఇదే సమయంలో పన్ను, ఇతర రాయితీలు వంటి అంశాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం పట్ల కేంద్రం ఆసక్తి ప్రదర్శించడం లేదు. కనీసం వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ మాత్రమే వర్తించే విధంగా రాయితీలు అందజేసే ఆలోచన చేయవలసి ఉంది.

ఎన్నికల సమయంలో, ఆ తర్వాత ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక సదుపాయాలు, సహాయం గురించి మోడీ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఎదురుచూసాము. కానీ ఎటువంటి ఆర్థిక భారం లేని రైల్వే జోన్ వంటి విషయంలో కూడా సానుకూలంగా అడుగు వేయక పోవడం, తాము ఇచ్చిన హామీల గురించే మాట్లాడక పోవడం ద్వారా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పట్ల ప్రదర్శిస్తున్న నేరమయ నిర్లక్ష్యం ఏమాత్రం క్షంతవ్యం కాబోదు. అందుకు భారీ మూల్యం చెల్లింపవలసి వస్తుందని హెచ్చరిస్తున్నాను. మనమంతా కలిస్తేనే ఈ ప్రభుత్వం మెడలు వంచి మన హక్కులను, ప్రయోజనాలను సాధించుకోవడం సాధ్యం కాగలదని ఈ సందర్భంగా మనమూ గ్రహించాలి.

మాజీ మంత్రి, కన్వీనర్, ఉత్తరాంధ్ర చర్చావేదిక

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
25 జనవరి 2019

## హిమ కొమ్మలు

నీటి ప్రవాహం గురించి అందరికీ తెలుసు. కానీ ఈ మంచు ప్రవాహాన్ని చూడాలంటే కాశ్మీర్‌లోని బారాముల్లాను సందర్శించాల్సిందే. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో నదీ ప్రవాహాలు మంచు ప్రవాహాలుగా మారిపోయాయి. థాన్ మార్గ్ వద్ద బ్రిడ్జ్ నుంచి వేలాడుతున్న హిమ కొమ్మలు భలే బాగున్నాయిగా...!





# దేశం ప్రతి పౌరుడి ఆస్తి

REAL STORY

**లౌకిక వాద దేశమంటే భిన్న మతాల నిలయం. ఇలాంటి దేశాల్లో ఒక మతస్థుడు వేరే మతస్థుడిని గౌరవిస్తూ కలిసి మెలిసి జీవిస్తారు. కానీ ఈ అర్థం కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైపోయిందని చెప్పకోవాలి. కారణం దేశంలో చాలా మందికి ఇస్లామోఫియా ఉండడం. ఒక్క ఇస్లామోఫియానే కాదు చాలా రకాల మత, కుల ఆంక్షలు, వివక్ష ఉన్నాయి. ఇవి మనుషుల మధ్య అడ్డుగోడలవుతున్నాయి. మానసిక అంతరాలను పెంచుతున్నాయి. మమతానుబంధాలను మసి చేస్తున్నాయి. మనిషి తత్వాన్నే నుసి చేస్తున్నాయి. ఇలాంటివి మన చుట్టూ ఎన్నో. దీంతో పాటు కనువిప్పు కలిగించే సంఘటనలు కూడా ఎదురవుతూనే ఉంటాయి. అలాంటి ఓ వాస్తవ సంఘటనల సమాహారం ఈ రియల్ స్టోరీ...**

ఒక వీకెండ్ రోజున నాకు చాలా బోర్‌గా ఉంది. ఆ సమయంలో నా స్నేహితులు కొంతమంది నాకు ఫోన్ చేసి సినిమాకి వెళదామని అడిగారు. రాను అనడానికి నా వద్ద కారణాలు లేక ఏ సినిమాకి అని అడిగాను. ముల్క్ సినిమాకని వారు చెప్పారు. పేరు వినగానే ఒక క్షణం వెళ్ళాలా వద్దా అని క్షణకాలం ఆలోచించాను. తర్వాత మామూలుగానే వెళ్ళాను. ముల్క్ సినిమా ఒక ముస్లిమ్ ప్రవక్తకు సంబంధించినది. ఆ ప్రవక్త కొడుకు బాంబ్ బ్లాస్ట్‌కు సహకరించడం వల్ల ఆ కుటుంబం ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, అవమానాల గురించిన సినిమా.

నేను సినిమా చూస్తున్నప్పుడు ముస్లిం తండ్రి ఎదుర్కొన్న అవమానాలను చూసి కదిలిపోయాను, నేను ఎలా ఉన్నానని కూడా ఆలోచించాను. అప్పుడు అర్థమైంది. అప్పటి వరకూ నేనెంత తప్పుగా ఆలోచిస్తున్నానో.

సినిమా అయిపోయింది. కానీ నేను అలా తెరవైపే చూస్తూ ఉండిపోయాను. గడిచిన కాలం గుర్తుకొస్తోంది. చెప్పలేనన్ని ప్రశ్నలతో ఇంటికి చేరుకున్నాను. తర్వాత నా జీవితానికి ఆ సినిమాకు ఉన్న పోలికలను గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. నాలో ఉన్న అసూయ, హేతుబద్ధమైన ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని మరీ పోల్చుకున్నాను. మా పొరుగింటి వారి కొడుకు ఉగ్రవాద దాడిలో పాల్గొన్నాడని తెలిసినప్పుడు నేను ఒక వ్యక్తిగా ఏం చేశాను అనే ప్రశ్నలు మదిలో మెదులుతున్నాయి. మనుషులు ధరించే దుస్తులను బట్టి వాళ్ళు ఎలాంటి వారో అంచనా వేయలేం. ఒక వేళ వారికి గడ్డం ఉంటే దాని ఆధారంగా వాళ్ల మతాన్ని గుర్తించలేం. కారణం మతాలను బట్టి మనిషి ప్రవర్తన అనేది ఉండదు.

కొన్ని నెలల ముందు నేను ఢిల్లీ నుంచి భోపాల్ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ఒక ముస్లిం కుటుంబం కూడా ఎక్కారు. చూడటానికి వారు చాలా ఆనందంగా ఉన్నారు. పెళ్ళికి వెళ్తున్నారని తెలిసింది. ప్రయాణంలో తినడానికి మాంసాహారంతో కూడిన భోజనాన్ని ఎక్కువ మొత్తంలో తీసుకువచ్చారు. అందులోనూ నాకు ఇష్టమైన ఆహారం కూడా ఉంది. రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. వారు తినడానికి వారి వారి టిఫిన్ బాక్స్‌లు తీసున్నారు. నేను ఒంటరిగా అక్కడ కూర్చొని ఉండడంతో వాళ్ళు నన్ను కూడా తినమన్నారు. తీసుకుందామనిపించినా నాలో ఏదో తెలియని సంశయం. అందుకని వద్దు అనేశాను. వారు నన్ను పదే పదే అడుగుతూనే ఉన్నారు. కానీ నేను మర్యాదగానే నిరాకరించాను. వద్దు అనడానికి కారణం నాకు ఆకలిగా లేదు అందులోనూ నేను కొంచెం భయపడ్డాను.

ఈ ఒక్క సంఘటన మాత్రమే కాదు. నా జీవితంలో ఇలాంటివి చాలానే ఎదురయ్యాయి. నా స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తున్నప్పుడు దాని హారన్ పనిచేయడం లేదు. మా కారు డ్రైవర్‌కు వచ్చే గ్యారేజీలో కారు ఆపమని చెప్పాను. దీంతో అతను కనిపించిన గ్యారేజీలో కారు ఆపాడు. అక్కడ ఒక మెకానిక్ ముస్లిం క్యాప్‌ను ధరించి ఉన్నాడు. నా స్నేహితుల్లో ఒకడు అతడు నా బంధువు కూడా, మేనేజర్ వద్దకు వెళ్ళి ఆ గ్యారేజీ యజమాని పేరు అడిగాడు. మేనేజర్ సమాధానమిచ్చాడు. ఆ సమాధానం విన్న వెంటనే నా స్నేహితుడు పరుగున మా వద్దకు వచ్చి ఈ గ్యారేజీ యజమాని ముస్లిం అంటరా? మనం వేరే గ్యారేజీకి వెళదామన్నాడు. దీనికి నేను అంగీకరించలేదు. వాళ్లతో పనిచేయించుకుంటే ఏమైవుతుంది ఇంకా ఎన్ని కిలోమీటర్లు హారన్ లేకుండా ప్రయాణిస్తామని గొడవపడ్డాను. దీనికి వాడు మనం హిందువులం కాబట్టి ముస్లిం నుంచి ఏమి కొనుగోలు చేయకూడదని చెప్పాడు. దీనికి నేను ఎవరూ చెప్పారు నీకు అని అడిగాను. దానికి అతడు వాట్స్‌యాప్‌లో వచ్చింది. హిందువులు ముస్లింలను బహిష్కరించండని అని ఉందన్నాడు.

వాడితో గొడవ పడడం ఇష్టంలేక అక్కడ నుంచి వేరే గ్యారేజ్‌కు వెళ్ళాము. ఆ గ్యారేజీ యజమాని కూడా ఓ ముస్లిం పేరు సర్దార్. మరి ఇక్కడా పనిచేయించుకోకుండా వెనక్కి తిరగాల్సిందేనా! ఈ వైఖరి సరైందేనా?

ప్రజల్లో ఇలాంటి వైఖరి రావడానికి ఓ రకంగా రాజకీయ నాయకులే కారణం. సమాజాన్ని విభజిస్తున్నందుకు రాజకీయ నాయకులను ఎల్లప్పుడూ మనం ప్రశ్నించవచ్చు. రాజకీయ లబ్ధి కోసం వారు సమాజంలోని భిన్న సంస్కృలను అడ్డు పెట్టుకుంటున్నారు. పక్షపాతాలను రాగ ద్వేషాలను చూపుతున్నారు. దేశమంటే కేవలం ఒక జెండానో, మ్యాపో కాదు దేశంలోని ప్రతి పౌరుడి ఆస్తి. దేశ పౌరుడు ఎప్పుడైతే తన ప్రవర్తన గురించి భయం లేకుండా ఆలోచిస్తాడో అప్పుడే సమసమాజ నిర్మాణం జరుగుతుంది. దీని కోసం ఒక్కసారి మనం వెనక్కి వెళ్ళి అసలు లౌకికవాదం అంటే ఏంటని ఆలోచించాలి. మన రాజ్యాంగంలో రాసుకున్న లౌకికవాదం అమలు జరుగుతోందో అని ఆలోచించాలి. అనుకోకుండా నేను చూసిన ముల్క్ సినిమా నా జీవితంపై మంచి ప్రభావాన్ని చూపింది. కళ్ళు మూసుకు పోయి గుడ్డిగా ఆలోచిస్తున్న నాకు కనువిప్పును కలిగించింది. స్వదేశీయులతోనే ఇన్ని భేదభావాలా? ఇది చాలా సిగ్గు పడాల్సిన విషయం. ముల్క్‌లాంటి మరిన్ని సినిమాలు రావాలని నేను ఆశిస్తున్నాను.

–ఒక యువకుడు

# మొక్కకి తొక్క!



అరటి పండును తిననివారుండరేమో బహుశా! ఎందుకంటే దీని వల్ల అన్ని ప్రయోజనాలున్నాయి. అరటి పండును తిని తొక్కను పారేశాస్తారు. కానీ అదే తొక్కను మీ మొక్కకిస్తే మీతో పాటు అది ఆరోగ్యంగా ఉంటుంది.

మీకు గార్డెనింగ్‌లో మక్కువ ఉంటే అరటి తొక్కను చెత్తబుట్టలో పడేయకండి. అరటి తొక్కలో కూడా పోషక తత్వాలు ఎక్కువే. దీని వల్ల మీకు ఎంత ఉపయోగముందో, మొక్కలకు కూడా అంతే ఉపయోగమున్నది. ఈ తొక్కను మొక్కలకు ఎరువులా ఉపయోగించవచ్చు.

- అరటి తొక్కను వేడి నీటిలో వేసి రెండు వారాల పాటు పక్కన ఉంచండి. రెండు వారాల తర్వాత ఆ నీటిని మొక్కలకు పోయండి.
- అరటి తొక్కను ముక్కలుగా కత్తిరించి ఎరువులో వేసి కొన్ని రోజులు ఉంచండి. తర్వాత దీన్ని మొక్కలకు ఎరువులా ఉపయోగించండి.
- అరటి తొక్కను మిక్సీ పట్టి వేడి నీటిలో పోయండి. ఆ నీరు చల్లారిన తర్వాత మొక్కలకు పోయండి. ఇలా చేయడం వల్ల మీ మొక్కలకు కావలసిన బలం అంది ఆరోగ్యంగా ఉంటాయి.



## చలికాలంలో మంచి నిద్రకు...

**మీరు రాత్రంతా హాయిగా నిద్రపోవాలనుకుంటే కాళ్ళకు సాక్స్‌లను ధరించండి. దీని వల్ల మీ కాళ్ళకు చలి చేరకుండా వెచ్చగా ఉంటాయి. దీంతో పాటు రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుందని పరిశోధనల్లో వెల్లడయింది.**

# కళ్ళ కింద వాపులా..!



ముఖంలో కళ్ళను మించి ప్రత్యేకమైన భాగం లేదనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఇవి అంతగా మీ అందాన్ని ఇనుమడింపజేస్తాయి. మరి ఇలాంటి కళ్ళ కింది వాపులు వస్తే మీ అందం సంగతి అటుంచితే మీ ఆత్మ విశ్వాసం దెబ్బ తింటుంది. ఇటువంటి పరిస్థితి నుంచి బయటపడాలంటే ఏం చేయాలో తెలుసుకుందామా...!

- చిన్న ప్లాస్టిక్ బ్యాగులో ఐస్ ముక్కలు వేసి పావుగంట పాటు కళ్ళ కింద ఉంచండి. ఇలా నిత్యం చేస్తే వాపులు తగ్గుతాయి.
- చల్లని నీటితో కళ్ళను కడిగినా కొంత వాపులు తగ్గుతాయి.
- ఒకవేళ మీరు ఉదయాన్నే లేచి బయటికి వెళ్ళాల్సి ఉంటే క్లంజర్‌ను అప్లై చేస్తే కొంత సేపటికి వాపు తగ్గుతుంది.
- కళ్ళపై కీర దోస ముక్కలను చక్రాల్లాగా కట్ చేసి పెట్టకుంటే కళ్ళకింద ఉబ్బు తగ్గుతుంది.
- టీ బ్యాగ్‌లను ఉపయోగించి కూడా కళ్ళ కింద వాపును తగ్గించవచ్చు. చల్లని నీటిలో టీ బ్యాగ్‌ను కాసేపు ఉంచండి. తర్వాత ఈ బ్యాగ్‌ను కళ్ళ కింద ఉంచండి. ఇలా చేసినా ఉబ్బుగా ఉన్న భాగం సాధారణ స్థితికి వస్తుంది.
- రాత్రి ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్నా లేదా ఏడ్చినా సరే ఉదయాన్నే కళ్ళు కింద వాపు ఉంటుంది. ఇలాంటి సమయంలో నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలోని ఉప్పును బయటకు పంపించవచ్చు. ఇలాంటి సమయంలో కాఫీ, టీ, ఆల్కహాల్‌కు దూరంగా ఉండండి.
- రోజు మొత్తం మీద ఎనిమిది నుంచి పది గ్లాసుల నీటిని తీసుకోండి. దీంతో శరీరంలోని వ్యర్థాలు అన్నీ తొలగుతాయి. అంతేకాక వాపులు తగ్గి చర్మం నిగారిస్తుంది.
- గ్రీన్ టీని రోజు ఉదయాన్నే పరగడుపున తీసుకోవడం వల్ల కళ్ళ కింద వాపును నివారించవచ్చు, ఫిట్‌గా ఉండవచ్చు.
- నిత్యం పడుకునే ముందు కాటన్ బాల్స్‌ను నీటిలో ముంచి కళ్ళ కింద ఉంచండి. దీని వల్ల వాపులను రాకుండా నివారించవచ్చు.

# ఇల్లు క్రిమిరహితంగా...



ఇంట్లో కిచెన్, లివింగ్‌రూమ్, డైనింగ్ రూమ్, బెడ్ రూమ్స్, బాత్ రూమ్స్‌లాంటి గదులెన్నో ఉంటాయి. ప్రతి గృహంలోనూ, గదిలోనూ అలంకరణ కోసం అక్కడక్కడ అమర్చిన వస్తువుల పరిశుభ్రతపై తగిన శ్రద్ధ తీసుకోవాలి. లేకుంటే క్రిములు, డస్ట్‌మైట్స్, బ్యాక్టీరియా, వైరస్ లాంటివి వృద్ధి చెందుతాయి. దీంతో ఆ ఇంటిలోని వారు అనారోగ్యాల బారిన పడతారు.

లివింగ్ రూమ్ అలంకరణ, శుభ్రత ఆ ఇంటి వారి కళాత్మకతను, పనితీరును తెలియజేస్తాయి. ఇంటికి వచ్చిన అతిధులు ఎక్కువ సమయం గడిపేది లివింగ్ రూమ్‌లోనే. చాలా మంది లివింగ్ రూమ్‌లోని కిటికీలను మూసేస్తారు, వాతవరణంలోని సన్నని దుమ్ము గాలికి ఎగిరి లోపలకు రాకుండా ఉండాలనేది వారి ఉద్దేశం. నిజానికి సన్నని దుమ్ము తలుపులు మూసి ఉంచినా బయట తిరిగి వచ్చిన వారి దుస్తుల ద్వారా లోనికి వస్తుంది. తలుపులు తీయని ఇంట్లో కూడా ఫర్నిచర్ మీద, డైనింగ్ టేబుల్ మీద, సెంటర్ టేబుల్ మీద ఉంటుంది. కార్పెట్ దుమ్మును ఎక్కువగా తీసుకుంటుంది. దర్వాజాలకు పెట్టిన కర్టెన్స్‌పైన దుమ్ము చేరుతుంది. అందుకని ప్రతి రోజూ డస్టింగ్ పనికి మీ దినచర్యలో కొంత సమయాన్ని కేటాయించాలి. అప్పుడు వెలుతురు, గాలి లోపలకు ప్రవేశించే వీలుంటుంది.

ప్రత్యేకించి కార్పెట్‌ను వారానికి రెండు సార్లు వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రపరచాలి. నెలకొకసారి ఎండలో వేడి, శుభ్రంగా దులిపి, వాటికి అతుకున్న వెంట్రుకలను, దారపు పోగులను, సన్నని కాగితం ముక్కలను తీసేసి శుభ్రపరిచిన తర్వాత మళ్ళీ నేల మీద పరవాలి. సోఫాలను, కుర్చీలను తడి బట్టతో తుడిచి తర్వాత పొడి బట్టతో తుడవాలి. అన్ని గదుల్లో ఫ్యానులను నెలకొకసారి డిటర్జెంట్ పొడి కలిపిన నీటితో తుడిచి, ఆ తర్వాత పొడి బట్టతో తుడవాలి. ఏ వస్తువుల మీద దుమ్ము పేరుకోకుండా శుభ్రపరుస్తుండాలి. లోపలకు ప్రవేశించే మెయిన్ డోర్ వద్ద, బయటవైపు డోర్ మ్యాట్‌ను ఉంచాలి. పాద రక్షల ద్వారా దుమ్ములోపలకు రాకుండా నిరోధిస్తుంది. డోర్ మ్యాట్ వారానికి ఒకసారి తప్పనిసరిగా క్లీన్ చేయండి. కిటికీల లోపలి, వెలుపల భాగాలను జాగ్రత్తగా శుభ్రపరచాలి. కుషన్ కవర్స్, బెడ్‌షీట్స్, పిల్లో కవర్స్‌ను నెలకి కనీసం మూడు సార్లు ఉతకాలి. పరుపులను నెలకొకసారి ఎండలో ఉంచాలి. పరుపుల మీద పరిచిన దుప్పటి, కప్పుకునే దుప్పటిని వారానికి ఒక సారి వాషింగ్ సోడా, డిటర్జెంట్ పౌడర్ కలిపిన వేడి నీటిలో నానబెట్టి ఉతకాలి. రగ్గులను స్వెట్టర్లను, వ్యాక్యూమ్ క్లీనర్‌తో క్లీన్ చేయడాలి. చలికాలం అయిపోగానే వాటిని డ్రైక్లీనింగ్ చేయించి శుభ్రపరచాలి.

వాష్‌రూమ్‌లోని టాయిలెట్ సీట్, వాష్‌బేసిన్, బకెట్స్, మగ్స్, డోర్ హ్యాండిల్, ఫ్లస్ హ్యాండిల్, నీరు ఉన్న ఫ్లష్ ట్యాంక్ లాంటి వాటిపూ బ్యాక్టీరియా ఎక్కువగా చేరే అవకాశం ఉంది. అందుకని వీటిని నిత్యం క్లీన్ చేయాలి. బాత్‌రూమ్‌ను అస్తమానం తడిగా ఉంచకుండా వైపర్‌తో క్లీన్ చేయాలి. వాష్‌రూమ్‌లోని టైల్స్‌ను వారానికొకసారైన శుభ్రం చేయాలి. పిల్లల సాఫ్ట్ టాయ్స్‌ను పదిహేను రోజుల కొకసారైనా శుభ్రపరచాలి. ముఖ్యంగా కిచెన్‌ను శుభ్రం చేయాలి. దీని వల్ల ఇంట్లోని వారందరూ ఆరోగ్యంగా ఉంటారు. వంటింట్లో కిటికీలు ఎల్లప్పుడూ తెరచి ఉంచాలి. కిచెన్‌లో సింక్ క్లీనింగ్ చాలా కీలకమైనది. దీని వల్ల ఇంట్లోకి క్రిమి చేరదు. ఇలాంటి సింక్‌ను వెనిగర్‌ను ఉపయోగించి కడగండి.

# హ్యాంగోవర్‌ను తగ్గించుకోండిలా...!



పార్టీలకు, ఫంక్షన్స్‌కి లైట్‌గా డ్రింక్ చేయడం నేటి యువతకు సాధరణమైపోయింది. కొన్ని సార్లు పార్టీ జోష్‌లో ఉండి వారికి తెలియకుండానే ఎక్కువగా తీసుకుంటారు. దీని ప్రభావం డ్రింక్ చేసే సమయంలో ఎక్కువగా ఉండకపోవచ్చు. కానీ ఆ మరసటి రోజు మాత్రం వారికి భరించలేనంత తలనొప్పి, వాంతులు, వికారం, నీరసం, అలసట, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి సమస్యలతో ఇబ్బందిపడుతుంటారు. దీనికి కారణం ఆల్కహాల్ మీ శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. మరీ వీటి నుంచి బయటపడాలంటే ఇలా చేయండి..!

**కొబ్బరి నీళ్ళు**

ఆల్కహాల్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ శరీరం ఒకరకమైనటువంటి ఒత్తిడికి గురవుతుంది. ఈ సమయంలో కొబ్బరి నీళ్ళను ఎక్కువగా తీసుకోవాలి. కొబ్బరి నీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్, పోటాషియం ఎలక్ట్రోలైట్ మీ శరీరాన్ని హైడ్రేట్ చేస్తాయి. దీని వల్ల హ్యాంగోవర్ చాలా వరకు తగ్గుతుంది.

**నీళ్ళు**

ఏంటీ నీటితో హ్యాంగోవర్ తగ్గుతుందా అని ఆశ్చర్యపోకండి. నిజంగానే ఆల్కహాల్‌తో డీహైడ్రేట్ అయిన మీ శరీరాన్ని ఎక్కువ నీటిని తీసుకోవడం ద్వారా సమతా స్థితికి తీసుకురావచ్చు. నీటిని ఎక్కువగా తీసుకుంటే ఆల్కహాల్ మీ శరీరంలో ఎక్కువ సమయం నిలవలేదు. బయటకు వచ్చేస్తుంది. దీంతో మీ హ్యాంగోవర్ అదుపులోకి వస్తుంది.

**అరటిపండు**

ఆల్కహాల్ వల్ల శరీరంలో పోటాషియం నిల్వలు తగ్గుతాయి. దీని వల్ల మీరు నీరసమవుతారు. ఈ సమయంలో పోటాషియం సమృద్ధిగా ఉన్న అరటిపండును తీసుకుంటే మీ హ్యాంగోవర్ తగ్గడంతో పాటు హెల్తీగానూ ఉంటారు. మీరు తినగలిగితే పచ్చి అరటిపండును సలాడ్‌లా చేసుకోని తీసుకోవడం మరీ మంచిది.

**పచ్చి అల్లం**

హ్యాంగోవర్ వల్ల వికారంగా ఉన్న సమయంలో అల్లం మీకు మేలు చేస్తుంది. అల్లంటీలో తేనెను ఎక్కువగా వేసి తీసుకుంటే మీ శరీరంలో మెటబాలింజం హెచ్చుగా ఉంటుంది. దీని వల్ల అల్లంటీ మీ శరీరంలో మెటబాలిజంను పెంచుతుంది. నిత్యం చిన్న పచ్చి అల్లం రసం తీసుకుంటే కడుపు నొప్పి సమస్య కూడా అదుపులోకి వస్తుంది.

**వేడి నీరు**

మీ శరీరంలోని ఆల్కహాల్ బయటికి పోవడం వల్ల కూడా మీ హ్యాంగోవర్ తగ్గుతుంది. దీని కోసం గోరు వెచ్చని నీటిలో కొంత సమయం నానితే మీ శరీరంలోని విష పదార్థాలు బయటకు వస్తాయి. వీలైతే ఎప్సిమ్ సాల్ట్‌ను కూడా జోడించండి. ఇలా చేయడం వల్ల మీ తలనొప్పి తగ్గుతుంది. ఇవే కాకుండా హ్యాంగోవర్‌ను తగ్గించుకోవడానికి వ్యాయామం, యోగా వంటివి చేయవచ్చు.

# నేను - నుడిగుండం (నవల) 25



పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575

## నిన్నటి సంచిక తరువాయి

ఉదయం స్కూల్ కి వెళ్తూ మనం ఊరెళ్తున్నాం. బట్టలు సర్ది వుంచు అనీ చెప్పాను. వెన్నెల ముఖంలో సంతోషం కనిపించింది. నేను పనులు పూర్తి చేసుకుని వచ్చాను.

"మనం విశాఖ వెళ్తున్నాం" అనేసరికి నిరుత్సాహ పడింది.

"నన్ను మనూర్లో దించి నువ్వు వెళ్లు బావా" అంది.

"నాకు విశాఖ చూపించమని నువ్వు అడిగావు"

"చిన్నప్పుడేదో అడిగాను"

"మనం అమిత పెళ్లికి వెళ్తున్నాం. తను మన పెళ్లికి వచ్చింది. మనం వెళ్లకపోతే బాగుండదు. పనిలో పని విశాఖను చూడవచ్చు. పైగా అమిత ఢిల్లీ వెళ్లిపోతుంది"

"మరి పెళ్లికి ఏమన్నా కానుక తీసుకున్నారా?"

"ఏం తీసుకోవాలో అర్థం కాలేదు"

"అందుకని మానేసారా!" తలూపాను.

"ఏం బాగుంటుంది" అంది.

************

అమిత మా కోసం హోటల్లో రూమ్ బుక్ చేసింది. ముందు మమ్మల్ని రూమ్‌లో కలిసింది.

"వెన్నెలా... నువ్వు రావటం నాకు చాలా సంతోషంగా వుంది. ఇప్పుడే ఇన్వైట్ చేస్తున్నా. మీ ఇద్దరూ ఢిల్లీ రావాలి"

వారి ఇంటికి వెళ్లాం. లలిత వచ్చింది. వచ్చే సంవత్సరం తన మ్యారేజ్ అని చెప్పింది. వెన్నెలని పరిచయం చేసాను.

"మీ పెళ్లికి రావటం నాకు కుదరలేదు" అంది లలిత. జయదేవ్ మాస్టారు, ఇంకొందరు వచ్చారు. అందరినీ పరిచయం చేసాను. అమిత మా ఇద్దరికీ బట్టలు తీసుకుంది. వెన్నెల అందుకు ఒప్పుకోలేదు.

"తీసుకో వెన్నెలా వద్దనటం బాగుండదు" అన్నాను.

"తీసుకో. మీ ప్రభాత్ చెబుతున్నా వినవా సుచిత్రా" అంది అమిత.



"నీకు ఏ కానుక తీసుకురావాలో తెలియదు. కనీసం నీ బాకీ అయినా తీర్చాల నుకున్నాను. ఈ రెండూ నా దగ్గర వుంచుకుంటున్నా. కొన్ని బాకీలు తీరకూడదు" అన్నాను.

"అదేం కుదరదు. నా బాకీ నాకు కట్టాల్సిందే" అంది.

"రుణాల రద్దు పథకం ఏమీ లేదా?"

"ఏ మాత్రం లేదు"

"అయితే వడ్డీతో సహా త్వరలో చెల్లించుకుంటాను" అన్నాను. ఇద్దరం నవ్వుకున్నాం.

ఇంతకు ముందు నేనూ-వెన్నెల కూడా ఇంత ఖరీదయిన పెళ్లి చూడలేదు. వెన్నెలకి ప్రతిదీ ఆశ్చర్యంగా వుంది.

'రావ్' గారిని నిశితంగా చూసాను. పంచెకట్టులో ఎంతో ఆకర్షణీయంగా వున్నాడాయన.

"మేడ్ ఫర్ ఈచ్ అదర్" అనుకోవటం విన్నాను. రెండు రోజులు రూమ్‌లో వుండండి అంది. వాళ్ల అమ్మా-నాన్నలకు పరిచయం చేసినప్పుడు నీ పేరు రాము కదూ అన్నారాయన.

"ఇప్పుడు ప్రభాత్" అంది నవ్వుతూ అమిత.

ఆయన కాస్త చిత్రంగా చూసి తల పంకించాడు.

మా ఇద్దరి కోసం కారు ఎరేంజ్ చేసింది. విశాఖలో చూడవలసిన ప్రాంతాలన్నీ చుట్టి వచ్చాం.

"నువ్వు విశాఖ అనగానే ఇష్టం లేకపోయినా వచ్చాను. ఇప్పుడు నాకు చాలా ఆనందంగా వుంది బావా" అంది.

"అవునూ... నువ్వంటే అమిత గారికి ఎందుకింత అభిమానం" అంది అంతలోనే...

"అది అమితను అడగకపోయావా?" అన్నాను.

"అమ్మో... ఇంకా నయం" అంది.

"మా అమ్మ అమిత నిన్ను ప్రేమించిందా అని అడిగింది" అన్నాను తనకేసి చూస్తూ....

"మన ఊరికి మొదటిసారి వచ్చినప్పుడు నాకు భయం కలిగింది. మీ బావ ఆ అమ్మాయిని చేసుకుంటాడేమో అని నా ఫ్రెండ్స్ అల్లరి పెట్టేవారు"

"ఒకవేళ చేసుకుని వుంటే...?"

"ఏం చేస్తాను. అది నా కర్మ అనుకునేదాన్ని"

"అందరూ అందర్నీ అభిమానించలేరు వెన్నెలా. నా జీవితాన్ని మలుపు తిప్పినవారు ఇద్దరు. మావయ్యా - అమితా" అన్నాను.

విశాఖ నుండి మా ఊరు వెళ్తున్నాం అని చెప్పగానే వెన్నెల ఆనందానికి అవధులు లేవు.

************

స్కూల్ నుండి ఇంటికి రాగానే ఒంటరిగా అనిపించింది. వెన్నెల కూడా అక్కడ నాలుగు రోజులు వుంటాను అంది. నాకు పనులతో కుదరదు. ఇప్పుడు వెన్నెలని వదిలి పెట్టి వచ్చి తప్పు చేసానా అనుకున్నాను.

నేనే పెళ్లి ఇప్పుడే వద్దన్నాను. అసలు నేను పెళ్లే చేసుకోను అన్నాను. శోభనం మూడు సంవత్సరాల వరకూ వద్దన్నాను. అన్నీపోయాయి. అసలు నేను ఈ ప్రపంచానికి ఏమైనా చేయగలనా! కేవలం నా సంసారంలో కూరుకుపోతానా?

ఏమో! నాలో చిన్న దిగులు మొదలయింది.

************

### క్రిటిక్‌గా నేను

నాకు రచయితలు, కళాకారులు పరిచయం అయ్యాక కొంతమందితో నేను మాట్లాడాను. అప్పుడు వారిలో ఒకాయన అన్నాడు.

"నేను ఓ పత్రిక సండే బాధ్యతలు చూస్తున్నాను. మీరు మాకు ఏదయినా కంట్రిబ్యూట్ చేయాలి" అంటూ.

"అప్పుడే నేను కంట్రిబ్యూట్ చేయటం ఏంటి?" అన్నాను.

"తెలుగులో విమర్శకులు తక్కువగా వున్నారు. మీకు కొన్ని పుస్తకాలు యిస్తాను. రివ్యూ చేయండి" అన్నాడు. నేను సంశయించాను. ఆయన బలవంతం చేసారు.

అలా కొత్త ప్రయత్నం మొదలయింది. నేను రాసిన ఒకటి రెండు సమీక్షల మీద సాహిత్య లోకంలో చర్చ జరిగింది. అవన్నీ ప్రభాత్ పేరు మీద రాసాను.

ఇప్పుడు మా స్కూల్ కి సాహితీ మిత్రులు వచ్చారు.

"నా పుస్తక ఆవిష్కరణకి మీరు సమీక్షకులుగా రావాలి. ఓసారి మీ అనుమతి తీసుకుని ఇన్విటేషన్ ప్రింట్ చేద్దాం అనుకున్నాం" అన్నారు.

"నేను ఇప్పటివరకూ ఏ వేదికల మీద మాట్లాడలేదు. ఏదన్నా పత్రికకి రివ్యూ రాస్తాను" అన్నాను..

"ఎంతకాలం మీరు తెర వెనక వుంటారు. మీ సమీక్షల మీద లిటరరీ సర్కిల్‌లో వేడి వేడి చర్చలు జరుగుతున్నాయి. హైదరాబాద్ లోనే కాదు, ఆంధ్రాలో కూడా. మొదటిసారి మాట్లాడండి. అది నాకో రికార్డ్ అవుతుంది" అన్నాడు రచయిత.

నాకు కూడా కాస్త మార్పు కావాలనుకున్నాను.

బలవంతం మీద ఒప్పుకున్నాను. నాలుగు రోజుల్లో సభ. పుస్తకం చదవటం మొదలు పెట్టాక అనవసరంగా ఒప్పుకున్నాను అనే భావం వచ్చింది.

ఈ పుస్తకంలో పరస్పర విరుద్ధమైన భావాలున్నాయి. ముఖ్యంగా అరాచకత్వం వుంది. పుస్తకాలు ఆవిష్కరించుకునేవారు తమ గురించి, రచన గురించి నాలుగు మంచి మాటలు చెప్పాలనుకుంటారు. మొదటి పుస్తకంతోనే యిబ్బంది వచ్చింది.

నేను కాకుండా వేదిక మీద మరో ముగ్గురున్నారు. వారు ఆ పుస్తకం చాలా గొప్పదన్నట్లు మాట్లాడారు.

నావంతు వచ్చింది.

"మొదటిసారి నేను సభల్లో మాట్లాడుతున్నాను. ఇక్కడ ప్రముఖులు వున్నారు. ఇంతకుముందు రివ్యూస్ రాసాను. నేను క్రియేటర్‌గా వుండదలుచుకుంటే ఆ పని చేసేవాడిని కాదు. ముందుగా చెప్పదలుచుకుంది - ఇవి నా అభిప్రాయాలు మాత్రమే..." అని మొదలు పెట్టాను. "మనం ఏదయినా రాయవచ్చు. బట్ ఎట్ ది కాస్ట్ ఆఫ్ లిటరరీ 'మర్యాద కాకూడదు" అన్నాను.

హాల్లోని కబుర్లన్నీ ఆగిపోయాయి.

"మనం కొన్ని సూత్రాలు పాటిస్తున్నాం. వాటిలో ఎప్పటివో వుండొచ్చు. అవన్నీ ఔట్ డేటెడ్ అనిపించినప్పుడే కొందరు వాటిని బ్రేక్ చేస్తారు. సాహిత్య రంగంలో అలాంటి ఉద్యమాలెన్నో మీకు తెలుసు" "కొంతమంది కంటెంట్‌లో ఇంకొంతమంది ఫామ్‌లో తమ ధిక్కారాన్ని చూపిస్తారు. ఇక్కడ ఘర్షణ మొదలవుతుంది. యుద్ధ రంగంలో శత్రువులు కూడా కొన్ని నియమాలను పాటిస్తారు. ఇక్కడ అలాంటిది లేదు"

ఒక్కసారిగా నిశ్శబ్దం.

"శంకర్ కేవలం సంచలనం కోసం ఆవేశ పడినంతగా భావాలు, నిర్మాణం విషయంలో జాగ్రత్తలు తీసుకోలేదు. ఈ పుస్తకంలో ఎన్నో వైరుధ్యాలున్నాయి." మళ్లీ గుసగుసలు మొదలయ్యాయి.

ఇతనెవరు? ఏ గ్రూప్ వాడు? అని గుసగుసలాడుతున్నారని నాకు తెలుసు. నేను కొన్ని ఉదాహరణలు చెప్పాను. మధ్యలో శంకర్ని చూసాను. అతను నవ్వుతున్నా లోలోపల రగిలి పోతున్నాడని అర్థం అయింది.

"శంకర్‌కి మంచి టాలెంట్ ఉంది. కొన్ని వ్యక్తీకరణలు సంచలనం కోసమా? తను నమ్మినవా? అనేది తను చెబుతాడు. ఇప్పటికయినా మించి పోయింది లేదు. తన పద్ధతి మార్చుకుంటే బాగుంటుంది. లేకపోతే అరాచకవాదిగా మిగులుతాడనే భయం నాకుంది" అంటూ ముగించాను.

శంకర్ ధన్యవాదాలు చెప్పటానికి లేచాడు.

(ఇంకా ఉంది)

# ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఈ-లెర్నింగ్‌పై పెరుగుతున్న ఆసక్తి



**దేశంలో విద్యారంగంలో ఈ ఏడాది నుంచి టెక్నాలజీ కీలక పాత్ర పోషించనుంది. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఈ-లెర్నింగ్‌పై విద్యార్థులు, ఉద్యోగార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.**

ట్యాబ్, ల్యాప్‌ట్యాప్‌తో సమస్త విజ్ఞానాన్ని నేర్చుకునే దిశగా మన యువత పయనిస్తోంది. క్లాస్‌రూమ్‌లో పాఠాలు వినే బదులు.. ఇంట్లోనే కంప్యూటర్ ముందు కూర్చొని ప్రఖ్యాత ప్రొఫెసర్ల లెక్చర్స్ వినడంపై ఇష్టం పెరుగుతోంది. సివిల్స్, గ్రూప్స్, జేఈఈ, నీట్, గేట్, క్యాట్... పోటీ పరీక్ష ఏదైనా... ఆన్‌లైన్ లెర్నింగ్‌కే నేటి యువత మొగ్గు చూపుతోంది. దేశంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ రంగం ఏటా 40 శాతం వృద్ధి సాధించనుందనే అంచనాలే ఇందుకు నిదర్శనం. ఆన్‌లైన్ వీడియోస్, ఈ-ట్యూషన్స్, మాక్ టెస్ట్స్, మోడల్ పేపర్స్.. ఇలా పలు రకాలుగా విస్తరిస్తున్న ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ రంగం.. కొత్త సంవత్సరంలో మరింతగా దూసుకుపోనుందనే అంచనాల నేపథ్యంలో నిపుణుల విశ్లేషణ...

బైజూస్ లెర్నింగ్.. యాప్ మోడల్‌తో ప్రారంభమైన ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థ ఇది. ఇప్పుడు ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గడించింది. తాజాగా 540 మిలియన్ డాలర్ల ఫండింగ్‌తో రూ.25,000 కోట్ల విలువ గల సంస్థగా మారి.. దేశంలో అతిపెద్ద ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రొవైడర్ (ఎడ్‌టెక్ స్టార్టప్)గా నిలిచింది. అకడమిక్‌గా కె-3 స్థాయి నుంచి కె-12 స్థాయి వరకు.. జాతీయస్థాయిలో అన్ని పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న సంస్థ. ప్రస్తుతం ఈ సంస్థలో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 20 మిలియన్లు.

టాపర్ డాట్ కామ్.. దేశంలో మరో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్. దాదాపు అన్ని రాష్ట్రాల బోర్డులకు సంబంధించిన సిలబస్‌కు అనుగుణంగా.. ఈ-ట్యుటోరియల్స్, టెస్ట్‌సు అందిస్తూ.. ఏంజెల్ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్న సంస్థ. ప్రస్తుతం ఈ సంస్థలో రిజిస్టర్ అయిన విద్యార్థుల సంఖ్య మూడు మిలియన్లు.

అన్‌అకాడమీ.. సివిల్స్, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, ఐఐటీ జేఈఈ, క్యాట్, గేట్ తదితర పరీక్షలకు ఆన్‌లైన్‌లో వీడియో లెక్చర్స్ అందిస్తున్న మరో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్. ఈ పోర్టల్‌లో ఆన్‌లైన్ వీడియోలు, మాక్‌టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు వంటి వాటిని వీక్షిస్తున్న వారి సంఖ్య 40 మిలియన్లకు పైగానే.

మన దేశంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పట్ల పెరుగుతున్న ఆదరణకు ప్రత్యక్ష నిదర్శనమే... అన్ అకాడమీ, బైజూస్, టాపర్ డాట్ కామ్ విస్తరణ.

ఈ మూడు సంస్థలే కాదు.. ప్రస్తుతం మన దేశంలో.. 1800 వరకు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థలు (ఎడ్‌టెక్ స్టార్టప్స్) అందుబాటులో ఉన్నాయంటే.. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఎంతలా విస్తరిస్తోందో.. ఏ స్థాయిలో ఆదరణ పొందుతుందో అర్థం చేసుకోవచ్చు.

**రానున్న రోజుల్లో భారీ మార్కెట్...**

మన ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పరిశ్రమ.. ఏటా 40 శాతంపైగా వృద్ధిరేటుతో 2021 నాటికి 1.96 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని అంచనా. ప్రస్తుతం దాదాపు 71 మిలియన్ల మంది ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌వైపు మొగ్గు చూపుతున్నట్లు అంచనా. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై ఆసక్తి, ఆదరణ పెరగడానికి స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య పెరగడం ప్రధాన కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాంతోపాటు విద్యార్థుల్లో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై అవగాహన పెరగడం, అన్ని రకాల సందేహాలు ఒకే ప్లాట్‌ఫామ్‌పై నివృత్తి చేసుకునే అవకాశముండటం మరో కారణంగా చెప్పొచ్చు. ఫలితంగా మన దేశంలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పరిశ్రమ శరవేగంగా విస్తరిస్తూ.. యూఎస్, యూకేలతో సైతం పోటీపడే స్థాయికి చేరుకుంది.

**ఈ-ట్యుటోరియల్స్ :**

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో అత్యంత ఆదరణ పొందుతున్న విభాగం.. ఈ-ట్యుటోరియల్స్. అంటే.. ఆన్‌లైన్ విధానంలోనే నిపుణుల పాఠాలు వినే అవకాశం లభించడం. స్కూల్ స్థాయి నుంచి ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థుల వరకూ.. అందరూ 'ఈ లెర్నింగ్' బాటపడుతున్నారు. కోచింగ్, ట్యూషన్‌లకు వెళ్లాలంటే.. ఎంతో వ్యయప్రయాసలకోర్చాల్సిన పరిస్థితి. కోచింగ్‌కు భారీ ఫీజులే కాకుండా.. ట్రాఫిక్‌లో గంటల పాటు ఎంతో విలువైన సమయం వృథా అవుతోంది. అందుకే స్మార్ట్‌ఫోన్/ ల్యాప్‌ట్యాప్/ కంప్యూటర్‌తోపాటు ఇంటర్నెట్ ఉంటే చాలు.. ఇంట్లోనే కూర్చుని నిపుణుల లెక్చర్స్ వినే అవకాశం ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విధానంలో లభిస్తోంది. అందుకే విద్యార్థులు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. స్కూల్ స్థాయి విద్యార్థుల విషయంలో వారి తల్లిదండ్రులే చొరవ తీసుకుని ఈ-ట్యుటోరియల్స్‌ను ఆశ్రయిస్తున్నారు.

**క్లాస్ మిస్ అనే టెన్షన్ లేదు :**

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో మరో ముఖ్య సౌలభ్యం.. క్లాస్ మిస్ అవుతుందే ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోవడం. కారణం.. ఒకసారి సదరు పోర్టల్‌లో సబ్‌స్క్రైబ్ చేసుకున్న విద్యార్థులకు ప్రీవియస్ లెక్చర్స్‌ను వీక్షించే అవకాశం లభిస్తోంది. వాటికి సంబంధించి అంతకుముందు విద్యార్థులు లేవనెత్తిన సందేహాలు, వాటికి సదరు ఎడ్యుకేటర్స్ ఇచ్చిన సమాధానాలు కూడా తెలుసుకునే అవకాశం లభిస్తోంది. దీంతో ఒక క్లాస్ మిస్ అయినా.. లేదా ఒక క్లాస్‌కు సంబంధించి సందేహాలు ఉన్నా.. క్షణాల్లో నివృత్తి చేసుకునే సదుపాయం కలుగుతోంది. ఒకవేళ సంప్రదాయ పద్ధతిగా పేరు గడించి ట్యూషన్స్‌లో చేరిన విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి తమకు మెచ్చేలా నిపుణుల బోధన లభించడంలేదు. అదే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఈ-ట్యుటోరియల్స్‌లో అయితే... సదరు ట్యూటర్ ప్రొఫైల్, ప్రీవియస్ లెక్చర్స్ వినే అవకాశం ఉంటోంది. దానిద్వారా తమకు నచ్చే ట్యూటర్‌ను ఎంపిక చేసుకునే అవకాశం లభిస్తోంది.

**మాక్ టెస్టులు.. వర్చువల్ ల్యాబ్స్ :**

ఈ-ఎడ్యుకేషన్ ఫలితంగా విద్యార్థులకు.. తమ నైపుణ్యాలను అంచనా వేసుకునే అవకాశం లభిస్తోంది. అన్ని ఎడ్‌టెక్ స్టార్టప్ సంస్థలు మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాయి. ఆ తర్వాత వాటి ఫలితాలను వెల్లడించడంతోపాటు ఏఏ అంశాల్లో పట్టు సాధించాలనే విషయంపైనా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాయి. దీంతో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టుకునే అవకాశం లభిస్తోంది. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో మరో సదుపాయం.. వర్చువల్ లేబొరేటరీస్. ఏదైనా ఒక అంశానికి సంబంధించి ప్రాక్టికల్ వర్క్ (ల్యాబ్ వర్క్) చేయాలంటే.. అందుకు క్రమపద్ధతిలో అనుసరించాల్సిన విధానాలు కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులకు ల్యాబ్ వర్క్ విషయంలో సైతం ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల విద్యార్థులకు ఇవి అత్యంత ఉపయుక్తంగా ఉంటున్నాయి.

**నిష్ణాతులైన ట్యూటర్స్ :**

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సదుపాయాన్ని అందిస్తున్న సంస్థలు.. ఈ-ట్యూషన్స్, లెక్చర్స్ పరంగా ట్యూటర్స్‌ను నియమించుకునే క్రమంలో అప్రమత్తంగా, జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. సదరు సబ్జెక్ట్‌లో నిష్ణాతులైన వారిని నియమించికొని.. ప్రామాణిక కంటెంట్‌ను అందించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రమాణాలు పాటించకుంటే.. ఇతర ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థలతో పోటీలో నిలవలేమని భావిస్తున్నాయి. ప్రమాణాలు పాటించకుంటే.. విద్యార్థులను ఆకట్టుకోవడం కష్టమని, మార్కెట్‌లో రెప్యుటేషన్ సైతం దెబ్బతింటుందనే ఆలోచన చేస్తున్నాయి. కాబట్టి ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పరంగా సబ్జెక్ట్ నిపుణుల విషయంలో విద్యార్థులు ఆందోళన చెందక్కర్లేదని నిపుణుల అభిప్రాయం.

**కొత్త సంవత్సరంలో.. సరికొత్తగా**

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌కు 2018లో భారీగా ఆదరణ లభించింది. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే 40 శాతం మేరకు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సబ్‌స్క్రైబర్స్ సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనం.




ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థలు.. మరికొద్ది రోజుల్లో పలకరించ నున్న కొత్త సంవత్సరంలో సరికొత్తగా అడుగులు వేసేందుకు సిద్ధం అవుతు న్నాయి. ఇప్పటివరకు విద్యార్థులనే ప్రధాన లక్ష్యంగా చేసుకుని కార్యకలా పాలు నిర్వహిస్తున్న ఈ సంస్థలు.. త్వరలో వర్కింగ్ ప్రొఫెషనల్స్‌ను ఆకర్షించేందుకు కూడా సన్నాహాలు ప్రారంభిస్తున్నాయి.

**రీ-స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ :**

వేగంగా మారిపోతున్న టెక్నాలజీ దృష్ట్యా ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఉద్యోగంలో చేరినా... అందులో నిలదొక్కుకునేందుకు రీ-స్కిల్లింగ్ తప్పనిసరిగా మారింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఎడ్‌టెక్ స్టార్టప్స్.. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు రీ-స్కిల్లింగ్‌పై దృష్టిసారిస్తున్నాయి. ఉద్యోగులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇప్పటికే ఈ దిశగా కొన్ని ఎడ్యుటెక్ సంస్థలు అడుగులు వేయగా..మిగతా సంస్థలు సైతం ఇదే బాటపడుతున్నాయి. ముఖ్యంగా ఐఓటీ, ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి లేటెస్ట్ టెక్నాలజీపై రీ-స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ అందించేందుకు సిద్ధమవుతున్నాయి. హెల్త్‌కేర్, టెక్నాలజీ, క్రిమినల్ జస్టిస్, ఆర్ట్స్ అండ్ డిజైన్, హాస్పిటాలిటీ వంటి ముఖ్యమైన విభాగాల్లోని ఉద్యోగులకు ఐటీ, దాని అనుబంధ కోర్సులపై ఈ-ట్యుటోరియల్స్, రీ-స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించేందుకు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ స్టార్ట్ అప్స్ ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. మరోవైపు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థలు.. రిజిస్టర్ చేసుకున్న ట్యూటర్స్‌కు సైతం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి.

**అన్ని టెస్టులు ఆన్‌లైన్‌లోనే..**

ప్రస్తుతం విద్యారంగంలో ఎక్కువ శాతం పోటీ పరీక్షలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇంటర్ అర్హతతో నిర్వహించే జేఈఈ-మెయిన్ నుంచి క్యాట్, గేట్, జీప్యాట్ తదితర పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. రాష్ట్రాల స్థాయిలోనూ ఆన్‌లైన్ విధానం తెరపైకి వచ్చింది. తెలుగు రాష్ట్రాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఎంసెట్, పీజీఈసెట్, ఐసెట్ తదితర పరీక్షలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇది కూడా దేశంలో ఎడ్‌టెక్ స్టార్టప్స్ విస్తరణకు మార్గంగా మారుతోంది. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్స్‌లో నమోదు చేసుకుంటున్న వారిలో టెస్ట్ ప్రిపరేషన్ విభాగానిదే పైచేయిగా నిలుస్తోంది.

**అకడమిక్ పరీక్షలూ.. ఆన్‌లైన్‌లో?**

ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. భవిష్యత్తులో అకడమిక్ పరీక్షలు కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అవకాశం లేకపోలేదు అనేది నిపుణుల అభిప్రాయం. ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న గేట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షల్లో రెండు, మూడు వాక్యాల్లో సమాధానాలివ్వాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటున్నాయి. కాబట్టి భవిష్యత్తులో అకడమిక్ స్థాయిలోనూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించినా ఆశ్చర్యపోనక్కర్లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పరంగా విద్యార్థులు టైపింగ్ స్కిల్స్, కీ బోర్డ్ కమాండ్స్ వంటి వాటిపైనా అవగాహన పెంచుకోవడం మేలు చేస్తుంది.

**ఆన్‌లైన్ ఎడ్యుకేషన్.. ముఖ్యాంశాలు**

- ఏటా 20 శాతంపైగా వృద్ధి సాధిస్తున్న భారత ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ రంగం
- టెస్ట్ ప్రిపరేషన్‌కోసం ఆన్‌లైన్ వైపు దృష్టిసారిస్తున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది.
- ఆ తర్వాత స్థానంలో నిలుస్తున్న ఈ-ట్యుటోరియల్స్ సబ్‌స్క్రైబర్స్.
- రానున్న రోజుల్లో వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న ఎడ్‌టెక్ స్టార్టప్ సంస్థలు.
- 2021 నాటికి బిలియన్ డాలర్లకు చేరుకోనున్న భారత ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ రంగం.

**పెంచుకోవాల్సిన నైపుణ్యాలు...**

రానున్న రోజుల్లో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కొత్త రూపు సంతరించుకోనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు కూడా వాటిని వినియోగించుకునేందుకు పెంచుకోవాల్సిన నైపుణ్యాలు..

- కంప్యూటర్ స్కిల్స్
- టైపింగ్ స్కిల్స్
- కీ బోర్డ్ షార్ట్‌కట్ కమాండ్స్
- లాంగ్వేజ్ స్కిల్స్
- చాటింగ్ స్కిల్స్ (ఆన్‌లైన్ లెక్చర్స్‌లో లైవ్ డిస్కషన్స్ కోసం).

**ఆదరణ పెరుగుతోంది..**

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పట్ల విద్యార్థుల్లో ఆదరణ విస్తృతంగా పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం.. స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, యాప్ బేస్డ్ సేవలను సైతం ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థలు అందిస్తుండటమే. మరోవైపు తల్లిదండ్రులు కూడా ముఖ్యంగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్థాయిలో తమ పిల్లలకు నాణ్యమైన బోధన లభించాలని కోరుకుంటున్నారు. వీటి ఫలితమే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విస్తరించడం. విద్యార్థులు కేవలం టెస్ట్ ప్రిపరేషన్ విభాగానికే పరిమితం కాకుండా.. మిగతా సదుపాయాలు కూడా వినియోగించుకుంటే మరింత ఉపయుక్తంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**కొత్త ధోరణులు సహజం :**

అన్ని రంగాల మాదిరిగానే ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఎడ్‌టెక్ స్టార్టప్స్ కొత్త ట్రెండ్స్ తీసుకు రావాలనుకోవడం, ఈ దిశగా కసరత్తు చేయడం సహజమే. ఈ క్రమంలోనే రీ-స్కిల్లింగ్, వర్కింగ్ ప్రొఫెషనల్ సెంట్రిక్ ప్రోగ్రామ్స్ దిశగా సంస్థలు అడుగులు వేయడాన్ని పేర్కొనొచ్చు. ఇక.. ఇప్పటికే ఉన్న ఈ-ట్యూషన్స్, టెస్ట్ ప్రిపరేషన్ కోణంలోనూ వినూత్న విధానాలు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# విశ్వసుందరి-2018 పోటీల్లో విజేతగా నిలిచింది ఎవరు ?

**కరెంట్ ఎఫైర్స్ బిట్‌బ్యాంక్**

- ఉత్తరప్రదేశ్‌లో ఓబీసీల కోటా అయిన 27 శాతం నుంచ కుర్మీలు, యాదవ్‌లకు ఎంత శాతం రిజర్వేషన్లు కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం నియమించిన సామాజిక న్యాయ కమిటీ సిఫారసు చేసింది ? **- 7 శాతం**
- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొట్టమొదటి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు నియమితులయ్యారు ? **- జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్**
- బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ? **- పూసర్ల వెంకట సింధు**
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద మిగులు నిధులు ఎంతమేర ఉండాలనే అంశంపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ నేతృత్వంలో ఒక కమిటీని ఆర్‌బీఐ 2018 డిసెంబర్ 26న నియమించింది. ఆయన ఎవరు ? **- బిమల్ జలాన్**
- న్యూజెర్సీలోని ఫోర్డ్స్ సిటీలో 2018 డిసెంబర్ 15న జరిగిన అందాల పోటీల్లో మిస్ ఇండియా వరల్డ్ వైడ్ కిరీటం ఎవరికి దక్కింది ? **- భారతీయ అమెరికన్ యువతి శ్రీ సైనీ (22)**
- ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 2018 డిసెంబర్ 18న విడుదల చేసిన 'అంతర్జాతీయ స్త్రీ, పురుషుల వ్యత్యాస నివేదిక - 2018'లో ఏ దేశం ప్రథమ స్థానంలో నిలిచింది ? **- ఐస్‌లాండ్**
- అసమానతలకు అతీతంగా మహిళలు స్వతంత్రంగా ఎదిగి ధైర్యంగా ముందడుగు వేసేలా చేయడమే లక్ష్యంగా వారి కోసం ప్రత్యేకంగా 'జాతీయ మహిళా పార్టీ' (ఎన్‌డబ్ల్యూపీ)ని ఎవరు స్థాపించారు ? **- శ్వేతాశెట్టి**
- ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) నూతన అధ్యక్షుడిగా ఎవరు ఎంపికయ్యారు ? **- సందీప్ సోమానీ**
- అమెరికాలో భారతదేశ రాయబారిగా ఎవరు నియమితులయ్యారు ? **- హర్షవర్ధన్ శ్రింగ్లా**
- ఆసియా చెస్ ఛాంపియన్‌షిప్ 2018 టోర్నీలో విజేతగా నిలిచింది ఎవరు ? **- పద్మిని రౌత్**
- టైమ్ మ్యాగజైన్ 2018 ఏడాదికి సంబంధించి ప్రకటించిన అత్యంత ప్రభావశీల టీనేజర్ల కేటగిరీలో ముగ్గురు భారతీయ సంతతి విద్యార్థులు చోటు సంపాదించారు. వారెవరు ? **- ఇండో-అమెరికన్ కావ్య కొప్పరపు, రిషబ్ జైన్, బ్రిటీష్-ఇండియన్ అమికా జార్జ్**
- ఉభయ కొరియాలను రైలు, రోడ్డు 'బంధం'తో ఏకం చేసే ప్రాజెక్టు పనులను ఏరోజున లాంఛనంగా ప్రారంభించారు ? **- 2018 డిసెంబర్ 26**
- ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ క్యాప్ జెమినీ భారత విభాగానికి ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ? **- శ్రీనివాస్ కందుల**
- 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (ఆర్ఎస్ఎఫ్' సంస్థ పాత్రికేయు లకు ప్రమాదకర దేశాలతో రూపొందించిన జాబితాలో భారతదేశానికి ఎన్నవ స్థానం దక్కింది ? **- 5వ స్థానం**
- రైతులకు అండగా నిలిచేందుకు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 21న కలియా (కృషక్ అసిస్టెన్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఇన్‌కం అగ్మెంటేషన్) పేరుతో కొత్త పథకాన్ని స్థాపించింది ? **- ఒడిశా**
- రాజకీయ సందిగ్ధత కారణంగా గత ఆరు నెలలుగా గవర్నర్ పాలనలో ఉన్న జమ్మూ-కాశ్మీర్ ఎప్పుడు రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది ? **- 2018 డిసెంబర్ 19 అర్ధరాత్రి నుంచి**
- ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఎవరిని నియమిస్తూ మంత్రివర్గ నియామకాల కమిటీ (ఏసీసీ) నిర్ణయం తీసుకుంది ? **- డీవీ ప్రసాద్**
- మధ్యాసియా, పశ్చిమాసియా, యూరప్ దేశాల కూడలిగా భావించే ఇరాన్‌లోని చాబహార్ రేవు పట్టణంలో భారత్ ఆధ్వర్యంలో నిర్మితమైన షహీద్ బెహెస్తీ ఓడరేవు ఏ రోజున లాంఛనప్రాయంగా ప్రారంభమైంది ? **- 2018 డిసెంబర్ 24న**
- కెన్యాలో పారిశ్రామికవేత్తగా ఎదిగిన తెలుగు వ్యక్తికి ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఎల్డర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది గోల్డెన్ హార్ట్' లభించింది. ఆయనెవరు ? **- పమిడిముక్కల సాంబశివరావు**
- హాకీ ప్రపంచకప్‌ను ఏ దేశం గెలుపొందింది ? **- బెల్జియం**
- ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (మైసూరు) సంచాలకుడిగా ఎవరిని కేంద్ర మానవ వనరుల శాఖ నియమించింది ? **- ఆచార్య డి.మునిరత్నం నాయుడు**
- మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో జర్మనీ స్టాక్ మార్కెట్‌ను అధిగమించడం ద్వారా ప్రపంచంలో ఏడో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా ఏ దేశం అవతరించిందని బ్లూమ్‌బర్గ్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది ? **- భారత్**
- అమెరికా రక్షణ మంత్రిగా జిమ్ మాటిస్ స్థానంలో ఎవరిని నియమించినట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు ? **- ప్యాట్రిక్ షానహన్**
- అద్దె గర్భాల పేరుతో జరిగే వ్యాపారాన్ని నిషేధిస్తూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఏ రోజున లోక్‌సభ ఆమోదించింది ? **- 2018 డిసెంబర్ 19న**
- తెలంగాణ తొలి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2019 జనవరి 1న ఎవరు ప్రమాణస్వీకారం చేశారు ? **- జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్**
- విశ్వసుందరి- 2018 పోటీల్లో విజేతగా నిలిచింది ఎవరు ? **- క్యాట్రియోనా గ్రే**
- బహుళజాతి కొరియర్ సేవల సంస్థ ఫెడెక్స్ ఎక్స్‌ప్రెస్ అధ్యక్షుడు, సీఈఓగా ఎవరు నియమితులయ్యారు ? **- రాజేశ్ సుబ్రమణియం**

# విశాలాంధ్ర బిజినెస్

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 86.63 ▲ సెన్సెక్స్ 36,195.10 | 18.30 ▲ నిఫ్టీ 10,849.80 | -10 ▼ బంగారం (విజయవాడ) 30,050 22 క్యారెట్లు, 10 గ్రాములు | బంగారం (విశాఖపట్నం) 30,890 ప్రొద్దుటూరు 30,890 22 క్యారెట్లు, 10 గ్రాములు | -200 ▼ వెండి (విజయవాడ) 40,000 కిలో (రూపాయల్లో) | వెండి (విశాఖపట్నం) 41,450 ప్రొద్దుటూరు 42,259 కిలో (రూపాయల్లో) | డాలరు Vs రూపాయి 71.07 |

### టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

| కంపెనీ | ప్రస్తుత ధర | మార్పు (శాతాల్లో) |
|---|---|---|
| ఎస్-బ్యాంక్ | 215.40 | 9.20 |
| రిలయన్స్ | 1,247.45 | 1.72 |
| టీసీఎస్ | 1,901.55 | 1.38 |
| జేఎస్‌డబ్ల్యూ స్టీల్ | 284.40 | 0.98 |
| టెక్ మహీంద్ర | 730.00 | 0.98 |

### టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

| కంపెనీ | ప్రస్తుత ధర | లాస్ (శాతాల్లో) |
|---|---|---|
| భారతీ ఇన్‌ఫ్రాటెల్ | 263.00 | -5.05 |
| టాటా మోటార్స్ | 175.40 | -2.69 |
| యూపీఎల్ | 747.35 | -2.03 |
| సన్‌ఫార్మా | 438.00 | -1.86 |
| సిప్లా | 510.70 | -1.69 |

### విదేశీమారకం విలువ (ఫారెక్స్)

| కరెన్సీ | రూ.విలువ క్రి.ముగింపు | రూ.విలువ ప్ర.ముగింపు |
|---|---|---|
| డాలర్ | 71.34 | 71.07 |
| యూరో | 81.06 | 80.67 |
| పౌండ్ | 92.90 | 92.66 |
| ఆస్ట్రేలియా డాలర్ | 50.89 | 50.47 |
| సింగపూర్ డాలర్ | 52.49 | 52.24 |

### బులియన్

| బంగారం (10 గ్రాములు) | 22 క్యారెట్లు రూ. | 24 క్యారెట్లు రూ. |
|---|---|---|
| హైదరాబాద్ | 30,890 | 32,037 |
| చెన్నై | 30,890 | 32,037 |
| బెంగళూరు | 30,300 | 32,406 |
| ముంబై | 31,720 | 33,925 |
| విజయవాడ | - | 33,450 |
| విశాఖపట్నం | 30,890 | 33,700 |
| ప్రొద్దుటూరు | 30,890 | 32,430 |
| ముడి చమురు | | 61.14 |



## లాభాల్లో మార్కెట్లు

### 87 పాయింట్లతో సెన్సెక్స్

**ముంబై :** గత రెండు సెషన్లలో నష్టాలను చవి చూసిన దేశీయ మార్కెట్లు గురువారం కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలతో గురువారం ట్రేడింగ్ ఆద్యంతం ఒడుదొడుకులతో సాగిన సూచీలు చివరకు లాభాలతో ముగిశాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ తెరపైకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా సాగాయి. ఈ పరిణామాలపై దృష్టిపెట్టిన దేశీయ మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో గురువారం నాటి సెషన్‌ను సూచీలు మందకొడిగానే ప్రారంభించాయి. ట్రేడింగ్ ఆరంభంలో లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు చివరి గంటల్లో కాస్త కోలుకున్నాయి. యస్‌బ్యాంక్, రిలయన్స్, ఐటిసి లాంటి దిగ్గజ షేర్లు రాణించడం మార్కెట్‌కు కలిసొచ్చింది. దీంతో నేటి ట్రేడింగ్‌ను సూచీలు లాభాలతో ముగించాయి. సెన్సెక్స్ 86.63 పాయింట్లు లాభపడి 0.24శాతంతో 16,195 వద్ద, నిఫ్టీ 18 పాయింట్ల లాభంతో 0.17శాతంతో 10,850 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.22గా కొనసాగుతోంది. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసి, టిసిఎస్, ఎస్‌బీఐ 8.39 శాతం వరకు ర్యాలీని నమోదుచేసాయి. మధ్యాహ్నం నుంచి కోలుకున్న సూచీలు 0.24శాతంతో 36,195 పాయింట్లు నమోదుచేసాయి. గేజ్ గత రెండు సెషన్లలోనూ 470పాయింట్లకు పైగానష్టపోయింది. సెన్సెక్స్ ప్యాక్‌లో రియల్ ఎస్టేట్, ఐటి,పిఎస్‌యు బ్యాంకులు టాప్ గెయినర్స్‌గా నమోదయ్యారు. రిలయన్స్ విలువ గత మూడునెలలో 1.61శాతం పెరిగింది. యస్‌బ్యాంకు షేర్లు 8.39శాతంపెరిగాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో టిసిఎస్, ఎస్‌బీఐ,యాక్సిస్ బ్యాంకు, హీరోమోటాకార్ప్, ఆసియన్ పెయింట్స్, హెచ్‌సిఎల్ టెక్,వేదాంత లిమిటెడ్, 1.17శాతం పెరిగాయి. ఇండస్‌ఇండ్‌బ్యాంకు, మారుతి సుజుకి, బజాజ్‌ఫైనాన్స్, 2.72శాతం నష్టపోయాయి. ఎన్ఎస్‌ఈలో యస్‌బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడగా.. టాటామోటార్స్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, యూపీఎల్ లిమిటెడ్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోఆసియా మార్కెట్లు లాభాల్లో నమోదయ్యాయి. యూరోపియన్‌షేర్లు నష్టాలు నమోదుచేసాయి. షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 0.41 శాతం పెరిగింది. హాంగ్‌కాంగ్ హేంగ్‌శేంగ్ 0.27 శాతం, తైవాన్ ఇండెక్స్ 0.31శాతం,స్ట్రయిట్స్ టైమ్స్ 0.28శాతం లాభించింది. జపాన్ నిక్కీ 0.09శాతం నష్టపోగా, యూరోజోన్‌లో ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 0.32 శాతం, పారిస్ సిఏసి 40 0.14శాతం, నష్టపోయింది. లండన్ ఎఫ్‌టిఎస్ఇ 0.24శాతం నష్టాన్ని నమోదుచేసింది.

# 'పౌరసత్వ' రగడ

- ఏజీపీ పది గంటల నిరాహార దీక్ష
- కాంగ్రెస్ ఐదు గంటల ధర్నా
- మేధావులు, జర్నలిస్టులు, ఆర్టీఐ కార్యకర్తల మద్దతు



**గువహటి:** పౌరసత్వ (సవరణ)బిల్లుకు వ్యతిరేకంగా ఈశాన్య ప్రాంతంలో నిరసన కొనసాగుతోంది. సమ్మె, ర్యాలీలు, ప్రదర్శనలు, ధర్నాలు, ఘెరావ్‌లతో ఈశాన్య ప్రాంతం దద్దరిల్లుతోంది. అసోం గణపరిషత్ (ఏజీపీ) ఇచ్చిన పది గంటల నిరాహారదీక్షకు అసోంలో మంచి స్పందన వచ్చింది. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో 5 గంటల బైఠాయింపు జరిగింది. పాలక బీజేపీతో ఏజీపీ ఇటీవలే సంబంధాలు తెంచు కున్నది. ఈ బిల్లును పూర్తిగా రద్దుచేసే వరకు నిరసన కొనసాగుతుందని కాంగ్రెస్, ఏజీపీ స్పష్టం చేశాయి. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఏజీపీ నిర్వహిస్తున్న ఆందోళనకు క్రిషక్ ముక్తి సంగ్రాం సమితి (కేఎంఎస్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కేఎంఎస్ఎస్ సలహాదారు అఖిల్ గొగోయ్ మాట్లాడుతూ, పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర మంతటా విడివిడిగా జరుగుతున్న ఆందోళనలను ఐక్యం చేస్తే ప్రభుత్వంపై కనీస ప్రభావం చూపుతుందని అన్నారు. రాష్ట్ర రాజధాని గువహటిలో నిర్వహించిన నిరాహార దీక్షలో ఏజీపీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. "ఈశాన్య ప్రాంత ప్రజలు ప్రమాదంలో పడ్డారు. అందువల్ల మనమంతా వీధుల్లోకి వచ్చాం. ప్రజల మనోభావాలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ఒకవేళ అర్థం చేసుకోకపోతే, ఈశాన్య ప్రాంతంలో జరిగే అవాంఛనీయ ఘటనలకు ప్రభుత్వమే బాధ్యతవహించాలి" అని మాజీ ముఖ్యమంత్రి ప్రఫుల్ల కుమార్ మహంతా అన్నారు. నిరాహారదీక్షల్లో ఆయన కూడా పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో మంగళవారం జరిగిన సభలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ, ఈ బిల్లు కనుక ఆమోదం పొందితే బెంగాలీ హిందూ శరణార్థులు అంతా కూడా పౌరసత్వం పొందుతారని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, 'ప్రభుత్వ ఆమోదం లేకుండా' ఆ విధమైన వ్యాఖ్యలు చేయరు అని ఏజీపీ సీనియర్ నాయకుడు అన్నారు. "ఈ విధంగానే జరిగితే, అప్పుడు బిల్లును పూర్తిగా రద్దుచేసుకునే వరకు మేము ఆందోళన కొనసాగిస్తాం. ఈ బిల్లును తీసుకువచ్చినప్పటి నుంచి మేము వ్యతిరేకిస్తూనే ఉన్నాం" అని మహంతా చెప్పారు. బహిరంగ సభలో మాట్లాడుతూ, ఈ బిల్లుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకు జర్నలిస్టు మంజిత్ మహంతాతో పాటు దేశద్రోహం కేసునెదుర్కొంటున్న ప్రముఖ మేధావి హిరెన్ గొహెయిన్, ఆర్టీఐ కార్యకర్త అఖిల్ గొగోయ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి ఏజీపీ సమ్మెకు మద్దతు తెలిపారు. పాలక బీజేపీతో పొత్తును ఏజీపీ తెగతెంపులు చేసుకోవడం అసోం ప్రజలకు శుభవార్తని, కమ్యూనిటీని కాపాడేందుకు ఇప్పుడు ఎమ్మెల్యేలందరూ కలిసి రావడం శుభసూచకమని గొహెయిన్ అన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, సబ్‌డివిజన్ కేంద్రాలలో ఐదు గంటల బైఠాయింపు ఆందోళన నిర్వహించింది. గువహటిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రిపెన్ బోరా మాట్లాడుతూ, "ఈ బిల్లును మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మా వ్యూహం కారణంగా బిల్లును గత సమావేశాలలో ప్రవేశపెట్టలేదు. దానితో మనకు తాత్కాలికంగా ఉపశమనం కలిగింది" అన్నారు.

## విజ్ఞానం

### జింక్ లోపంతో రక్తపోటు...!




జింక్ లోపంతో రక్తపోటు పెరిగే అవకాశం ఉంది. సాధారణస్థాయిలో ఉండే జింక్ హైపర్‌టెన్షన్‌ని కలిగించే ఇమ్యూన్‌సిస్టమ్ లోని బాక్టీరియా, వైరస్‌తో పోరాడి శరీరంలోని పోషకాలను పెంచుతున్నట్లు అమెరికా లోని రైట్ స్టేట్ యూనివర్సిటీ అధ్యయన కారులు వెల్లడించారు. దీనితోపాటు సోడియం క్లోరైడ్ కోట్రాన్స్ పోర్టర్(ఎన్‌సిసి) విధానాన్ని అంటే కిడ్నీల పనివిధానాన్ని యూరిన్‌ద్వారా సోడియం విసర్జన, మరల పీల్చుకునే విధానాన్ని పరిశీలించారు. తద్వారా అధికరక్తపోటుపై దీని ప్రభావాన్ని అధ్యయనం చేసారు. సాధారణంగా జింక్ లోపంతో టైప్ 2-డయాబెటిస్, కిడ్నీ వ్యాధులు తలెత్తవచ్చునని వివరించారు. సరైనస్థాయిలో ఉండే జింక్ శరీరంలోని ప్రోటీన్లను నియంత్రించడంతోపాటు సోడియ క్లోరైడ్ కోట్రాన్స్‌పోర్టర్‌ను నియంత్రిస్తుందని తెలుస్తోంది. దీనికోసం అధ్యయనకారులు జింక్ లోపం ఉన్న పురుష ఎలుకలపై ప్రయోగం చేసారు. జింక్‌లోపం ఉన్న ఎలుకలు అధిక రక్తపోటు ఉన్నట్లు తెలుస్తోంది. జింక్ అధికంగా ఉన్న ఆహారాన్ని ఇచ్చి చూడగా, అధికంగాఉన్న రక్తపోటు తగ్గగా, యూరిన్‌లో సోడియం శాతం పెరిగినట్లు గుర్తించారు.

### అధిక విలువ లావాదేవీల దాఖలుకు

# మరో అవకాశం

**ముంబై:** అధిక విలువ కలిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పన్ను రిటర్నులను 2018-19 అసెస్‌మెంట్ ఇయర్‌లో దాఖలు చేయని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ ప్రకటన చేసింది. సదరు లావాదేవీకి సంబంధించిన వివరాలతో ఆదాయపు పన్ను శాఖ నుంచి ఈమెయిల్ గానీ.. ఎస్ఎంఎస్ గానీ అందిన 21 రోజుల్లోగా రిటర్నులను గానీ వాటికి సమాధానాన్ని గానీ ఫైల్ చేయాల్సి ఉంటుందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. రిటర్నులు దాఖలు చేయకపోవడానికి సంబంధించి వర్తమానం అందిన తరువాత కూడా ఐటీఆర్ దాఖలు పరచని నేపథ్యంలో సదరు వ్యక్తిపై ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీబీడీటీ వివరించింది. 2017-18 మధ్య కాలానికి సంబంధించి దేశంలో పలువురు అధిక విలువ కలిగిన లావాదేవీలు జరిపిన సమాచారం తమ వద్ద ఉందని. వారు ఇంత వరకు పన్ను రిటర్నులు దాఖలు చేయలేదని సీబీడీటీ వెల్లడించింది. వీటికి సంబంధించి సంబంధితులకు సమాచారం అందిస్తున్నామని వారు.. వర్తమానం అందిన మూడు వారాల లోపు (21 రోజుల లోపు) వారు తగిన ఆధారాలతో సంతృప్తికరమైన వివరణనిస్తే ఎలాంటి చర్యలుండవని తెలిపింది. లేదంటే ఆయా లావాదేవీకి సంబంధించిన పన్ను బకాయిలు చెల్లించేందుకు వీలు కల్పిస్తున్నట్టుగా సీబీడీటీ వెల్లడించింది. అధిక విలువైన లావాదేవీకి సంబంధించిన సమాచారాన్ని ఐటీ శాఖ ఆర్థిక లావాదేవీల నివేదిక (ఎస్ఎఫ్‌టీ), మూలం వద్ద పన్ను తగ్గించుకోవడం (టీడీఎస్), మూలం వద్ద పన్ను వసూళు (టీసీఎస్), విదేశాల నుంచి నిధుల రాక, ఎగుమతులు మరియు దిగుమతులు ద్వారా సమీకరించి నట్టుగా సమాచారం. ఇలాంటి లావాదేవీలకు సంబంధిత వివరణలు గానీ, ఐటీ రిటర్నులు దాఖలు చేసేందుకు గాను ఎవ్వరూ ఐటీ శాఖ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని... https://incometaxindia efiling.gov.in ద్వారా వివరాలను సమర్పించవచ్చని సీబీడీటీ తెలిపింది.

# చందాకొచ్చర్‌పై సీబీఐ ఎఫ్ఐఆర్



### ఐసీఐసీఐ- వీడియోకాన్ కేసులో దూకుడు

**న్యూఢిల్లీ :** రుణాల మంజూరులో మోసం, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ, ఎండీ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌పై గురువారం సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాల జారీలో చందా కొచ్చర్, ఆమె కుటుంబ సభ్యులు క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారనే అభియోగాలున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణం కేసులో రూ.3250 కోట్ల మేర అక్రమాలు సాగాయని ఆరోపణలున్నాయి. 2012లో ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వీడియోకాన్ గ్రూప్‌నకు రూ.3250 కోట్ల రుణం మంజూరైన కొద్దినెలలకే ఆ కంపెనీ అధినేత వేణుగోపాల్ ధూత్ చందాకొచ్చర్ భర్తకు చెందిన న్యూపవర్ సంస్థలో కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టినట్టు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. గతంలో సెబీ చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ వీడియోకాన్ గ్రూప్‌తో పలుమార్లు వ్యాపార సంప్రదింపులు జరిపినట్టు వెల్లడైంది. దీపక్, వేణుగోపాల్ ధూత్ న్యూపవర్ సహవ్యవస్థాపకులు. ఐసీఐసీఐ బ్యాంక్-వీడియోకాన్ రుణం కేసుకు సంబంధించి దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. కేసు నమోదు అనంతరం దర్యాప్తులో భాగంగా ముంబై, ఔరంగాబాద్‌లోని వీడియోకాన్ కార్యాలయాలు, ఔరంగాబాద్‌లోని న్యూపవర్, ముంబై నారిమన్ పాయింట్‌లోని సుప్రీం ఎనర్జీ కార్యాలయం సహా పలుచోట్ల సీబీఐ దాడులు చేసింది. ఈ కేసులో ఇరు పార్టీల మధ్య క్విడ్‌ప్రోకోకు సంబంధించిన కీలక ఆధారాలు రాబట్టేందుకు సీబీఐ ప్రయత్నిస్తోంది. ఐసీఐసీఐ బ్యాంక్‌ను మోసగించి ఓ ప్రైవేటు కంపెనీలకు చందా కొచ్చర్ పెద్దమొత్తంలో రుణాలు మంజూరు చేసినట్టు సీబీఐ ప్రతినిధి పేర్కొన్నారు. ఇది నేరపూరిత కుట్ర అని తెలిపారు. చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్ సహా నూపవర్ రెన్యువబుల్స్, సుప్రీం ఎనర్జీ, వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేర్లను కూడా నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

## గ్రామీణ లబ్ధిదారులకు పిరామల్ స్వాస్త్ సేవలు

**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :** ఉద్యోగులు సమ్మె చేస్తున్న కాలంలోనూ నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌గా పనిచేస్తున్న పిరామల్ స్వాస్త్ గ్రామీణ లబ్ధిదారులకు 90 శాతం సేవలను నిరాటంకంగా కొనసాగించింది. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాల సంక్షేమ పథకాల్లో భాగంగా అందుతున్న వైద్య సేవలను పిరామల్ స్వాస్త్ అందిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో రెండేళ్లనాడు చంద్రన్న సంచార చికిత్స ప్రారంభించిన సంస్థ ఇప్పటి వరకూ 292 సంచార వాహనాల ద్వారా 13,523 గ్రామాల్లో పర్యటించిందని సంస్థ పేర్కొంది. ఈ కార్యక్రమంలో పనిచేస్తున్న కొంతమంది ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా సమ్మెకు దిగారని, అత్యవసర సేవల చట్టం ప్రకారం, ఉద్యోగులు సమ్మె చేయడం చట్టవిరుద్ధమని తెలిపింది. తాము ప్రస్తుతం అద్దె వాహనాలు, తాత్కాలిక సిబ్బందితో వైద్య సేవలు కొనసాగిస్తున్నట్లు నేడొక ప్రకటనలో పేర్కొంది.

## మే 21న కోమెడ్ కె, యూనిగేజ్ ఎగ్జామ్




**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:** ఇంజనీరింగ్ బీఈ, బీటెక్ కోర్సులకు సంబంధించి కోమెడ్ కె యుగెట్, యూనిగేజ్ ఎంట్రన్స్ పరీక్ష మే 12వ తేదీన జరగనుంది. కోమెడ్ కె, యూనిగేజ్ స్కోర్స్ 180కి పైగా విద్యాసంస్థలు, 21 యూనివర్సిటీల ఆమోదం పొందడంతో జేఈఈ తరువాత దేశంలో రెండో అతిపెద్ద మల్టీ యూనివర్సిటీ ప్రైవేటు ఇంజనీరింగ్ ఎగ్జామ్‌గా నిలిచిందని కోమెడ్‌కె స్టేట్స్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డా.కుమార్, ఎరా ఫౌండేషన్ సీఈఓ పి.మురళీధర్‌రావు తెలిపారు. గురువారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 142 నగరాల్లోని 350 కేంద్రాల్లో జరగనున్న ఎంట్రన్స్ పరీక్షకు 1.25 లక్షల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 18, తెలంగాణలో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. విద్యార్థులు 21 ప్రైవేటు వర్సిటీలు, 200 కాలేజీల్లో 40 వేల ఇంజనీరింగ్ సీట్లు పొందేందుకు వీలుంటుందన్నారు. ఏఐసీటీఈ ఆమోదించిన 10+2/పీయూసీ/ తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు ఈ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాసేందుకు అర్హులని, అభ్యర్థులు ఏప్రిల్ 19లోగా www.unigauge.com వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ఎస్‌బ్యాంక్‌కు కొత్త సీఈవో..ఎగసిన షేరు



**న్యూఢిల్లీ:** ప్రయివేటు రంగ ఎస్ బ్యాంక్ నూతన ఎండీ, సీఈవోగా రన్వీత్ గిల్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో రాణా కపూర్ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. దీంతో కొత్త సీఈవోగా రన్వీత్ బాధ్యతలు చేపట్టనున్నట్లు యస్ బ్యాంక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. రన్వీత్ నియామకాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఆమోదించినట్లు బ్యాంకు ఆ ప్రకటనలో పేర్కొంది. 2019 మార్చి 1లోగా రన్వీత్ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం రన్వీత్ డుచె బ్యాంక్ ఇండియా సీఈవోగా పనిచేస్తున్నారు. యస్ బ్యాంక్ సీఈవో వ్యవహారం ఇటీవల వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. బ్యాంకు సీఈవోగా ఉన్న రాణా కపూర్ పదవీకాలం గతేడాది ఆగస్టు 31తో ముగిసింది. అయితే సీఈవోగా రాణాను పునర్నియమిస్తూ బ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది. మరో మూడేళ్ల పాటు రాణా ఈ పదవిలో కొనసాగుతారని గతంలో ప్రకటించింది. అయితే యస్ బ్యాంక్ ఆర్‌బీఐ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు రావడంతో మరోసారి రాణాను ఎండీ, సీఈవోగా కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ నిరాకరించింది. వచ్చే ఏడాది జనవరి చివరి వరకు మాత్రమే ఆయన సీఎండీగా కొనసాగుతారని, ఆ లోగా కొత్త సీఈవో, ఎండీని ఎంపికచేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ నేపథ్యంలో రన్వీత్‌ను నియమిస్తూ యస్‌బ్యాంక్ నేడు ప్రకటన విడుదల చేసింది. కాగా.. రన్వీత్ నియామకం నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బ్యాంకు షేర్లు అనూహ్యంగా పెరిగాయి. ఒక దశలో షేరు ధర 20శాతం వరకు పెరిగింది. ప్రస్తుతం ఎన్ఎస్‌ఈలో బ్యాంకు షేరు ధర 14.32శాతం పెరిగి రూ. 225.50 వద్ద కొనసాగుతోంది.

# ఓటరు జాబితాపై విశ్వాసమేది?

### ఈసీకి చాడ లేఖ

**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:** ఓటరు జాబితాపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25వ తేదీన 'అర్హులైన ఒక్క ఓటర్ పేరునూ జాబితాలో లేకుండా చేయొద్దనే' అంశంపై కార్యక్రమం నిర్వహించడం సంతోషమని తెలిపారు. రాష్ట్రంలో విభిన్న పరిణామాలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఓటరుగా నమోదుకు స్పష్టమైన విధానాలు లేకపోవడం, ఓటర్ జాబితాలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్లు కోకొల్లలుగా ఉదాహరణలను ఎన్నికల కమిషన్ దృష్టికి రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తీసుకువెళ్లాయని, అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. చాడ వెంకటరెడ్డి ఎన్నికల సంఘానికి గురువారం లేఖ రాశారు. తెలంగాణ శాసనసభ ముందస్తు ఎన్నికల సందర్భంగా 22 లక్షల నుంచి 30 లక్షల వరకు ఓట్లు గల్లంతైనట్లు తేలిందని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉండటం, చనిపోయిన వారి పేర్లు జాబితాలో కొనసాగడం వంటి అంశాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి సమగ్ర పద్ధతులలో సవరణలు చేయలేదని చాడ విమర్శించారు. ఓటర్‌లిస్టే తప్పుల తడకగా ఉంటే ఎన్నికలు ఎలా సజావుగా జరుగుతాయని, అర్హత కలిగిన పౌరుల పేర్లు ఓటర్ లిస్టులో లేకపోతే వ్యక్తి ప్రాథమిక హక్కును హరించినట్లే అన్నారు. జరిగిన తప్పులకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కేవలం 'సారీ'తో సరిపుచ్చడం సమంజసమేనా? ఈ ఓటర్ లిస్టు తప్పుల తడకకు ఎవరు బాధ్యులు? వారిపై కఠిన చర్యలు లేకపోతే ప్రజలకు విశ్వాసం ఉంటుందా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ తమ తప్పులను సవరించుకోకుండా రాజకీయ పార్టీలపైనే ఎదురుదాడికి దిగడం దారుణమన్నారు. ఎన్నికల కమిషన్ ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లుగా లేఖ ద్వారా సమాచారం అందిందని, అయితే కమిషన్ ఏకపక్ష, అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా ఓటర్ దినోత్సవంలో పాల్గొనడానికి సీపీఐ నిరాకరిస్తుందని చాడ తెలిపారు.

## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా రమణికుమారి




**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :** మహిళా కాంగ్రెస్ ఏపీ రాష్ట్ర నూతన అధ్యక్షురాలిగా పేడాడ రమణికుమారిని అధిష్టానం నియమించింది. ఈ మేరకు గురువారం ఆంధ్రరత్నభవన్‌లో పీసీసీ చీఫ్ డాక్టర్ రఘువీరారెడ్డిని రమణి కుమారి మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనం తరం ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారితకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో మహిళా సాధికారయాత్ర చేపట్టను న్నామని, త్వరలో జిల్లా, మండల కమిటీలు నియమిస్తామని చెప్పా రు. బీజేపీ ప్రభుత్వ హయాంలో నోట్ల రద్దు కారణంగా అధికంగా మహిళలే అసౌకర్యానికి గురయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. మహిళలు తలచుకుంటే రాహుల్ ప్రధాని కావడం తథ్యమని స్పష్టం చేశారు. తన ఎంపికకు సహకరించిన మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సుస్మితాదేవ్, కాంగ్రెస్‌నేత సుబ్బిరామిరెడ్డి, మెహరా భాస్కరరావులకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకూ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కృష్ణాజిల్లాకు చెందిన సుంకర పద్మశ్రీ కొనసాగారు.

## ఆధార్ భద్రత కోసం 'ఏబీ' సేవలు

**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:** డిజిటల్ ఐడెంటిటీ, బయోమెట్రిక్ సాంకేతికతతో సేవలందిస్తున్న స్వీడన్ సంస్థ ఐడెంటిటీ డివిసెస్ స్వీడన్ ఏబీ, సరికొత్త బయోమెట్రిక్ ప్రైవసీ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. (బయోమెట్రిక్ ప్రైవసీ ప్లాట్‌ఫామ్) బీపీపీని ప్రారంభించిన సంస్థ డేటా సెక్యూరిటీ, ప్రైవసీ, కన్సెంట్, నమ్మకం తదితరాల్లో ప్రపంచంలోని అతిపెద్ద బయోమెట్రిక్ డిజిటల్ ఐడెంటిటీ కార్యక్రమంగా నిలిచిందని సంస్థ సీఈఓ డేవిడ్ బుర్నెట్ తెలిపారు. 90 కోట్ల మంది వివరాలు సేకరించిన ఆధార్ సమాచార భద్రతకు సహకరించనుందన్నారు. వ్యక్తిగత సమాచార భద్రత అత్యంత ప్రాధాన్యమైన అంశమని వెల్లడించారు. సమాచార వాడకం, పంచుకోవడం తదితరాంశాల్లో సేవలందిస్తామన్నారు.


## దారి కనుక్కోండి




# సాంబయ్య జట్టు



గంగవరం గ్రామంలో సాంబయ్య ఉండేవాడు. గ్రామంలో అందరికీ పొలం ఉండడంవలన పంటలు పండిస్తూ జీవించేవారు. కానీ సాంబయ్య కుటింబీకులు కూలిపనులు చేస్తూ జీవించేవారు. సాంబయ్య కూడా కూలీ పనులకు వెళ్లేవాడు. కూలీపనులకు రోజు వెళ్లడంవలన గ్రామస్థులకు సాంబయ్య కుటుంబం చులకన అయింది. ఏం కూలీ పనులకు వస్తారా అంటూ హేళన చెయ్యసాగారు. సాంబయ్య దగ్గర డబ్బువుంది. కానీ పొలం కొనాలంటే అమ్మేవారులేరు. ఏదైనా పనిచేసి మంచిగా బతకాలనుకున్నాడు సాంబయ్య.



చిన్నప్పటినుంచి సాంబయ్యకు పట్టుదల ఎక్కువ. ఎలాంటి పనిలోనైనా నైపుణ్యంతో పూర్తి చేసేవాడు. కూలీ కూలీ అని పిలిచే గ్రామస్థులలో మార్పుతేవాలని నిర్ణయించుకున్నాడు. తనకు తెలిసిన మిత్రులను, బంధువులలో ఆర్థికంగా లేనివారికి తన ఇంటిలో నివాసం కల్పించాడు సాంబయ్య. దాదాపు పాతికమంది వరకు ప్రోగు అయ్యారు. ఎక్కడికి వెళ్లినా పాతికమంది ఒకేసారి కూలీపనికి వెళ్లి గబగబా పనిచేసి తిరిగి వచ్చేవారు. సాంబయ్య చెప్పినట్లుగా వారు నడుచుకునేవారు. సాంబయ్య జట్టు మేము అని చెప్పేవారు.

గ్రామంలో ఎవరికి కూలిపని అవసరంవున్నా సాంబయ్య జట్టు వెళ్లి పనిచేసేవారు. వాతావరణంలో మార్పుల దృష్ట్యా పంటకోత త్వరగా కోయవలసిన సందర్భంలో సాంబయ్య జట్టును కూలీపనులకు పిలిచి, సాంబయ్య చెప్పిన ధరకు గుత్తకు ఇచ్చేవారు. ఇంతకుముందు కూలిపనిచేసే సాంబయ్య, ఇప్పుడు గుత్తేదారు అయ్యాడు. తాను ఇంటివద్దనే ఉంటూ కూలిపనులు తెస్తూ అందరినీ తలోవైపు పంపిస్తూ డబ్బులు తలా ఇన్ని పంచేవాడు.

ఒకప్పుడు కూలి సాంబయ్య అనే గ్రామస్థులు, ఇప్పుడు సాంబయ్య జట్టు అంటూ పిలుస్తూ, మర్యాద ఇచ్చేవారు. లేదంటే పాతికమంది కూలీలు పనికిరాకుంటే పంట ఆగమౌతుందని మారిపోయారు. గ్రామంలో పనిలేనప్పుడు సాంబయ్య, పొరుగు గ్రామాల్లో కూడా పనులు తెచ్చి జట్టును పంపేవాడు. తన జట్టులో ఇంకా చాలామందిని చేర్చుకుని, వారికి తగిన కూలీలు అందిస్తూ వారికి ఆసరాగా ఉంటూ సాంబయ్య జట్టుగా పేరుపొందాడు. కూలీపనులతో వినూత్నంగా ముందుకువెళుతూ, కూలిపనుల వారికి గౌరవం లభించేలా కృషిచేస్తూ సాంబయ్య అందరికి ఆదర్శంగా నిలువసాగాడు.

ఉండ్రాళ్ల రాజేశం
9966946084

# పెద్ద పులి




పులి పేరులోనే ముందర ఉన్న పెద్ద అన్న పదంలాగానే, పులి ఆకారానికి పెద్దదిగానే ఉంటుంది. పెద్దపులి చూడటానికి అందంగానే ఉన్నప్పటికీ, అది క్రూరమయిన జంతువు. దట్టమైన అడవిలో నివసిస్తుంది. ఇది ఠీవిగా, దర్పంగా నడుస్తుంది. పసుపుపచ్చ రంగుతో, చర్మం మీద నల్లని చారలతో అందంగా కన్పిస్తుంది. పులి తోక పొడుగ్గానూ, ధృడంగానూ ఉంటుంది. పులి కళ్లు మెరుస్తూండటంతో, వేటగాళ్ళు పులి జాడను ఇట్టే పసి కట్టేస్తారు.

పులి సాధారణంగా 3 నుంచి 4 మీటర్ల పొడవు ఉంటుంది. పులితోక 55 నుంచి 95 సెంటీ మీటర్ల పొడవు ఉంటుంది. ఆడపులి ఒక కాన్పులో రెండు నుంచి ఐదు ఆరు పిల్లలను ప్రసవిస్తుంది. తల్లి పులే పిల్లల రక్షణ భారాన్ని తీసుకుని పిల్లలకు ఏ ప్రమాదం రాకుండా కాపాడుతుంది. పిల్లలకు ఆహారాన్ని తల్లే తెచ్చిపెడుతుంది. తల్లే పిల్లలకు వేటాడడం, ఆహారాన్ని సంపాదించుకోవడం నేర్పుతుంది. వేటకాని బారిన పడకుండా తప్పించుకోవడమూ నేర్పుతుంది. కూనలను పెంచి పెద్ద చేయడంలో తల్లి పాత్రే ఎక్కువ ఉంటుంది. పిల్లలు ఆహారం సంపాదించుకునే శక్తి వచ్చి, వేటాడే మెళకువలను తెలుసుకున్న తర్వాతనే, పిల్లలను యదేచ్ఛగా అడవిలో వదిలేస్తుంది. అంత వరకూ పులి పిల్లలు తల్లి వెంటే తిరుగుతుంటాయి.

పులి వేటాడేటప్పుడు ఏకాగ్రత పొంచి ఉండి, ఎంతమాత్రం అలికిడిని కానివ్వకుండా ఉంటూ జంతువుల మీద పడి సంహరిస్తుంది. తన వాడి గోళ్ళతో, పదునైన కోరలతో తాను వేటాడిన జంతువును చీల్చి వేస్తుంది. పులి ఎప్పుడూ తన స్థావరంలోనే ఉంటుంది. ఆకలి వేసినప్పుడు మాత్రమే బయటకు వచ్చి జంతువులను వేటాడి ఆకలి తీర్చుకుంటుంది. పెద్ద పులిని వేటాడి సంహరించి లాభాన్ని పొందుతారు వేటగాళ్ళు. బ్రతికినా, చచ్చినా పులికి ఎంతో విలువ ఉంది. పులి చర్మంతో పర్సులు, బ్యాగులు తయారు చేస్తారు. పులి చర్మాన్ని, తలను డ్రాయింగ్ రూమ్‌లో గోడల మీద వేలాడదీయడం వల్ల ఆ గది ఆకర్షణీయంగా, అందంగా ఉంటుంది. పులి దేహాన్ని కొన్ని మందుల తయారీలో ఉపయోగిస్తున్నారు. పులిగోరును గొలుసులో వేసుకుని ధరించడమన్నది దర్పానికీ, హుందాతనానికీ, వారి సిరిసంపదలకు ప్రతీకగా భావిస్తారు.

## రంగులు వేయండి







# రాజమౌళి అడిగారు.. వెంటనే ఒప్పుకొన్నాను

'ఆర్ ఆర్ ఆర్' చిత్రంలో కీలక పాత్ర చేస్తావా? అని దర్శకధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి అడగ్గానే వెంటనే ఒప్పుకొన్నానని అంటున్నారు ప్రముఖ తమిళ నటుడు, దర్శకుడు సముద్రఖని. ఎన్టీఆర్, రామ్‌చరణ్ ప్రధానపాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా రెండో భారీ షెడ్యూల్ ఇటీవల ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లోనే సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారట. ఈ విషయాన్ని ఆయన ఓ తమిళ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

'నేను దర్శకత్వం వహించిన 'నాడోడిగల్' సినిమా చూసి రాజమౌళి సర్ నాకు ఓ పెద్ద మెసేజ్ పెట్టారు. అప్పటినుంచి నేను రాజమౌళి సర్‌తో టచ్‌లో ఉన్నాను. ఇటీవల ఆయన నన్ను తన ఇంటికి ఆహ్వానించారు. తన కుటుంబీకుల్ని పరిచయం చేశారు. అప్పుడే నాకు 'ఆర్ ఆర్ ఆర్' సినిమా గురించి తెలిసింది. ఇందులో ఓ కీలక పాత్ర ఉంది చేస్తావా? అని అడిగారు. నేను క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే ఒప్పేసుకున్నాను. అయితే ముందు ఆయన స్క్రిప్ట్ చదవాలని చెప్పారు. సరేనన్నాను' అని వెల్లడించారు. ప్రస్తుతం చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో ముగ్గురు కథానాయికలకు ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది. సమంత, కీర్తి సురేశ్, ప్రియమణి, అదితిరావు హైదరి పేర్లు వినపడుతున్నాయి. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దాదాపు రూ.300 కోట్ల బడ్జెట్‌తో దానయ్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా శాటిలైట్ హక్కులు రికార్డు స్థాయిలో రూ.132 కోట్లకు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది.

# ఆయన పిలవగానే కాదనలేకపోయా



తనకు ఫిబ్రవరి 14 (ప్రేమికుల రోజు) అంటే చాలా ఇష్టమని అంటున్నారు స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్. మలయాళీ భామ ప్రియా ప్రకాశ్ వారియర్ కథానాయికగా నటించిన 'ఒరు అడార్ లవ్' చిత్రం తెలుగులో 'లవర్స్ డే' టైటిల్‌తో విడుదల కాబోతోంది. ఈ చిత్ర ఆడియో విడుదల వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకకు బన్నీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ మధ్యకాలంలో ప్రియా ప్రకాశ్ కన్నుకొట్టిన వీడియో చాలా వైరల్ అయింది. దేశవ్యాప్తంగా మన దక్షిణాది చిత్ర పరిశ్రమకు సంబంధించి వైరల్ అయిన విషయాల్లో 'కొలవెరి డీ' పాట, 'బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' అన్న ప్రశ్న ఉన్నాయి. ఆ తర్వాత అంతటి స్థాయిలో వైరల్ అయిన వీడియో మాత్రం ప్రియా ప్రకాశ్‌దే. ఈ వేడుకకు వచ్చాను కాబట్టి మనసులో ఉన్నమాట చెప్పేస్తాను. నాకు సౌతిండియా అంటే పిచ్చి. అది తెలుగు, తమిళం, మలయాళం ఏదైనా కావచ్చు. నా వృత్తిని సౌతిండియన్ యాక్టర్ అని చెప్పుకొంటాను. అందులో నాకు ఏ మొహమాటం లేదు. ఎందుకంటే నేను పుట్టింది చెన్నైలో.. పెరిగింది హైదరాబాద్‌లో.. నన్ను ఆదరిస్తోంది మలయాళం ఫ్యాన్స్. నేను ఈ వేడుకకు రావడానికి రెండు కారణాలున్నాయి'

'మొదటి కారణమేంటంటే.. నేను చేసిన ప్రతీ సినిమాను మలయాళం అభిమానులను ఎంతగానో ఆదరిస్తుంటారు. తెలుగు వారి భాష కాకపోయినా సొంత సినిమాకంటే ఎక్కువగా నా సినిమాలను ఆదరిస్తున్నారు. అలాంటిది అక్కడి సినిమా తెలుగులో విడుదల అవుతున్నప్పుడు నా వంతు నేను ప్రోత్సహించాలి కదా అని వచ్చాను. అక్కడి నుంచి ఇలాంటి మరెన్నో సినిమాలు రావాలి. రెండో కారణం ఏంటంటే.. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాను కొనుకున్న వారిలో వినోద్ ఒకరు. ఆయన నాకు అభిమాని. కానీ సినిమా ఫ్లాపైంది. ఆ తర్వాత కొన్ని గొడవలు కూడా జరిగాయి. అప్పుడు నాకో విషయం తెలిసింది. 'నా పేరు సూర్య..' సినిమా విడుదల కావడానికి ముందు వినోద్ ఎలా ఉండేవారో ఇప్పుడు కూడా అంతే అభిమానంతో ఉన్నారని. ఈ విషయం తెలిశాక వినోద్‌కు నా వంతు ఏదన్నా చేయాలని పించింది. అందుకే ఆయన నన్ను ఆడియో లాంచ్‌కు పిలవగానే కాదనలేకపోయాను. 'లవర్స్ డే' టైటిల్‌తో 'ఒరు అడార్ లవ్' తెలుగులో ఫిబ్రవరి 14న విడుదల కాబోతోంది. అది నాకు చాలా ఇష్టమైన రోజు. ఇప్పటికీ ఫిబ్రవరి 14ని నా బర్త్‌డేలాగే గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాను. ఈసారి నా భార్యకు ఎలా సర్‌ప్రైజ్ ఇవ్వాలా? అని ఆలోచిస్తుంటాను' అని వెల్లడించారు.

**కన్నుగీటిన బన్నీ..**

కన్నుగీటి దేశవ్యాప్తంగా పాపులారిటీ తెచ్చుకున్నారు ప్రియా ప్రకాశ్ వారియర్. ఇప్పుడు అదే కన్నుగీటే సన్నివేశాన్ని బన్నీ అనుకరించారు. ఆడియో లాంచ్ వేడుక పూర్తయ్యే సమయంలో బన్నీ స్టేజ్‌పై కన్నుగీటి గన్‌షాట్ పేల్చిన సన్నివేశాన్ని అనుకరించి చూపించారు. బన్నీ కన్నుకొడుతున్నప్పుడు తీసిన వీడియోను ఓ అభిమాని ట్విటర్‌లో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్ అవుతోంది.




## రవితేజ బర్త్‌డే రోజు అభిమానులకి డబుల్ గిఫ్ట్

రవితేజ వరుసగా రాజా ది గ్రేట్, టచ్ చేసి చూడు, నేల టిక్కెట్ చిత్రాలు చేశాడు. ఇందులో రాజా ది గ్రేట్ చిత్రం మాత్రమే మంచి హిట్ సాధించింది. ఇక రీసెంట్‌గా అమర్ అక్బర్ ఆంటోని చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాగా, ఈ మూవీ కూడా నిరాశపరచింది. దీంతో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం' చిత్రాల దర్శకుడు వీఐ ఆనంద్ దర్శకత్వంలో రానున్న సినిమాపై చాలా ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకున్నాడు. ఈ చిత్రాన్ని ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. ఈ మూవీకి 'డిస్కో రాజా' టైటిల్ పరిశీలిస్తున్నారట! చిత్రంలో ముగ్గురు కథానాయికలకు చోటుండగా 'నన్ను దోచుకుందువటే' ఫేమ్ నభా నటేశ్‌ను ఓ నాయికగా, 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్‌ను మరో నాయికగా ఎంపిక చేశారు. మూడో నాయికను త్వరలో ఎంపిక చేయనున్నారు.

# అది మన బాధ్యత : మహేశ్‌బాబు



ఆడపిల్లల పట్ల సామాజిక రుగ్మతను రూపుమాపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సినీనటుడు మహేశ్‌బాబు అన్నారు. ప్రతీఏడాది జనవరి 24వ తేదీని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. సమాజంలో బాలికలు, యువతులు ఎదుర్కొంటున్న అసమానతలను ప్రజలకు గుర్తుచేస్తూ.. వారికి సరికొత్త అవకాశాల కల్పనతో పాటు మరింత మద్దతును ప్రకటించేందుకు జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నటుడు మహేశ్‌బాబు ట్విట్టర్ ద్వారా తన స్పందనను తెలియజేశారు. బాలికలపట్ల సామాజిక అసమానతలను రూపుమాపేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యావకాశాలు కల్పించాలన్నారు. సాధికారత వైపు అడుగులేస్తూ వృద్ధి చెందేలా వికసించనీయాలన్నారు.

# 'నేను ఎవ్వరికీ క్షమాపణలు చెప్పను'



తాను ఎవ్వరికీ క్షమాపణ చెప్పనని అంటున్నారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సి'. క్రిష్ జాగర్లమూడి, కంగన సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపించారంటూ మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన సంఘాలు కొంతకాలంగా ఆందోళనలు చేపడుతున్నాయి. సినిమా విడుదలను ఆపకపోతే కంగన కెరీర్‌ను నాశనం చేస్తామంటూ కార్యకర్తలు బెదిరింపులకు దిగుతున్నారు.

వీటిపై గతంలో కంగన స్పందిస్తూ..'నేను ఎవ్వరికీ భయపడను. నేనూ రాజ్‌పుత్‌నే. సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఎ సర్టిఫికేట్ ఇచ్చినప్పటికీ బెదిరింపులకు పాల్పడితే కర్ణిసేన కార్యకర్తలను నాశనం చేస్తాను' అని హెచ్చరించారు. కంగన వ్యాఖ్యలు కాస్తా దుమారం రేపాయి. కర్ణిసేన సంఘాలను అవమానించిన కంగన వెంటనే క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించారు. దీనిపై తాజాగా కంగన మీడియాతో మాట్లాడుతూ.. 'నేను ఎవ్వరికీ క్షమాపణలు చెప్పను. జీవితంలో ఇప్పటివరకు నా తప్పులేకుండా మరొకరికి క్షమాపణలు చెప్పింది లేదు. సినిమాలో రాణి లక్ష్మీబాయి గురించి తప్పుగా చూపించలేదని ముందే మాటిచ్చాం. అన్నట్లుగానే అలాంటివేమీ చూపించడంలేదు. అలాంటప్పుడు కర్ణిసేన మాకు మద్దతుగా నిలవాలి. లక్ష్మీబాయి నా బంధువు కాదు. ఆమె భారతదేశ ముద్దుబిడ్డ.' అని చెప్పారు. శుక్రవారం 'మణికర్ణిక' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లో విడుదల కాబోతోంది.

# చిరుతో జోడి కట్టే భామ ఎవరు ?



తొమ్మిదేళ్ళ తర్వాత ఖైదీ నెం 150 చిత్రంతో రీఎంట్రీ ఇచ్చిన చిరంజీవి ప్రస్తుతం సైరా అనే చిత్రంతో బిజీగా ఉన్నాడు. పీరియాడికల్ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రం దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం తర్వాత చిరు .. కొరటాల శివ దర్శకత్వంలో సామాజిక నేపథ్యంతో సినిమా చేయనున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి స్క్రిప్ట్ వర్క్ పూర్తి కాగా, ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుపుతున్నట్టు సమాచారం. అయితే ఇందులో కథానాయికగా నలుగురు భామలని పరిశీలించిందట చిత్ర బృందం. విద్యా బాలన్, త్రిష, నయన తార, తమన్నాలలో ఒకరిని ఎంపిక చేస్తారని అంటున్నారు. నయనతార ప్రస్తుతం చిరుతో సైరా సినిమా చేస్తుండగా, త్రిష స్టాలిన్ అనే చిత్రంలో చిరుతో జోడి కట్టింది. ఇక తమన్నా కూడా సైరాలో నటిస్తుంది. ఈ నేపథ్యంలో కొత్త దనం కోసం విద్యాబాలన్‌నే సెలక్ట్ చేస్తారని అంటున్నారు. త్వరలోనే దీనిపై క్లారిటీ రానుంది.

## యూపీ మైనింగ్ కేసు : ఈడీకి పత్రాల సమర్పణ

### వ్యక్తిగతంగా హాజరుకాని ఐఏఎస్ చంద్రకళ

**లక్నో / న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో అక్రమ మైనింగ్ మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరుకాకుండా సంబంధిత పత్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఐఏఎస్ అధికారి బి.చంద్రకళ సమర్పించారు. ఈ క్రమంలో తన తరఫున న్యాయ ప్రతినిధిని కేంద్ర దర్యాప్తు సంస్థ లక్నో జోనల్ కార్యాలయానికి పంపి, వ్యక్తిగత కారణాల వల్ల ఈడీ ఎదుట హాజరుకాలేకపోయినట్లు తెలియజేశారు. ఈ కేసులో క్రిమినల్ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసిన ఈడీ గత వారంలో చంద్రకళతో పాటు ఎస్పీ ఎమ్మెల్సీ రమేశ్‌కుమార్ మిశ్రా సహా పలువురికి సమన్లు జారీ చేసింది. మిశ్రా 28న ఈడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ వ్యవహారంలో యూపీ మాజీ ముఖ్యమంత్రి, మైనింగ్ శాఖ మాజీ మంత్రి అఖిలేశ్ యాదవ్ పాత్రపై ఆరా తీస్తున్నట్టు సీబీఐ వెల్లడించింది. సీబీఐ ఈనెలారంభంలో 14 ప్రాంతాల్లో సోదారులు నిర్వహించి, చంద్రకళ, మిశ్రా, సంజయ్ దీక్షిత్‌తో సహా 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

## పొత్తులకు సిద్ధమే.. షరతులు వర్తిస్తాయి : ఏఐఏడీఎంకే



**చెన్నై :** కూటమి ఏర్పాటుకు సిద్ధమేగానీ కొన్ని షరతులు వర్తిస్తాయని తమిళనాట పాలకపక్షం, ఏఐఏడీఎంకే పార్టీ గురువారం స్పష్టంచేసింది. పలు మార్గదర్శకాల ఆధారంగానే తమ భాగస్వాములను ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నట్టు వెల్లడించింది. ఏఐఏడీఎంకే సీనియర్ నేత, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డి.జయకుమార్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ 'పార్టీలోని భాగస్వాములతో చర్చించి, ఏకాభిప్రాయం కుదిరితే కూటమి ఏర్పాటుపై నిర్ణయిస్తాం' అని అన్నారు. పొత్తులను స్వాగతిస్తున్నామన్న ఆయన తమతో పొత్తు కోసం ఏ పార్టీ అయినా రావచ్చునని తెలిపారు. పలు మార్గదర్శకాల ఆధారంగా భాగస్వాముల ఎంపిక జరుగుతుందని వెల్లడించారు. తమతో చేతులు కలిపేందుకు వచ్చిన పార్టీ నేపథ్యం, ర్యాంకు, తమిళప్రజల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు, రాష్ట్ర హక్కుల పరిరక్షణలో ప్రభుత్వంతో కలిసే మనస్తత్వం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

## ఈవీఎంలపై సమావేశం

### ఈసీని కోరిన సీపీఐ

**న్యూఢిల్లీ :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) హ్యాకింగ్ సాధ్యమన్న వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించాలని, వాటి విశ్వసనీయతను పెంచే చర్యలను చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండు చేసింది. వీటిపై ఉన్న అనుమానాలను నివృత్తిచేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, సంబంధితులతో ఎన్నికల కమిషన్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికలలో దాదాపు డజనుకుపైగా నియోజకవర్గాలలో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం ఉందని ఆ ప్రకటన పేర్కొన్నది. ఈ విధమైన ఘటనలు ఈవీఎంల విశ్వసనీయతపై ప్రజలలో అనుమాలను మరింత పెంచుతున్నాయని తెలిపింది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చునంటూ వాటి విశ్వసనీయతను ప్రశ్నించిన వారిపై కేసులు పెడతామని ఎన్నికల కమిషన్ బెదిరించడం విచారకరమని పేర్కొంది.

# కమలం.. కలవరం




**న్యూఢిల్లీ :** ప్రియాంకగాంధీ ప్రత్యక్ష రాజకీయ రంగ ప్రవేశంతో బీజేపీలో కలవరం మొదలైంది. అందుకే ప్రియాంక రాజకీయ ప్రవేశంపై బీజేపీ నాయకులు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేశారు. కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలు, రాహుల్ వైఫల్యాల గురించి ఆరోపణలు చేశారు. స్వయాన ప్రధానమంత్రి నరేంద్ర మోడీయే ప్రియాంక రాకపై స్పందించారంటే ఆ పార్టీలో ఎంతోకొంత భయం ఉన్నదన్న సంకేతాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ కుటుంబ పార్టీ...బీజేపీ ప్రజల పార్టీ అంటూ మోడీ వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే...ప్రియాంక రాక భారతదేశ రాజకీయ చరిత్రలో కీలక మలుపు కానుందా? ఇది చెప్పడం కష్టమేమోగానీ..ఈ ఏడాది జరిగే పార్లమెంటు ఎన్నికలు రసవత్తరంగా మారడం మాత్రం ఖాయం. ఈ ఎన్నికలు కచ్చితంగా కీలక మలుపే. ఇప్పటి దాకా ప్రియాంక కాంగ్రెస్‌లో కేవలం అతిథి పాత్ర పోషించారు. ఇప్పుడు ఆమె కీలక పాత్ర పోషించబోతున్నారు. తన సోదరుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కలిసి మల్టీస్టారర్‌గా వ్యవహరించబోతున్నారు. ఇప్పుడు ప్రియాంకకు ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత బాధ్యతలు అప్పగించారు. రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పుడు వారికి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవులు ఇచ్చారు. అదేమాదిరిగా ఇప్పుడు ప్రియాంకకు కూడా అదే పదవి కట్టబెట్టారు. అయితే, ఆమె కేవలం ఒక్క ప్రాంతానికో..రాష్ట్రానికో పరిమితమవుతుందనుకుంటే పొరపాటే. ఆమెకు దేశవ్యాప్తంగా గొప్ప ప్రజాదరణ ఉంది. దేశంపై ఆమె ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. నమ్మలేని నిజమేమంటే..దేశవ్యాప్తంగా ప్రచారానికి రావాల్సిందిగా ప్రియాంకపై ఒత్తిడి పెరగడం ఖాయం. రాజీవ్ హత్య తరువాత నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యురాలిగా సోనియాకు కాంగ్రెస్ పగ్గాలు అప్పగించాలని ప్రయత్నించారు. కానీ ఆమె సున్నితంగా తిరస్కరించారు. ఆ తర్వాత పీవీ నరసింహారావు ప్రధానమంత్రి పదవి చేపట్టారు. పీవీని గద్దె దించే అవకాశం కోసం అర్జున్‌సింగ్ ఎదురుచూశారు. ఆ సమయంలో అర్జున్‌సింగ్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. నెహ్రూ-గాంధీ కుటుంబంలో ప్రియాంక మంచి చరిష్మా గల నేత అవుతారు. రాహుల్ జెంటిల్ మేన్.. అందులో అనుమానం లేదు. అయితే తన నాయనమ్మ ఇందిరాగాంధీలా ప్రియాంక భారత రాజకీయాల్లో చక్రం తిప్పుతారని అర్జున్‌సింగ్ చెప్పుకొచ్చారు. నాడు అర్జున్ సింగ్ వ్యాఖ్యలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. నెహ్రూ-గాంధీ కుటుంబానికి అర్జున్‌సింగ్ అత్యంత సన్నిహితుడు. ఆయన అభిప్రాయాలను పట్టించుకోకుండా ఉండటం కష్టమే. నాడు సోనియా తనకు తాను రాజకీయాలకు దూరంగా ఉండటమే కాకుండా రాహుల్, ప్రియాంకలను సైతం అటువైపు పంపడానికి సుముఖత ప్రదర్శించలేదు. ఇక 2014 నాటి ఎన్నికల విషయానికి వస్తే 124 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అంటూ నరేంద్రమోడీ హేళనగా మాట్లాడారు. దీనిపై ప్రియాంక స్పందిస్తూ 'నేను చూడటానికి వృద్ధురాలిలా ఉన్నానా?' అని మీడియాను ఎదురు ప్రశ్నించారు. ప్రియాంక తన కూతురు వంటిదని మోడీ చేసిన వ్యాఖ్యకు ప్రియాంక సైతం సున్నితంగానే స్పందించారు. 'నాకు తండ్రిగా ఉండాలని ఎవరూ ప్రయత్నించవద్దు. ఐ లవ్ మై ఫాదర్' అని ప్రియాంక సమాధానమిచ్చారు. ఈ రెండు ఘటనలు ప్రియాంక మానసికస్థితిని వెల్లడిస్తున్నాయి. ఇందిరాగాంధీ తరహాలోనే దృఢమైన అభిప్రాయాలు ప్రియాంక సొంతం. అయితే, సినిమాలో అతిథి పాత్రకు, ప్రధాన పాత్రకు చాలా తేడా ఉంది. ఇక నుంచి ప్రియాంక కీలక పాత్ర పోషించడానికి సిద్ధపడ్డారు. ఇందులో ప్రియాంక తనను తాను కచ్చితంగా నిరూపించుకోగలదు. అస్థిత్వ సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కాంగ్రెస్‌కు ప్రియాంక రాక మరింత బలాన్ని చేకూరుస్తుందనడంలో సందేహం లేదు. మోడీ ఆత్మరక్షణలో పడ్డారు. ఆయన ప్రజాదరణ గణనీయంగా తగ్గుతోంది. రాహుల్‌ను ఇక పప్పుగా పిలవడం సాధ్యం కాకపోవచ్చు.

ప్రియాంక, రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఆస్తి అని చెప్పడానికి నాలుగు ప్రధాన కారణాలున్నాయి. అందులో ఒకటి..ప్రియాంకకు గల చరిష్మాను ఎవరూ నిరాకరించరానిది. ఆమె పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో అత్యంత విశ్వాసం, విధేయతలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఆమె పెద్ద ఆకర్షణ. ఆమె ఉంటేనే కాంగ్రెస్‌కు ఓట్ల వరద పారడానికి అవకాశం ఉంది. రాహుల్‌కు అంత ఆకర్షణ లేదు. రెండోది...రాహుల్‌కు అతి నమ్మకమైన సోదరి ప్రియాంక. రాహుల్‌కు గొప్ప న్యాయవాది. రాహుల్‌కు నిజాయతీ గల సలహాలు, సూచనలు ఇస్తారు. రాహుల్‌కు తప్పొప్పుల గురించి చెప్పే సాహసం ప్రియాంకకు మాత్రమే ఉంది. ఇక మూడోది..సోనియా ఆరోగ్యం సహకరించడం లేదు. ఇంతకుముందులా ఆమె ప్రయాణాలు చేయలేరు. ఇప్పుడు రాహుల్, ప్రియాంక ప్రచార బాధ్యతలను పంచుకుంటారు. అన్ని ప్రాంతాల్లో తాను ప్రచారం చేయలేకపోయాననే ఆందోళన రాహుల్‌కు ఎంతమాత్రం ఉండదు. సమయాభావం వల్ల రాహుల్ వెళ్లలేని ప్రాంతాలు, నియోజకవర్గాలకు ప్రియాంక వెళతారు. భారతదేశంలో అత్యధిక భాగం ఇప్పటికీ గ్రామీణ సమాజమే. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరాగాంధీకి ఇప్పటికీ చెప్పలేనంత ప్రజాదరణ ఉంది. గ్రామీణంలో ఆమెను ప్రేమగా ఇందిరమ్మ అని పిలుచుకుంటారు. మహిళల్లో ఆమెకు ప్రత్యేక అభిమానం ఉంటుంది. ఉత్తరప్రదేశ్, ఇతర ప్రాంతాల్లో ఇందిరా మాదిరిగా ఉన్న ప్రియాంక ఫొటోలతో ఇప్పటికే పోస్టర్లు వెలిశాయి. నాలుగోది.. 2014లో బీజేపీకి అత్యంత కీలకంగా మారిన యూపీ తూర్పు ప్రాంతం బాధ్యతలను ప్రియాంకకు అప్పగించారు. ఆ ప్రాంతంలో అగ్రకులాల ఆధిపత్యం ఎక్కువ. మండల్, అయోధ్య రాజకీయాలకు ముందు ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోట. ఈ ప్రాంత అగ్రకులాలు సరైన రాజకీయ వేదిక కోసం ఎదురుచూస్తున్న సమయంలో 2014లో వారికి బీజేపీ కనిపించింది. సీఎస్‌డీఎస్ సర్వే ప్రకారం 2014లో 72శాతం బ్రాహ్మణులు, 77శాతం రాజ్‌పుత్‌లు, 71శాతం వైశ్యాలు, 79శాతం ఇతర అగ్రకులాలు బీజేపీకి ఓటేశాయి. దీనికి కారణం మోడీ. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై వైఖరి కారణంగా కొన్ని అగ్రకులాలు బీజేపీపై ఆగ్రహంతో ఉన్నాయి. ఎస్పీ, బీఎస్పీకి గంపగుత్తగా అగ్రకులాలన్నీ ఓటేసే పరిస్థితి లేదు. ఇక అలాంటి అగ్రకులాలకు గల ప్రత్యామ్నాయం కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ ఆందోళనకు ఇదొక కారణం. కొంతమంది అగ్రకుల ఓట్లను కాంగ్రెస్ తన్నుకుపోతుందని కమలనాథులు భయపడుతున్నారు.

కాంగ్రెస్‌లో ప్రియాంక రాజ్యాంగేతర శక్తిగా ఆవిర్భవించవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇనదది రాహుల్‌కు తలనొప్పులు తేవచ్చని భావిస్తున్నారు. అయితే, భవిష్యత్‌లో ఏమి జరుగుతుందనే బదులు ఇప్పటికిప్పుడు కాంగ్రెస్‌కు మాత్రం లబ్ధి చేకూరుతుంది. అందుకే ప్రియాంక రాక కాంగ్రెస్‌కు గొప్ప శుభవార్తగా నిలిచింది.

## ఎన్ఐఏకు చిక్కిన 'కోజికోడ్' నిందితుడు

### ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అరెస్టు

**న్యూఢిల్లీ :** కోజికోడ్ జంట పేలుళ్ల కేసులలో నిందితుడు మహ్మద్ అషర్ (33) ఎట్టకేలకు ఎన్ఐఏ చేతికి చిక్కాడు. పరారీలో ఉన్న అషర్ గురువారం సౌదీ అరేబియా నుంచి ఢిల్లీ ఐజీఐ విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే ఎన్ఐఏ అధికారులు అతనిని అరెస్టు చేశారని అధికారి గురువారం తెలిపారు. కేరళలోని కన్నూర్ జిల్లా, థాలాస్సెరీకి చెందిన అషర్‌పై 2010లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. '2006, మార్చి3న కోజికోడ్‌లోని కేఎస్ఆర్టీసీ, మఫస్సిల్ బస్టాండ్లలో ఐఈడీలు పేలాయి. ఈ పేలుళ్లలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఈ కేసులు రాష్ట్ర పోలీసుల నుంచి 2009, డిసెంబరులో ఎన్ఐఏకు బదిలీ అయ్యాయి. విచారణ చేపట్టిన ఎన్ఐఏ అషర్ సహా ఎనిమిది మందిపై 2010లో ఛార్జిషీట్లు నమోదు చేసింది. పరారీలో ఉన్న అషర్ సహా మరొక నిందితుడు పీపీ యూసఫ్ పేలుళ్ల సూత్రధారులు టి.నసీర్, సఫాన్ 'పార్టీ' సభ్యులని తెలిసింది. 2003 మరాడ్ మతఘర్షణల కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించడంతో కోజికోడ్‌లో ఐఈడీ పేలుళ్లకు ఈ బృందం కుట్ర పన్నినట్టు తేలింది' అని వివరించారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అషర్ 2007లో సౌదీ అరేబియాకు పారిపోయాడు. అషర్‌ను కొచ్చికి తరలించేలా ట్రాన్సిట్ రిమాండ్ కోసం అతనిని తొలుత ఢిల్లీ ప్రత్యేక కోర్టులో ఆపై కేరళలోని ఎర్నాకులం ప్రత్యేక జ్యూరిస్‌డిక్షనల్ కోర్టులో హాజరు పర్చనున్నట్టు ఎన్ఐఏ తెలిపింది.

## లోక్‌సభ ఎన్నికల్లో 'బ్యాలెట్'

### ఈసీని కోరిన అఖిలేశ్ యాదవ్



**లక్నో:** లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లను వాడాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, వాటి స్థానంలో బ్యాలెట్‌ను వాడితే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య బంధం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యానికి నమ్మకమే పునాదని, ఇది దేశానికి ఎంతో అవసరమని ఆయనన్నారు. 'రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతికతను దుర్వినిగిస్తున్నారనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఈవీఎంల దుర్వినియోగంపై సాంకేతికతపై పరిజ్ఞానం ఉన్న సమాజం గళమెత్తాలి. ఈవీఎంల దుర్వినియోగం, యంత్రాల మొరాయింపునకు సంబంధించి గత ఎన్నికలప్పుడు చాలా ఫిర్యాదులు వచ్చాయి. ఈవీఎంలో సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడంతో పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది' అని అఖిలేశ్ అన్నారు. ఇది సాంకేతికపరమైన లోపమా లేక ఎన్నికల నిర్వహణ వైఫల్యమా లేక ఓటు హక్కును వినియోగించుకోకుండా ప్రజలను అడ్డుకునే కుట్ర? అంటూ ఆయన ప్రశ్నించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమన్న లండన్‌కు చెందిన సైబర్ నిపుణుడు షుజా ప్రకటనపై అఖిలేశ్ స్పందిస్తూ 'ఈ వ్యవహారంలో నిష్పాక్షిక విచారణ జరగాలి. అధికారం, డబ్బు కోసం యత్నంగా భావించి.. దీనిని తీవ్రంగా పరిగణించాలి' అని అన్నారు. ఈసీ ఫిర్యాదు మేరకు షుజాపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

### జేఎన్‌యూ దేశద్రోహం కేసులో

## న్యాయశాఖాధికారికి షోకాజ్




**న్యూఢిల్లీ :** జేఎన్‌యూ దేశద్రోహం కేసు పలు మలుపులు తిరుగుతోంది. ప్రభుత్వ అనుమతి లేకుండా విద్యార్థి నేతలపై ఛార్జిషీటును దాఖలు చేసిన పోలీసులకు ఢిల్లీ హైకోర్టు మొట్టికాయలు వేసింది. ఆ ఛార్జిషీటును తిరస్కరించింది. ప్రభుత్వ అనుమతితో మరో ఛార్జిషీటును దాఖలు చేయాలని సూచించింది. కాగా, తనకు సమాచారం ఇవ్వకుండా శాఖా పరమైన అభిప్రాయాన్ని హోంశాఖకు నేరుగా పంపినందుకుగాను న్యాయశాఖ ప్రధాన కార్యదర్శి ఏకే మెండిరట్టకు ఆ శాఖ మంత్రి కైలాశ్ గెహ్లాట్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీంతో ఈ కేసులో ఢిల్లీ ప్రభుత్వ ప్రాసిక్యూషన్ ఆమోదానికి అడ్డంకి ఏర్పడినట్లు అయింది. తనకు సమాచారం ఇవ్వకుండా, తన ఆమోదం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, శాఖాపరమైన సమాచారాన్ని వేరొక శాఖకు పంపడం నిబంధనలకు విరుద్ధమని, ఈ ధిక్కరణవైఖరిపై వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో మంత్రి పేర్కొన్నారు. ఈ చర్య అవిధేయత కాదు ఉద్దేశపూర్వకంగా చేసినదిగా తోస్తోందని అభిప్రాయపడ్డారు. సంబంధిత ఫైలును న్యాయశాఖ అభిప్రాయం కోసం పోలీసులు పంపగా దానికి తమ అభిప్రాయాన్ని జతచేసి శాఖ ప్రధాన కార్యదర్శి తిరిగి పంపారు. ఆ ఫైలు ప్రస్తుతం హోంశాఖ మంత్రి సత్యేంద్ర జైన్ వద్ద ఉంది. ప్రాసిక్యూషన్ ఆమోదంపై ఆయనదే తుది నిర్ణయం. అయితే ఆమోదం కోసం ఈ ఫైలును మరలా గెహ్లాట్ వద్దకు పంపుతారా అన్నది అస్పష్టమని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## డబ్ల్యూసీడీ సున్నిత శాఖ కాదు



**న్యూఢిల్లీ :** దేశంలోని 70శాతం జనాభాకు సంబంధించిన వ్యవహారాలను చూసే మహిళా, శిశు సంక్షేమ శాఖ (డబ్ల్యూసీడీ) 'సున్నిత' మంత్రిత్వశాఖ కాదని మంత్రి మేనకాగాంధీ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం (ఎన్‌జీసీడీ)తో పాటు బేటీ బచావ్.. బేటీ పడావ్ (బీబీబీపీ) పథకం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమం థీమ్‌ను 'ఉజ్వల భవిష్యత్ కోసం బాలికల సాధికారత'గా నిర్ణయించారు. బీబీబీపీ కింద ఎంపికైన ముగ్గురు స్థానిక చాంపియన్లు తమ అనుభవాలను పంచుకున్నారు. నందిని నాగరాజి (15) మాట్లాడుతూ 'వయస్సులో దాదాపు 15-20 పెద్దవాడైన వ్యక్తితో బలవంతంగా పెళ్లి చేస్తున్నారని.. పెళ్లిరోజున జిల్లా మెజిస్ట్రేట్‌కు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాను. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి శిశు సంక్షేమ కమిటీతో పాటు గుడి దగ్గరకు వచ్చి నన్ను కాపాడారు. అప్పటి నుంచి చిల్డ్రన్‌హోమ్‌లో ఉంటున్నాను. ఐఏఎస్ అధికారిణి కావాలని, బాల్య వివాహాలపై పోరాడాలన్నది నా ఆకాంక్ష' అని తెలిపారు. ఈ సందర్భంగా 'ఇన్నోవేషన్స్ అండర్ బీబీబీపీ' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా వేర్వేరు జిల్లాల్లో జరిగిన 38 వినూత్న కార్యకలాపాలను ఐదు విభాగాలుగా అంటే 'సర్వైవల్ (మనుగడ), ప్రొటెక్షన్ (రక్షణ), ఎడ్యుకేషన్ (విద్య), పార్టిసిపేషన్ (భాగస్వామ్యం), వాల్యుయింగ్ గరల్స్ (బాలికలకు తగు గౌరవమర్యాదలు ఇవ్వడం)'గా విభజించి ఉత్తమ మైన, స్ఫూర్తిదాయకమైన వాటిని ఎంపిక చేసి ఈ బుక్‌లెట్‌లో పొందుపర్చారు.

## పీఎంఎల్ కేసులో ఈడీ దూకుడు

### యూపీ సహా నాలుగు రాష్ట్రాల్లో సోదాలు



**లక్నో / న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో వెలుగుచూసిన గోమతి రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు రూ.1500 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. కేసుతో సంబంధమున్న వారి ఆస్తులను సోదా చేసింది. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ (లక్నో, నోయిడా), ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్‌లో స్థానిక పోలీసులతో కలిసి ఈడీ అధికారులతో తనిఖీలు చేపట్టినట్టు అధికారి ఒకరు గురువారం తెలిపారు. సంబంధిత పత్రాలు, సాక్ష్యాధారాల కోసం దర్యాప్తు బృందాలు అన్వేషిస్తున్నాయన్నారు. గతేడాది మార్చిలో మనీలాండరింగ్ నివారణ చట్టం (పీఎంఎల్) కింద క్రిమినల్ కేసును కేంద్ర దర్యాప్తు బృందం నమోదు చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతమున్న యోగి ప్రభుత్వం దార్యప్తునకు ఆదేశించిన తర్వాత కేసు సీబీఐ పరిధిలోకి వెళ్లింది. దాంతో అప్పటి చీఫ్ ఇంజినీర్లు గులేశ్ చంద్ర, ఎస్ఎన్ శర్మ, ఖాసింఅలీ; సూపరింటెండెంట్ ఇంజినీర్లు మంగల్‌యాదవ్, అఖిల్ రమన్, కమలేశ్వర్ సింగ్, రూప్ సింగ్ యాదవ్; ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేంద్ర యాదవ్‌పై ఎఫ్ఐఆర్‌ను సీబీఐ నమోదు చేసింది. కాగా, గులేశ్ చంద్ర, మంగల్ యాదవ్, అఖిల్ రమన్, రూప్ సింగ్ యాదవ్ రిటైరయ్యారు. అలహాబాద్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి అలోక్ కుమార్ సింగ్ నేతృత్వంలో దర్యాప్తు కమిటీని యోగి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టులో అవకతవకలు జరిగినట్టు 2017, మే16న కమిటీ నివేదిక సమర్పించింది. దీంతో జూన్19న యూపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం జూలైలో సూచించగా నవంబరు 27న కేంద్రప్రభుత్వం ఆ మేరకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ కేసు దాఖలైంది.

## మాకు సిద్ధాంతాలే ముఖ్యం : ఎన్సీపీ



**ముంబై :** వ్యక్తిగత అంశాలకన్నా సిద్ధాంతాలు తమ పార్టీకి ముఖ్యమని ఎన్సీపీ స్పష్టం చేసింది. తమ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ 20 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీని వీడిన అనంతరం ఆ పార్టీతో చేతులు కలిపారని స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ అవమానించినప్పటికీ పవార్ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఎన్సీపీ అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, పై విధంగా వ్యాఖ్యానించారు. బీజేపీ ఇప్పుడు ఎందుకు కలత చెందుతోందో తెలుసుకోగోరుతున్నానని మాలిక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్పటి అధ్యక్షురాలు సోనియా గాంధీ విదేశీయత అంశంపై పవార్ 1999లో కాంగ్రెస్ పార్టీని వీడారు. తదుపరి అదే ఏడాది ఎన్సీపీని ఏర్పాటు చేశారు. "1999లో మహారాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల (ఒకేసారి జరిగాయి) తరువాత పవార్ సాహెబ్‌కు ఉప ప్రధానమంత్రి పదవిని బీజేపీ ప్రతిపాదించింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కూడా సూచించింది" అని మాలిక్ తెలిపారు. "కానీ, పవార్ సాహెబ్ మహారాష్ట్రలో కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆయనకు సంబంధించి వ్యక్తిగత అహం పెద్ద అంశం కాదు. సిద్ధాంతం ముఖ్యం. సిద్ధాంతం గురించి ఆలోచించినప్పుడు వ్యక్తిగత అంశాలు ప్రధానంకాదు. ఇది 20 సంవత్సరాల క్రితం. కానీ, బీజేపీ ఇప్పుడు ఎందుకు కలత చెందుతోంది?" అని ప్రశ్నించారు. పవార్ సొంత నియోజకవర్గం బారామతితో సహా మహారాష్ట్రలోని కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల బీజేపీ కార్యకర్తలనుద్దేశించి బుధవారం మోడీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అప్పటి వరకు సీనియర్ నాయకుడు అయిన మహారాష్ట్ర ఉక్కుమనిషి శరద్ పవార్‌ని కూడా కాంగ్రెస్ పార్టీ అవమానించిందని చెప్పారు.

## మౌలిక వసతులే ప్రథమ లక్ష్యం

### ఛత్తీస్‌గఢ్ సీఎం బాఘెల్

**రాయ్‌పూర్ :** మౌలిక సదుపాయాల అభివృద్ధే తమ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ తెలిపారు. రాష్ట్రంలో బాఘెల్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడిచింది. ఈ సందర్భంగా గురువారం ఆయన పీటీఐతో మాట్లాడుతూ, తమ ప్రభుత్వం తీసుకున్న రైతు అనుకూల నిర్ణయాలు ఆర్థిక సమస్యలు లేదా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం చూపించబోవని అన్నారు. కేవలం నెలరోజుల వ్యవధిలో తమ ప్రభుత్వం రైతుల రుణాల రద్దు, ధాన్యం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపు, గత బీజేపీ పాలనలో చోటుచేసుకున్న పౌరసరఫరాల కుంభకోణంపై సిట్ దర్యాప్తుతో సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నదని తెలిపారు. బాఘెల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి జనవరి 17వ తేదీకి నెలరోజులు గడిచింది. "గత నెల రోజులుగా రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం తీసుకున్న చర్యలు గత 15 ఏళ్ల పాలనలో బీజేపీ ఎన్నడూ తీసుకోలేదు" అని ముఖ్యమంత్రి చెప్పారు. మా ఎన్నికల హామీల అమలులో భాగంగా 16.50 లక్షల మంది రైతులకు చెందిన 6,100 కోట్ల రూపాయల రుణాలను రద్దు చేశామనీ ధాన్యం మద్దతు ధర క్వింటాల్ రూ. 2,500కు పెంచామని టాటా ప్లాంట్ కోసం దశాబ్దం క్రితం బస్తర్‌లోని లోహండిగూడలో సేకరించిన భూమిని తిరిగి రైతులకు ఇచ్చివేశామని చెప్పారు.

## నాడు ఉగ్రవాది... నేడు అమరజవాన్



**న్యూఢిల్లీ :** పవిత్ర యుద్ధంలో సైనికుడిగా ప్రాణాలు అర్పించటానికి సిద్ధపడి.. అనాడు ఉగ్ర వాదిగా మారారు. తన తప్పు తెలుసుకొని, ఉగ్రవాదాన్ని వీడి, భారత సైన్యంలో చేరారు. అంకితభావంతో సేవ చేశారు. కడకు కర్తవ్య నిర్వహణలో ఉగ్ర ముష్కరులతో జరిగిన పోరులో నేలకొరిగారు. సైన్యం చరిత్రపుటల్లో అమరుడయ్యారు. అయనే లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీ. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సైన్యంలోని అత్యున్నత పురస్కారం అశోక చక్రతో జనవరి 26 గణ తంత్రం రోజున సత్కరించనుంది. దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన నజీర్ అహ్మద్ వనీ గతంలో ఓ ఉగ్ర సంస్థలో చేరారు. 1990లో టెర్రరిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని పూర్తిగా మారిపోయాడు. పోలీసుల ముందు లొంగిపోయాడు. 2004లో టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌లో చేరారు. అప్పటినుంచి సైన్యానికి ఎంతగానో సేవ చేశారు. 2007, 2018లో సేవా పతకాలను అందుకున్నారు. గతేడాది నవంబరులో సోపియాన్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులతో పోరాడారు. ఈ ఎదురు కాల్పుల్లో వనీ తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ముష్కరులను మట్టుబెట్టేందుకు తన ప్రాణాలు అర్పించిన అహ్మద్ వనీ ధైర్యసాహసాలకు మరణానంతరం అశోక్ చక్ర లభించింది. వనీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### ఉగ్రచెర నుంచి

## బారాముల్లాకు విముక్తి..!

**శ్రీనగర్ :** కాశ్మీర్ లోయలోని బారాముల్లా జిల్లాను ఉగ్ర విముక్తి ప్రాంతంగా సైన్యం ప్రకటించింది. బారాముల్లా అంటే ఉగ్రముష్కరులకు స్వర్గధామమనే పేరుండేంది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఉగ్రవాదుల్ని నిర్మూలించినట్టు కాశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్ వెల్లడించారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తొయిబా ఉగ్రవాదుల్ని మట్టుపెట్టటంతో బారాముల్లా జిల్లాలో ఇక ఒక్క ఉగ్రవాది కూడా లేడని ఆయన తెలిపారు. బారాముల్లాలోని బిన్నెర్ ప్రాంతంలో బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురు కాల్పుల్లో సుహైబ్ ఫరూక్ అఖూన్, మోహసిన్ ముష్తాక్ భట్, నాసిర్ అహ్మద్ దర్జీ అనే ముగ్గురు ముష్కరులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. 2018లోనే జమ్ముకాశ్మీర్‌లో మొత్తం 22 జిల్లాలకుగాను 12 జిల్లాల్లో 256 మంది మిలిటెంట్లను భద్రతా బలగాలు కాల్చి చంపాయి. దక్షిణ కాశ్మీర్‌లోనే అత్యధికంగా 127 మందిని మట్టుబెట్టారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాదులకు ప్రధాన స్థావరం సోపియాన్‌లోనే 43 మంది ఉగ్రవాదులను హతమార్చారు.



## విశాఖలో ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం

- రాష్ట్రంలో నూతనంగా 50 జూనియర్ కళాశాలలు
- విద్యతోనే సమాజ మార్పు
- ఇంటర్ విద్య స్వర్ణోత్సవాల్లో మంత్రి గంటా శ్రీనివాసరావు

**విశాలాంధ్ర - విశాఖసిటీ :** విశాఖపట్నంలో ఇంటర్మీడియట్ ఆర్జేడీ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో గురువారం విశాఖ వేదికగా ఇంటర్మీడియట్ విద్య స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్‌లో సరైన లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఏటా బడ్జెట్‌లో 15 శాతం విద్యారంగానికి కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నూతనంగా 50 జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ బీఓజీ ఐఐటీ ఛైర్మన్ బీవీఆర్.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న నాల్గవ ఇండస్ట్రియల్ రివల్యూషన్‌తో టెక్నాలజీ వేగంగా మారిపోతుందన్నారు. నూతన ఆవిష్కరణలు తీసుకురావాలన్నారు. ఇంటర్మీడియట్ విద్య కమిషనర్, కార్యదర్శి బి.ఉదయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 3,014 జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుమారు 10 లక్షల మంది వరకు ఉన్నారన్నారు. దేశంలోని 48 సెకెండరీ, ఇంటర్ బోర్డులలో రాష్ట్ర ఇంటర్‌బోర్డు ప్రథమస్థానంలో ఉందన్నారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు రూపొందుతున్నాయన్నారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సావనీర్ విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, సినీగాయకులు ఐశ్వర్య, హాయత్‌లు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. వివిధ జిల్లాల జూనియర్ కళాశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్ ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు చెంగవల్లి వెంకట శ్రీనివాసరావు, వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు, అంబేద్కర్ వర్సిటీ వీసీ ఆచార్య కె.రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య రఘుబాబు, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత్‌శ్రీరామ్, జబర్దస్త్ ఫేం ఆనంద్, ప్రాసమణి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బృందానికి వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసులు, చేనేత కార్మికులు

## చేనేత సమస్యలపై కేంద్ర జౌళిశాఖ బృందం అధ్యయనం

**విశాలాంధ్ర - ఉరవకొండ రూరల్ :** అనంతపురం జిల్లా ఉరవ కొండ గ్రామంలో చేనేత కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ బృందం, చేనేత సేవా కేంద్రం అధికా రులు గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక శివరామిరెడ్డి కాలనీలో చేనేత పారిశ్రామికుల బ్లాక్‌లెవెల్ క్లస్టర్‌ను హిమజాకుమార్, పీఎస్ఎన్‌రెడ్డిలతో కూడిన అధికారుల బృందం సందర్శించారు. పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా చేనేత పారిశ్రామికుల సహకార సంస్థ ఛైర్మన్ కొత్తా శ్రీనివాసులు నేత కార్మికుల ఇబ్బందులను కేంద్ర జౌళిశాఖ బృందం దృష్టికి తీసుకెళ్లారు. చేనేత కార్మికులకు ముద్రా రుణాలు, పట్టురాయితీ పాసు పుస్తకాలు, పెన్షన్ రూ.3 వేలకు పెంచాలని, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం మోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలని శ్రీనివాసులు వివరించారు.



## ఏడుగురు దొంగలు అరెస్టు

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) :** జేబు దొంగతనాలతో పాటు ఇళ్లను కొల్లగొడుతున్న ఏడుగురి దొంగలను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో మహిళా దొంగలు ఉన్నారు. విజయవాడ బందర్‌రోడ్డులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం ఈ దొంగల వివరాలను క్రైమ్ డీసీపీ బి.రాజకుమారి మీడియాకు వెల్లడించారు. గుంటూరు జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందిన ఆవుల ప్రవీణ్‌కుమార్(21), ఆవుల కీర్తి(19), కంకణాల రేణుక(19), కంకణాల దేవయ్య(50), కంకణాల బాలస్వామి(19), గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఇట్టా దుర్గారావు (పాతనేరస్థుడు), కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన ముద్దాని జగదీష్(19) (పాతనేరస్థుడు)లను అరెస్టు చేశారు. వీరంతా కలిసి రద్దీ ప్రాంతాలు, ఆటోలు, బస్సులలో చాకచక్యంగా జేబులు కత్తిరించి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. విజయవాడ నగరంలో 16 నేరాలకు పాల్పడ్డారన్నారు. వివిధ ప్రాంతాల్లో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వీరి వద్ద నుంచి సుమారు 332 గ్రాముల బంగారం, 161 గ్రాముల వెండి, నగదు స్వాధీనం చేసుకున్నట్టు రాజకుమారి వివరించారు. సమావేశంలో ఏసీపీలు వర్మ, సుందరరాజు, సీఐ బాలమురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## టన్ను బరువున్న 'నంది' మాయం

**విశాలాంధ్ర - రామచంద్రపురం :** తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో టన్ను బరువున్న నంది విగ్రహం చోరీ కలకలం రేపింది. శివలింగం ముందు ఉండే నంది బుధవారం రాత్రి మాయం కావడం సంచలనం సృష్టించింది. సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో విగ్రహం చోరీ అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రతిష్ఠ సమయంలో విగ్రహం కింద వేసే వజ్రాల కోసం దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని కొందరు అనుమానిస్తున్నారు. క్షుద్రపూజల కోసమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రామచంద్రపురంలోని చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయానికి రెండు వైపులా మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సుమారు టన్ను బరువు కలిగిన నంది విగ్రహం మాయం కావడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కార్తీకమాసం ముందు నుంచి నంది విగ్రహం చుట్టూ టైల్స్ పగిలి ఉండటాన్ని గమనించిన భక్తులు ఆలయ అర్చకులకు సమాచారం ఇచ్చారు. కొబ్బరికాయలు కొట్టడం, దీపాల వేడి కారణంగా ఇలా జరిగి ఉండవచ్చని వారు సమాధానం ఇచ్చారన్నారు. రామచంద్రపురం సీఐ పెద్దిరెడ్డి శివగణేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయ అధికారులు, అర్చకుల నుంచి సమాచారం సేకరించారు.

## బరంపురం వరకు పలాస పాసింజర్

**విశాలాంధ్ర - విజయనగరం :** విశాఖ-పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న 58526/58525 నంబరు పాసింజర్ రైలును బరంపురం వరకు పొడిగించారు. ఒడిశాలోని కటక్-బరంపురం-కటక్ పాసింజర్ రైలు ఇచ్ఛాపురం వరకు రానుంది. ఈ రైళ్ళ పొడిగింపు ఈ నెల 26 నుంచి అమల్లోకి రానున్నట్టు రైల్వేశాఖ గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 22 రైళ్ల సర్వీసులను పొడిగించగా వాటిలో ఆరు తూర్పు కోస్తా రైల్వే పరిధిలో ఉన్నాయి. వీటిలో మూడు రైళ్ళు వాల్తేర్ రైల్వే డివిజన్‌లోనివి. పలాస పాసింజర్ రైలును బరంపురం వరకు పొడిగించడంతో ఇచ్ఛాపురం వరకు ఉన్న తెలుగు ప్రజలు విశాఖపట్టణానికి తరచూ రాకపోకలు సాగించే అవకాశం కలుగుతుంది. వైద్యం, విద్యకు సంబంధించి ఇటీవల విశాఖకు అధిక సంఖ్యలో వస్తున్న ప్రజలకు ఈ రైలు ఎంతో ఉపయోగపడనుంది. వీటితోపాటు హౌరా నుంచి విజయవాడ వరకు నడిచే హంసఫర్ ప్రత్యేక రైలును తిరుపతి వరకు పొడిగించారు. ఇది తిరుమల భక్తులకు ఉపయోగపడుతుంది. రూర్కెలా-కోరాపుట్-రూర్కెలా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను జగదల్‌పూర్ వరకు, విల్లుపురం-ఖరగ్‌పూర్-విల్లుపురం ఎక్స్‌ప్రెస్‌ను పురూలియా వరకు పొడిగిస్తున్నట్టు రైల్వే శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

# మేత దొరక్క పశువులు పస్తు

- పక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటున్న రైతులు
- రాష్ట్ర సరిహద్దుల్లో అడ్డుకుంటున్న పోలీసులు
- ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.15,000
- కబేళాలకు తరలిపోతున్న పశువులు
- ఆన్‌లైన్‌లో పశుగ్రాసం దరఖాస్తుల స్వీకరణ
- కరవు జిల్లా కర్నూలులో పశుగ్రాసం కొరత



లారీల్లో కబేళాలకు తరలిపోతున్న పశువులు



ఆదివారం ఎమ్మిగనూరు పశువుల సంతలో విక్రయాలు

**విశాలాంధ్రబ్యూరో - కర్నూలు :** గ్రామీణ ప్రజల జీవనాధారమైన పాడిపరిశ్రమకు పెనుముప్పు వచ్చి పడింది. పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఉత్పత్తులతో తమ ఆరోగ్యాల పరిరక్షణతోపాటు విక్రయిస్తూ కుటుంబాలను పోషిస్తున్న నిరుపేదలకు పెనుగండం వచ్చిపడింది. పశుగ్రాసం దొరక్కపోవడంతో కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పశువులను రైతులు కబేళాలకు తరలిస్తున్నారు. కళ్ల ముందు మూగజీవాలను పస్తులు పెట్టలేక సంతలకు తోలుకెళ్ళి తెగనమ్ముతున్నారు. కొందరు కసాయిలకు విక్రయిస్తున్నారు. కర్నూలు జిల్లాలో పశుగ్రాసం కొరత తార స్థాయికి చేరడంతో మిగిలిన కొద్దిమంది పశుపోషకులు తల్లడిల్లిపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీలోనూ వరుణుడు కరుణించకపోవడంతో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వేసిన పంటలు వేసినట్లే ఎండిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత 20 ఏళ్లుగా ఎన్నడూ లేని రీతిలో కరవు కమ్ముకుంది. వర్షాభావం, గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి పంటను చాలా మంది రైతులు పొలాల్లోనే దున్నేయడంతో పశుగ్రాసం కొరత తీవ్రరూపం దాల్చింది. జిల్లాలో గేదెలు, ఎద్దులు, ఆవులు, కోడెదూడలు సుమారు ఎనిమిది లక్షలు, గొర్రెలు, మేకలు 20 లక్షల వరకు ఉన్నాయి. పశుగ్రాసం కొరతతో వీటిని కాపాడటం ప్రస్తుతం యజమానులకు పెనుభారంగా మారింది. రూ.50 వేల నుంచి లక్షరూపాయల ధర పలికే కాడి ఎద్దుల జత నేడు రూ.60 వేల నుంచి రూ.70 వేలకు పడిపోయింది. పశువుల పరిస్థితి ఇంతే.

**పశువులను పస్తు పెట్టలేక..**

మన రాష్ట్రంలో పశుగ్రాసం కొరతతో పక్క రాష్ట్రంలోని కర్ణాటక, తెలంగాణ నుండి రైతులు కొనుగోలు చేస్తున్నారు. కర్ణాటకలోని రాయచూరు, సింధనూరు, బళ్ళారి ప్రాంతాలతోపాటు తెలంగాణలోని ఐజ, గద్వాల నుంచి డిమాండ్‌ను బట్టి వరిగడ్డి ట్రాక్టరు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని పడమటి ప్రాంత రైతులు నంద్యాల, శిరివెళ్ళ, బండి ఆత్మకూరు నుంచి కూడా పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కరవు జిల్లాగా ప్రకటించినా కరవు సహాయ చర్యలు చేపట్టకపోవడంతో రైతులు వలస పోతున్నారు. నిత్యం కర్నూలు, డోన్, తుగ్గలి రైల్వేస్టేషన్ల నుంచి వందలాదిమంది రైతులు, వ్యవసాయ కూలీలు వలసపోతున్న నేపథ్యంలో ఇంటి వద్ద పశువులను పస్తు పెట్టలేక విక్రయిస్తున్నారు. ఆదివారం ఎమ్మిగనూరు పశువుల సంతలో కోలాహలం కరవు తీవ్రతకు అద్దం పడుతోంది.

**దాణా సరఫరా చేస్తున్నాం**

పశువులకు ప్రభుత్వం తరఫున దాణా సరఫరా చేస్తున్నాం. సమీపంలోని పశువైద్యశాల డాక్టర్‌ను కలిస్తే పశుగ్రాసం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మీసేవ ద్వారా డబ్బు చెల్లించాలి. జిల్లాలో ఇప్పటికి నాలుగు మెట్రిక్ టన్నుల దాణా, 560 మెట్రిక్ టన్నుల సైలేజ్, 500 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ సరఫరా చేశాం. అవసరం అయిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.


సుదర్శన్, జేడీ, పశుసంవర్ధకశాఖ, కర్నూలు

**పశువుల హాస్టల్స్ తక్షణ అవసరం**

ఈ ఏడాది పంటలు ఎండిపోవడంతో పశుగ్రాసం దొరకడం లేదు. ప్రభుత్వం పశువులకు తక్షణం హాస్టల్స్ ఏర్పాటుచేయాలి. పశుగ్రాసానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరడం దారుణం. రైతులకు ఆ పరిజ్ఞానం లేనందున తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ, పశువైద్యశాలల్లో ఎక్కడైనా పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే పాడిపరిశ్రమకు ముప్పు తప్పదు.

కె.జగన్నాథం,
జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతుసంఘం

**మేత దొరకడం లేదు**



హొళగుందలో సొంత భూమి అయిదు ఎకరాలు ఉంది. ఈ ఏడాది రెండు ఎకరాలలో పత్తి, రెండు ఎకరాలలో వరి, ఎకరాలో మిర్చి పంటను సాగు చేశా. వరికి ఎర్రతెగులు వచ్చి పంట పూర్తిగా పోయింది. దీంతో పశువులకు మేత లేక కర్ణాటకలోని కరూరు, దరూరు నుంచి ట్రాక్టర్ పశుగ్రాసం రూ.15,000 చొప్పున కొనుగోలు చేస్తున్నా. ప్రభుత్వం పశుగ్రాసం సరఫరా చేసి ఆదుకోవాలి.

తిమ్మయ్య, రైతు, హొళగుంద

## 'భీమసింగి'కి రూ.12 కోట్ల పన్ను మాఫీ

- కొనుగోలు పన్ను బకాయిలను మాఫీ చేసిన ప్రభుత్వం
- ఊపిరిపీల్చుకున్న చక్కెర కర్మాగార యాజమాన్యం

**విశాలాంధ్ర - జామి :** ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న విజయనగరం జిల్లా జామి మండలంలోని భీమసింగి సహకార చక్కెర కర్మాగారానికి రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప ఊరటనిచ్చే సమాచారం ఇచ్చింది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వానికి కొనుగోలు పన్ను రూపంలో చెల్లించాల్సిన మొత్తం బకాయిలను చక్కెర కర్మాగారాలకు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంతో భీమసింగి ఫ్యాక్టరీకి రూ.12 కోట్ల వరకు మాఫీ కానుంది. దీంతో యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.

రాష్ట్రంలో రైతుల నుంచి చక్కెర కర్మాగారాలు చెరకు కొనుగోలు చేసే సమయంలో టన్నుకు రూ.40 చొప్పున ప్రభుత్వానికి కొనుగోలు పన్ను చెల్లించాల్సి ఉంది. 1994 నుంచి 2001 వరకు ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఈ పన్ను చెల్లింపు ఆపేశాయి. ప్రభుత్వం ఏటా కొనుగోలు పన్ను, దానిపై వడ్డీ విధిస్తూ చెల్లించాలని పరిశ్రమలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కర్మాగారాల యాజమాన్యాలు మాత్రం నష్టాలను చూపిస్తూ పన్ను చెల్లించలేమని చేతులెత్తేశాయి. రాష్ట్రంలో సహకార చక్కెర కర్మాగారాలు వరుసగా మూతపడుతున్నాయి. దీంతో ఫ్యాక్టరీల్లో పరిస్థితుల అధ్యయనం కోసం ప్రభుత్వం ఒక మంత్రివర్గ కమిటీని ఏర్పాటుచేసింది. కమిటీ పరిశీలన తర్వాత పన్ను రద్దు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో పన్నులను మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనను ఆమోదించడంతో కర్మాగారాలు ఊపిరిపీల్చుకున్నాయి. భీమసింగి చక్కెర కర్మాగారం కొనుగోలు పన్ను ద్వారా చెల్లించాల్సిన మొత్తం రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉన్నా వడ్డీతో కలిపి రూ.12 కోట్లకు చేరింది. ఈ మొత్తం రద్దు కావడంతో యాజమాన్యం సంతోషం వ్యక్తం చేస్తోంది.

**ఆర్థిక సాయంతో ఆదుకోవాలి**

ప్రభుత్వం కొనుగోలు పన్ను రద్దు చేయడం మంచి పరిణామం. ఇది కర్మాగారానికి కొంత ఊరట. ప్రస్తుతం రుణాల మంజూరుకు తక్షణ సహాయం చేయాలి. ఇది కర్మాగారానికి అత్యంత అవసరం. ఈ ఏడాది కార్మికుల వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉంది. ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

వి.కృష్ణంరాజు, గుర్తింపు సంఘం అధ్యక్షుడు.



## పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మె విరమణ

**విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) :** రాష్ట్రంలోని ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగులు వేతన సవరణతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 17 నుంచి కొనసాగిస్తున్న నిరవధిక సమ్మె విరమిస్తున్నట్టు ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో- ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ ప్రకటించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉండవల్లి ప్రజావేదికలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి సి.ఆదినారాయణరెడ్డితో జరిగిన చర్చల్లో కొన్ని హామీలతో సమ్మె విరమిస్తున్నామన్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సుల్లో కొన్ని మార్పులతో జీవో విడుదల చేయాలంటూ ఉద్యోగులు సమ్మెకు వెళ్లారు. కమిటీ సిఫార్సు చేసిన 10 శాతం కాకుండా 20 శాతం వేతనాల పెంపునకు అంగీకరించినట్టు చెప్పారు. గ్రాట్యుటీ రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు పెంచుతామని, ప్రమోషన్లను ప్రతిభ ప్రాతిపదికగా ఇవ్వడానికి అంగీకరించారన్నారు. వేతన చెల్లింపు సామర్థ్యం చేరుకునేందుకు సహకార సంఘాలకు కమిటీ ఇచ్చిన గడువు 3 నుండి 5 సంవత్సరాలకు పెంచుతామని, ఉద్యోగులకు భద్రత కల్పిస్తామని, పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాలకు పెంచేందుకు హామీ ఇచ్చినట్టు వివరించారు. ప్రధాన కోర్కెలను పరిష్కరిస్తామన్న హామీతో సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని సహకార సంఘ ఉద్యోగులకు నేతలు విజ్ఞప్తి చేశారు. గత నెల 17 నుంచి ఈ నెల 23 వరకు 38 రోజుల పాటు సమ్మెను జయప్రదం చేసిన పీఏసీఎస్ ఉద్యోగులందరికీ అభినందనలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో యూని యన్ అధ్యక్షులు పి.వి. సత్యనారాయణరాజు, కోశాధికారి టి.వెంకటరామయ్య, దిలీప్ కుమార్, హరికృష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సినీనటి భానుప్రియపై కేసు

**విశాలాంధ్ర - సామర్లకోట :** తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో సినీనటి భానుప్రియపై గురువారం కేసు నమోదు అయ్యింది. చెన్నైలో భానుప్రియ వద్ద 14 ఏళ్ల తన కుమార్తెను పనిలో పెట్టుకున్నప్పటినుంచి వేధిస్తున్నట్లు బాలిక తల్లి ప్రభావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు చైల్డ్‌లైన్ ద్వారా చెన్నై పోలీసులకు కేసును బదలాయించారు. సామర్లకోట మండలం పండ్రవాడకు చెందిన ప్రభావతి ఏడాదిన్నర క్రితం భానుప్రియ ఇంట్లో తన కుమార్తెను పనికి పెట్టినట్లు ఫిర్యాదులో తెలిపారు. భానుప్రియ సోదరుడు తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్టు ఆమె ఆరోపించారు. ఇంటికి పంపాలని అడిగితే దొంగతనం కేసు పెడతామంటూ బెదిరిస్తున్నారని, రూ.10 లక్షలు ఇస్తే కుమార్తెను తిరిగి ఇస్తామంటున్నారని ఫిర్యాదు లో ఆమె వివరించారు. ఈ సందర్భంగా బాధిత తల్లి మీడియాతో మాట్లాడుతూ తనకు భర్త లేడని, ఇద్దరు కుమార్తెల్లో పెద్దమ్మాయికి పెళ్లి చేశానని, రెండో కుమార్తెను తెలిసినవాళ్ల ద్వారా భానుప్రియ ఇంట్లో పనికి పెట్టానన్నారు. పండగ తర్వాత కుమార్తెను చూడటానికి వెళ్తే మూడు గంటలపాటు చూపించలేదన్నారు. భానుప్రియ సోదరుడు గోపాల కృష్ణ తన కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడని, కుమార్తెను తీసుకువెళ్ళిపోతానంటే దొంగతనం కేసు పెడతామని భయపెట్టి తనపై కూడా చేయిచేసుకున్నారన్నారు. రూ.10లక్షలు ఇస్తే కుమార్తెను ఇస్తామనడంతో ఏమి చేయాలో తెలియక, భాష రాని ప్రాంతంలో ఉండలేక ఇక్కడకు వచ్చి కేసు పెట్టినట్లు ప్రభావతి చెప్పారు. కుమార్తెను తీసుకురాలేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె అన్నారు.



## వడ్డెర్లను ఎస్టీల్లో చేర్చకపోతే ఓటుతో సమాధానం

**విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) :** గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చుతూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతామని ఒడ్ (వడ్డెర) కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఓసీసీఐ) రాష్ట్ర అధ్యక్షులు గొదిండ్ల వెంకటేష్ హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల మంది తమ సామాజిక వర్గం ఉన్నప్పటికీ న్యాయబద్ధంగా అందాల్సిన సౌకర్యాలు లభించడం లేదన్నారు. ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో అత్యంత వెనుకబడి జీవిస్తున్నామన్నారు. ఇటీవల అగ్రకులాల ప్రతినిధులు తమవారిపై భౌతికదాడులకు పాల్పడుతున్నారన్నారు. చిత్తూరు జిల్లా పెనుమూరు గ్రామంలో ఇటీవల వడ్డె వేణుగోపాల్‌ను అగ్రవర్ణాల నేతలు అకారణంగా కాళ్ళు, చేతులు కట్టేసి అతిదారుణంగా హింసించినా నేటికీ పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. దాడి చేసినవారిని తక్షణం అరెస్టు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. క్వారీలు, ఇతర ప్రమాదకర పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన వడ్డెర్లకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల జానకీరామ్, కార్యదర్శి మంజుల నాగార్జున, అధికార ప్రతినిధి తుమ్మిశెట్టి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'కోట్ల' కాంగ్రెస్‌ను వీడుతున్నారా !

- 26న పార్టీ కార్యకర్తలతో భేటీ
- టీడీపీలో చేరుతున్నట్టు పుకార్లు



కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

**విశాలాంధ్రబ్యూరో - కర్నూలు :** మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి తనయుడు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అంటే కోట్ల కుటుంబం. కుటుంబం తొలి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉండటంతో జిల్లాలో ప్రత్యేక అనుచరవర్గం ఉంది. రాయలసీమలో రాజకీయ పార్టీల కంటే వ్యక్తుల ప్రాబల్యమే ఎక్కువ. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గం నుంచి సూర్యప్రకాష్‌రెడ్డి గతంలో మూడుసార్లు విజయంతో సత్తా చాటారు. 2009 ఎన్నికల్లో పార్లమెంటు సభ్యునిగా గెలుపొందిన ఆయన ప్రధాని మన్మోహన్ సింగ్ మంత్రి వర్గంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాతి పరిణామాలతో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని భావించిన మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో సహా చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడి టీడీపీ, వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. కోట్ల కుటుంబం మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడలేదు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా జిల్లాలో అనేక రాజకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. కోట్ల కుటుంబం టీడీపీలో, వైసీపీలో చేరుతుందంటూ ప్రచారం సాగినా సూర్యప్రకాష్‌రెడ్డి కొట్టిపారేశారు. రాష్ట్రంలో పార్టీ బలహీనంగా ఉండటంతో రాబోయే ఎన్నికలలో టీడీపీతో పొత్తు పెట్టుకుంటే బాగుంటుందని కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పలుమార్లు తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలోనూ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి ఉమెన్‌చాందీ ఎదుట కూడా ఇదే అభిప్రాయం వెల్లడించారు. కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్రంలో టీడీపీతో పొత్తు లేకుండా ఒంటరిగా బరిలోకి దిగేందుకు మొగ్గుచూపడంతో కోట్ల అసహనం వ్యక్తం చేసినట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో తన రాజకీయ వారసుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి రాజకీయ భవిష్యత్ దృష్ట్యా కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరుతున్నారనే ప్రచారం జోరుగా నడుస్తోంది. జిల్లాలోని కోట్ల అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం కర్నూలు పట్టణంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వైసీపీ అధినేత జగన్‌తో ఆయన సోదరుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో భేటీ అయినట్లు తెలుస్తోంది. వైసీపీలో చేరేందుకు హర్షవర్ధన్‌రెడ్డి రంగం సిద్ధం చేసుకున్నట్లు వినికిడి. తాను కాంగ్రెస్‌ను వీడేది లేదంటూ కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మీడియాకు ప్రకటించారు. అవసరమైతే సొంత ఊళ్లో వ్యవసాయం చేసుకుంటానని, మరో పార్టీలో చేరేది లేదని, సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదు అన్న విషయాన్ని తాను అంగీకరించనన్నారు. వ్యాపారస్తులు, ఫ్యాక్షనిస్టులు పార్టీలు మారుతుంటారని, నాకు ఆ అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యకర్తల సమావేశంలో కోట్ల ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని ఆయన అనుచరులు, కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ నాయకులు ఆసక్తిగా చూస్తున్నారు. కోట్లను తమ పార్టీలోకి ఆహ్వానించాలని ఇప్పటికే వైసీపీలోని ప్రముఖ నేతలు ఆయనను కోరుతుండగా, టీడీపీ ఎంపీ సీఎం రమేష్‌తోపాటు చంద్రబాబు తనయుడు లోకేష్ కూడా కోట్ల రాఘవేంద్రరెడ్డితో టచ్‌లో ఉన్నట్లు పుకార్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ వచ్చి తనను కలవాలంటూ కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం తలపెట్టిన కార్యకర్తల సమావేశం నిర్వహించాలా, వద్దా అనే దానిపై ప్రధాన అనుచరులతో కోట్ల చర్చించినట్టు వినికిడి.



## తండ్రికి తలకొరివి పెట్టిన చిన్నారి

### పాడి పట్టేందుకూ వారసులు లేరు

విశాలాంధ్ర - విజయవాడ రూరల్ : తండ్రి అనారోగ్యంతో మరణించాడు. ఊళ్లో వారసులంటూ ఎవరూ లేరు. కనీసం పాడి పట్టేందుకు నలుగురు వ్యక్తులూ కరవయ్యారు. నలుగురిని ఆలోచించే వయస్సూ ఆమెది కాదు. ఉన్న ఇద్దరు ముగ్గురు బంధువులుసైతం అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించారు. దీంతో అన్నీ తానై తండ్రికి దహన సంస్కారాలు నిర్వహించింది పదేళ్ల చిన్నారి. విజయవాడ రూరల్ మండలం నున్నకు చెందిన నూకల సుబ్బారావు (48) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు వారసులు లేకపోవటంతో పదేళ్ల పూజితే తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. విజయవాడ సమీపంలోని రామవరప్పాడుకు చెందిన సుబ్బారావు ఇరవై ఏళ్ల క్రితం నున్నకు చెందిన జయను వివాహం చేసుకున్నాడు. పొట్ట కూటి కోసం నున్న శివారు బోడపాడు వచ్చిన ఆ దంపతులు వ్యవసాయ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహమవ్వగా, రెండో కుమార్తె పూజిత ఐదో తరగతి చదువుతోంది. హఠాత్తుగా తండ్రి మంచానపడి మృతి చెందటంతో ఆ చిన్నారికి ఏం చేయాలో పాలుపోలేదు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆమెకు ఎవరూ అండగా నిలవలేదు. భర్తకు నా అనే వారు లేరు. పాడి పట్టేందుకు కనీసం నలుగురు వారసులు కూడా లేరు. తలకొరివి పెట్టేందుకు ఆమె తోబుట్టువుగానీ, అల్లుడుగానీ ముందుకు రాలేదు. ఇతరు బంధువులు కూడా తలకొరివి పెట్టలేమని చెప్పేశారు. ఏం చేయాలోనని తల్లి మదన పడుతుండగా, పదేళ్ల పూజిత తానే కొడుకుగా మారింది. తండ్రికి తలకొరివి పెట్టేందుకు ముందుకు వచ్చింది. దీంతో స్థానికులలో ఒక్కసారిగా చలనం కలిగింది. నలుగురు కలసి సుబ్బారావు భౌతికకాయాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లారు. హిందూ సంప్రదాయం ప్రకారం పదేళ్ల పూజిత తండ్రికి దహన సంస్కారాలు నిర్వర్తించింది.

## ఉద్యోగులను ఇబ్బందిపెట్టను

### మధ్యంతర భృతిపై వచ్చే కేబినెట్‌లో నిర్ణయం

### ఉద్యోగసంఘాల నేతలతో చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వ ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని, కేంద్రప్రభుత్వం కక్షపూరిత ధోరణి వల్ల కంఫర్ట్ జోన్‌కి చేరుకోకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవల్సి వసున్నదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గెజిటెడ్ అధికారుల సంఘం, ఏపీఎన్జీవో నేతలు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కల్సి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల డీఏ ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 11వ పీఆర్సీ ప్రకటించేవరకు మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఐఆర్ ప్రకటించి అమలు చేయాలని, ఢిల్లీ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన విధానం తరహాలోనే రాష్ట్రంలోనూ సీపీఎస్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే వారికి సైతం పీఆర్సీ అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను దశలవారీగా క్రమబద్ధీకరిస్తామని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ మధ్యంతర భృతిపై కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సానుకూలంగా లేకపోవడంతో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనిని ప్రభుత్వ ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేందుకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఆటంకంగా ఉన్నాయని, దానిపై అప్పీలుకు వెళ్లాల్సి ఉందన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు ప్రభుత్వానికి అందించిన సహకారం మరువలేనిదని వారిని అభినందించారు. కేంద్రంలో మనకు అనుకూలమైన ప్రభుత్వం ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావని, ఇప్పటివరకు కేంద్రం నుంచి రూ.75 వేల కోట్లు రావాల్సి ఉందని వారికి వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు ఖర్చుపెట్టిన దాంట్లో ఇంకా సుమారు రూ.4 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, చివరికి నరేగా నిధులను సైతం సక్రమంగా కేంద్రం విడుదల చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. దీంతో జీతాలు ఇచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, రుణాలు తెచ్చుకునేందుకు వీలులేని పరిస్థితి కల్పించారని తెలపారు. ఉద్యోగులను ఇబ్బందిపెట్టాలని ఎప్పుడూ అనుకోనని, కంఫర్ట్ జోన్‌కి చేరుకుంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు.

## 29న 'ఉపాధి' దీక్ష

### తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండు

### దీక్షల జయప్రదానికి జల్లి విల్సన్, వెంకటేశ్వర్లు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలన్న డిమాండుతో ఈనెల 29న చేపట్టే దీక్షలను జయప్రదం చేయాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రతినిధులు జల్లి విల్సన్, వి.వెంకటేశ్వర్లు గురువారం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సగానికిపైగా మండలాల్లో కరవు ఏర్పడిందని, గ్రామాల్లో పనులు లేక కూలీలు వలసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనుల బిల్లులు క్లియరెన్స్ కోసం నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉందన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండు చేశారు. కరవు మండలాల్లో కుటుంబానికి 150 రోజుల ఉపాధి పనులు కల్పిస్తామన్న ప్రభుత్వం ఐదునెలలు గడిచినా 50 రోజులకు మించి పని కల్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిగలిన ఈ రెండు నెలల్లో వందరోజుల పని ఎలా కల్పిస్తారని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. వలసలు పోకుండా ఆదుకుంటామని, అవసరమైతే అదనంగా 30 శాతం అలవెన్స్ ఇస్తామని సీఎం ప్రకటించి మోసగించారన్నారు. తీవ్రమైన కరవుతో భూమి గట్టిపడి కూలీల చేతులు బొబ్బలెక్కుతున్నా రోజుకి రూ.100కు మించి కూలీ గిట్టుబాటు కావడంలేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఉన్న రూ.420కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. కుటుంబానికి 200 రోజుల పనితోపాటు రూ.500 వేతనం; 30 రోజులు పూర్తి చేసిన ప్రతి కుటుంబానికి పనిముట్లు ఇవ్వాలని; ప్రమాదంలో మరణిస్తే రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రభుత్వమే బీమా సౌకర్యం; పని చేసే ప్రాంతంలోనే కూలీలకు మధ్యాహ్న భోజన వసతి కల్పించాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం చేసే దీక్షలను జయప్రదం చేయాలని ఉపాధి కూలీలు, పేదలకు పిలుపునిచ్చారు.

## మహిళలకు రక్షణ కరవు

- నిర్భయ చట్టం అమలు అంతంతే
- అక్కరకు రాని బాధిత మహిళల సహాయ నిధి
- మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఇతర నేతలు

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 14వ రాష్ట్ర మహాసభలు 29, 30, 31 తేదీలలో ఏలూరులో జరుగుతాయని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి తెలిపారు. సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆమె రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ మహాసభల సందర్భంగా 29న 13 జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ఏలూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. 30, 31 తేదీలలో టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో మహాసభ జరుగుతుందని, ఇందులో 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఏలూరులో మహిళా సమాఖ్య మహాసభలకు ప్రత్యేకత ఉందని ఆమె అన్నారు. మహిళలకు దేశంలో రక్షణ కరవైందన్నారు. నిర్భయ చట్టం పటిష్టంగా అమలు జరగడం లేదు. బాధిత మహిళలకు ఉద్దేశించిన వెయ్యి కోట్ల రూపాయ లను ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. చట్టాలను, మహిళలను ఆదుకునే పథకా లను నిర్వీర్యం చేస్తోందని జయలక్ష్మి ఆరోపిం చారు. మహిళలకు సంబంధించిన అన్ని విషయా లను కూలంకషంగా చర్చించి భవిష్యత్ కార్యాచ రణను రూపొందించుకుం టామని ఆమె తెలిపారు. మద్యనిషేధం అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలన్న డిమాండ్లతో పోరాటం సాగిస్తామ న్నారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గాళ్ల శారద మాట్లాడుతూ మహిళా సమాఖ్య మహాసభలకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ కార్యదర్శి అనీ రాజా, సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. వీరితో పాటు రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధానకార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని, సినీనటి కోళ్ల హేమ, సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, సమాఖ్య అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ తదితరులు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు రేమళ్ల రోజా, కొండేటి బేబి, ఏలూరు కమిటీ అధ్యక్షురాలు గోపాలుని వినోదిని, కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.



## మగర్‌పట్టా సందర్శించిన రాజధాని రైతులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాజధాని అమరావతికి చెందిన రైతులు పూణె సమీపంలోని మగర్‌పట్టా నగరాన్ని గురువారం సందర్శించారు. రాజధాని రైతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్‌కు చెందిన 50 మంది రైతులు మగర్‌పట్టాలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ సిటీ లెర్నింగ్ సెంటరులో మార్కెటింగ్ హెడ్ మాణిక్‌శర్మతో సమావేశమయ్యారు. ఈ నగరంలో 1993 నుంచి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధికి సంబంధించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలను రైతులకు తెలిపారు. మగర్‌పట్టా అభివృద్ధిలో భాగంగా 120 మంది రైతులు 400 ఎకరాల భూమిని సమీకరించుకుని ఒక జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ద్వారా సతీష్‌మగర్ నేతృత్వంలో సమిష్టిగా భాగస్వాములయ్యారు. అభివృద్ధి చేసిన 400 ఎకరాల్లో సకల వసతులు కల్పించి ప్రాజెక్టు అమ్మకంలో రైతులకు 30 శాతం, మగర్‌పట్టా కంపెనీకి 70 శాతం వాటా తీసుకున్నారు. ఈ మొత్తంలో నిర్మాణం వ్యయం పోగా మిగిలిన మొత్తం మగర్‌పట్టా కంపెనీలో ఉంటుందని అధికారులు వివరించారు. ఈనగరాన్ని వాక్ టు వర్క్, వాక్ టు స్కూల్ కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేసామన్నారు. నగర నిర్వహణ వ్యయం మొత్తం ఈ ఐటీ సెక్టార్ నుంచే లభిస్తుందన్నారు. ఈ పర్యటనలో సీఆర్‌డీఏ సీనియర్ అర్బన్ ప్లానర్ పి.వి.రమణరావు, అమర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

## రైతుల గోడు పట్టని పాలకులు

- వ్యవసాయరంగంపై ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి
- చర్చాకార్యక్రమంలో జేవీఎస్ఎన్, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-అనకాపల్లి : దేశంలో రైతుల ఆత్మహత్యలను వినియోగించుకుని రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తున్నాయనీ వారి సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసే పరిస్థితి కనిపించడంలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రైతు సంఘం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో అనకాపల్లిలోని ఏపీటీఎఫ్ సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయరంగ సంక్షోభం-ప్రభుత్వ విధానాలపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ. రైతుల ఆత్మహత్యలను నివారించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని అన్నారు. పాలతో పాటు రైతులు పండించిన పంటలు రోడ్డుపై పారబోసి, చివరకు వారి మూత్రాన్ని వారు తాగి నిరసన తెలిపారని, ఇలాంటి నిరసన 1980లో ఫ్రాన్స్‌లో కూడా జరిగిందని చెప్పారు. వ్యవసాయరంగం సంక్షోభానికి అనేక కారణాలు ఉన్నాయని రైతు దుక్కిదున్నినప్పటి నుండి మార్కెట్‌లోకి సరుకు తెచ్చేవరకు అనేక కష్టాలు పడుతున్నారని అన్నారు. రైతాంగం కోసం మొత్తం 64 కమిషన్లు వేశారని వారిచ్చిన రిపోర్టులను అమలుచేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని అన్నారు. రాష్ట్రంలో రైతురథం పేరుతో ట్రాక్టర్లు ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే అందుతున్నాయని అన్నారు. మిగతా వారు రైతులు కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చీడిక భూ పోరాటయోధుడు రావు శ్రీరంగనాయకులను సత్కరించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావు జగ్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

## కాపు రిజర్వేషన్లపై మీ వైఖరేంటి ?

- బీజేపీ, వైసీపీలను ప్రశ్నించిన చంద్రబాబు
- కేసుల కోసం మోడీతో, డబ్బుకోసం కేసీఆర్‌తో జగన్ లాలూచీ
- వ్యవస్థలను కాపాడుకోవడమే జాతీయస్థాయిలో ఉమ్మడి అజెండా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కాపు రిజర్వేషన్లపై బీజేపీ, వైసీపీల వైఖరేంటో స్పష్టం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండు చేశారు. ఈబీసీలకు ఇచ్చే 10శాతం రిజర్వేషన్లలో మెజార్టీగా ఉన్న కాపులకు 5శాతం కేటాయిస్తే బీజేపీ, వైసీపీలకు ఇబ్బందేమిటో చెప్పాలన్నారు. వీటిపై వారి వైఖరేంటో చెప్పకుండా టీడీపీపై పసలేని విమర్శలు చేయడం తగదన్నారు. 'ఎలక్షన్ మిషన్-2019'లో భాగంగా టీడీపీ నేతలతో గురువారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈబీసీ రిజర్వేషన్ల అమలుపై ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను బట్టి కేటాయింపులు చేసుకోవచ్చని ఒక పక్క చెబుతూ, మరో పక్క రాష్ట్రానికి అధికారం లేదనడంలో వారి ఉద్దేశమేంటో చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఏదీ జరగకూడదు, ఎవరూ సంతోషంగా ఉండకూడదనేది బీజేపీ, వైసీపీ లక్ష్యమని దుయ్యబట్టారు. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనేదే ఇరు పార్టీల ఉమ్మడి అజెండాగా చంద్రబాబు చెప్పారు.

కాపు రిజర్వేషన్లపై పాదయాత్రలో జగన్‌ను నిలదీస్తే తన పరిధిలోనిది కాదని తప్పించుకున్నారని, ఇప్పుడు వారికి 5 శాతం ఇస్తుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరిస్తే బీజేపీ, వైసీపీ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కేసుల మాఫీ కోసం ప్రధాని మోడీతోనూ, డబ్బుల కోసం కేసీఆర్‌తోనూ రాజీపడి జగన్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతూ తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. డబ్బు మనిషైన జగన్, డబ్బున్న వాళ్లకే టిక్కెట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. మోసాల్లో ఘనుడు కాబట్టే 16నెలలు జైలుకు వెళ్లారని, దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీనేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తన చేతకానితనం ఎక్కడ బయటపడుతుందోనని కేసీఆర్ భయపడుతున్నారని, అందుకని ఆంధ్రాలో కూడా చేతకాని వారు అధికారంలో ఉండాలనేది కేసీఆర్ కోరిక అన్నారు.

### వ్యవస్థలను కాపాడుకోవడమే ఉమ్మడి అజెండా

ఏపీలో తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండదని కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి ఊమెన్ చాందీ తాజాగా స్పష్టత నిచ్చిన నేపథ్యంలో చంద్రబాబు కూడా పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్‌తో పొత్తు వుండదన్న సంకేతాలు ఇచ్చారు. రాష్ట్రాలలో స్థానిక పార్టీల అభీష్టం మేరకే ఎన్నికల్లో పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. జాతీయస్థాయిలో మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం కొనసాగుతుందని తేల్చిచెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ మధ్య పొత్తు లేదని, అయినా కాంగ్రెస్ నేతలు కోల్‌కతా ర్యాలీకి వచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. నిరంకుశ పాలన అంతమే కనీస ఉమ్మడి కార్యక్రమంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. దేశంలోని వ్యవస్థలను కాపాడుకోవడమే ఉమ్మడి అజెండా అని స్పష్టంచేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల భద్రతే తమ ఉమ్మడి లక్ష్యమన్నారు. గత ఎన్నికల సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలన్నీ అమలు చేశాం. పింఛన్ రూ.1000 చేస్తామని చెప్పి రూ.2వేలకు పెంచామని, 10 రెట్లు పెంచడం దేశంలో ఒక చరిత్ర అన్నారు. ఈ విషయా లన్నీ ప్రజలకు వివరించి లబ్ధిదారులంతా తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడేలా చూడాలని, టీడీపీ సంస్థాగత బలమేంటో వచ్చే ఎన్నికల్లో చాటిచెప్పాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై

## సమగ్ర నివేదిక ఇవ్వండి

### 2004 నుంచి వివరాలు కావాలి

### 31న సమీక్షకు ఛైర్మన్ సహా అంతా రావాల్సిందే

### ఏపీపీఎస్సీకి ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం లేఖ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యాలయంలో అమలవుతున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్, పదోన్నతులపై సమగ్ర వివరాలను అందజేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆదేశించారు. 2004 నుంచి ఇప్పటి వరకు సమగ్ర నివేదికను ఈ నెల 31నాటికి నివేదించాలన్నారు. దీనిపై ఆ రోజు జరగనున్న కమిషన్ సమావేశంలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఏపీపీఎస్సీ కార్యదర్శికి గురువారం లేఖ రాశారు. ఏపీపీఎస్సీ కార్యాలయంలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శివాజీని కలిసి రూల్ ఆఫ్ రిజర్వేషన్, పదోన్నతులపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన అసలు ఏపీపీఎస్సీలో రూల్ ఆఫ్ రేజర్వేషన్ ఏమేరకు అమలవుతుందని ఆరా తీశారు. ఏపీపీఎస్సీ కార్యాలయంలో 2004 నుంచి చేపట్టిన ఉద్యోగాల భర్తీ, పదోన్నతులు, రెగ్యులర్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, రోజువారీ సిబ్బంది వివరాలను నివేదించాలని సూచించారు. 31న నిర్వహించనున్న సమావేశానికి కమిషన్ ఛైర్మన్, కార్యదర్శి, సంబంధిత విభాగాల అధికారులంతా హాజరుకావాలని కోరారు. ఈ నెల 22న ఇదే అంశంపై సమీక్ష నిర్వహించగా, పూర్తి వివరాలు అందలేదని తెలిపారు. ఇదిలావుండగా, గ్రూప్-1,2 ప్రిలిమ్స్ పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల క్వాలిఫైయింగ్ మార్కుల వివరాలను కూడా నివేదికంచాలని శివాజీ కోరారు. ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న ప్రిలిమ్స్ / స్క్రీనింగ్ అర్హతా మార్కులపైనా, ఫీజులపైనా ఇష్టానుసారంగా కమిషన్ నిర్ణయాలు తీసుకోవటం వల్ల అభ్యర్థులకు నష్టం వాటిల్లుతోందన్నారు. జనరల్ కేటగిరి పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ మెరిట్ అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నారు. ఓపెన్ కేటగిరీలో రిజర్వుడు అభ్యర్థులకు అవకాశం కల్పించడంలేదంటూ తనను విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు కలిశారన్నారు. వీటిపైనా 31న జరిగే సమావేశంలో చర్చిస్తామన్నారు.

## బాబు పోతేనే జాబు

- టీడీపీ హయాంలో నిరుద్యోగులకు అన్యాయం
- గ్రూపు-1 పరీక్షలు వాయిదా వేయాలి
- తక్కువ సమయంలో పరీక్షలు ఎలా నిర్వహిస్తారు?
- ఆన్‌లైన్ పరీక్షా విధానం రద్దు చేయాలి
- ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డీహెచ్‌పీఎస్ రౌండ్‌టేబుల్‌లో వక్తలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో నిరుద్యోగులకు జాబు రావాలంటే చంద్రబాబు ప్రభుత్వం దిగిపోవాలని వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డీహెచ్‌పీఎస్ రాష్ట్రసమితుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ అధ్యక్షత వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్రకార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.40లక్షల పోస్టులను భర్తీ చేయడం లేదని విమర్శించారు. 23వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే ఆరువేల పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. నాలుగేళ్ల నుంచి నోటిఫికేషన్ ఇవ్వకుండా జాప్యం చేయడం వలన వయో పరిమితి మించిపోయి చాలామంది అభ్యర్థులకు నష్టం జరిగిందని ఆగ్రహం వెలిబుచ్చారు. తక్కువ సమయంలో గ్రూపు-1 పరీక్షలు నిర్వహించడం వలన అభ్యర్థులు ప్రిపరేషన్‌కు ఇబ్బందులు పడుతున్నందున వాటిని వాయిదా వేయాలని కోరారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాల వలన రాజ్యాంగబద్ధంగా కల్పించబడిన రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలు కోల్పోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మెరిట్ రిజర్వు అభ్యర్థులు ఓపెన్ కేటగిరిలో పోస్టులు పొందాల్సి ఉండగా, ఆ పోస్టులను రిజర్వేషన్ కేటగిరిలో చేర్చడం దారుణమన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి సూర్యారావు మాట్లాడుతూ గ్రూపు-1 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండు చేశారు. ఏపీపీఎస్సీ విడుదల చేస్తున్న నోటిఫికేషన్లు అభ్యర్థులను అయోమయానికి గురి చేస్తున్నాయని, ఇయర్ క్యాలెండర్ పాటించడం లేదని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగాలు భర్తీ చేయడంలో టీడీపీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. అధికారంలో కొనసాగే అర్హత రాష్ట్రప్రభుత్వానికి లేదన్నారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయభాస్కర్ నిరుద్యోగుల పక్షాన ఉన్నారా లేక ప్రభుత్వ పక్షాన ఉన్నారా అని ప్రశ్నించారు. గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అంతగా లేనందున ఆన్‌లైన్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండు చేశారు. వైఎస్ఆర్ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు తన హామీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ క్రమం తప్పకుండా విడుదల చేయాలని డిమాండు చేశారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా లేవని జిల్లా కలెక్టర్లు చెప్పడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40వేల పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయన్నారు. చంద్రబాబు 630 హామీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారనీ, ఇప్పుడు అన్ని హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్రకార్యదర్శి చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంతో ఆదిశేషగిరిరావు భేటీ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సినీనటుడు ఘట్టమనేని కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు గురువారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుని కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆదిశేషగిరిరావు, ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెల్సిందే. ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం మీడియాతో ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ వైసీపీ విధివిధానాలు నచ్చకే ఆ పార్టీ నుంచి బయటకొచ్చినట్లు చెప్పారు. సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగానే కలిశానని, అనేక రాజకీయ అంశాలపై సీఎంతో చర్చించానని తెలిపారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణపై ప్రకటన చేస్తానని ఆదిశేషగిరిరావు చెప్పారు.



# ఒక్క అడుగు...!

- ఫైనల్‌లో రఫా
- మహిళల తుదిపోరులో ఒసాకా, క్విటోవా

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ వేటలో నాదల్ మరో అడుగు ముందుకేశాడు. 18వ గ్రాండ్‌స్లాం అందుకునేందుకు ఒక్క అడుగు దూరంలో నిలిచాడు. ప్రీక్వార్టర్స్‌లో ఫెదరర్‌కు షాకిచ్చిన ట్సిసిపస్‌ను సెమీస్‌లో ఓడించి రఫా ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టాడు. సెమీస్‌లో నాదల్ ట్సిసిపస్‌ను 6-2, 6-4, 6-0 తుడాతొ ఓడించాడు. నాదల్ దూకుడు ముందు ట్సిసిపస్ నిలువలేకపోయాడు. తొలిసెట్‌లో రెండు గేమ్‌లు మాత్రమే గెలిచి సెట్‌ను చేజార్చుకోగా రెండో సెట్‌లో కాస్త పోటీ ఇచ్చాడు. ఎవరి సర్వ్‌ను వారు గెలుచుకుంటూ 4-4గా స్కోరు సమానంగా ఉండగా ప్రత్యర్థి సర్వ్‌ను బ్రేక్ చేసిన నాదల్ తన సర్వ్‌ను నిలబెట్టుకొని సెట్‌ను గెలుచుకున్నాడు. మూడో సెట్‌లో నాదల్‌కు ఎదురులేకుండా పోయింది. ట్సిసిపస్‌కు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా సెట్‌ను 6-0తో కైవసం చేసుకొని టోర్నీ ఫైనల్స్‌లో అడుగుపెట్టాడు.

**ఒసాకా, క్విటోవా కూడా..**

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో ఒసాకా, క్విటోవా తలపడనున్నారు. గురువారం జరిగిన మహిళల సెమీ ఫైనల్లో 8వ సీడ్ క్విటోవా 7-6(7/2), 6-0 తేడాతో అన్ సీడెడ్ క్రీడాకారిణి డానియెల్లీ కొలిన్స్ (అమెరికా)పై విజయం సాధించి తుది పోరుకు అర్హత సాధించింది. ఇద్దరి మధ్య తొలిసెట్ హోరా హోరీగా సాగగా, రెండో సెట్ ఏకపక్షంగా సాగింది. టై బ్రేక్‌కు దారి తీసిన తొలి సెట్‌ను క్విటోవా గెలుపొందగా, రెండో సెట్‌లో కూడా అదే జోరును కొనసాగించి 6-0 తేడాతో మ్యాచ్‌ను సొంతం చేసుకుని ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. దీంతో 28 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన తొలి చెక్ రిపబ్లికన్ క్రీడాకారిణిగా క్విటోవా రికార్డు సృష్టించింది. మరో సెమీస్ మ్యాచ్‌లో జపాన్ స్టార్ 4వ సీడ్ ఒసాకా 7వ సీడ్ ప్లిస్కోవాపై 6-2, 4-6, 6-4 తేడాతో గెలిచి ఫైనల్స్ చేరింది. మహిళల సింగిల్స్ ఫైనల్ శనివారం జరుగనుంది.

# మంధాన మెరుపులు

## తొలి వన్డేలో భారత్ ఘన విజయం



నేపియర్: ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత మహిళల జట్టు న్యూజిలాండ్ పర్యటనలో జరిగిన తొలి వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని భారత మహిళా జట్టు 33.0 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. భారత ఓపెనర్లు స్మృతీ మంధాన(105 పరుగులు 104 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) శతకం సాధించగా, జమీమా రోడ్రిగ్స్(81 నాటౌట్ 94 బంతుల్లో 9 ఫోర్లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 190 పరుగులు జోడించి భారత్ ఘన విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన సాధారణ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మంధాన, రోడ్రిగ్స్‌లు ధాటిగా బ్యాటింగ్ చేశారు. న్యూజిలాండ్ బౌలర్లను ఓ ఆటా డుకుంటూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే మంధాన సెంచరీ, రోడ్రిగ్స్ అర్ధ శతకం నమోదు చేశారు. కాగా, భారత్ విజయానికి మూడు పరుగుల దూరంలో ఉండగా మంధాన భారీ షాట్‌కు యత్నించి పెవిలియన్ చేరింది. అంతకుముందు న్యూజిలాండ్ 48.4 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచిన భారత్.. ముందుగా కివీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దాంతో బ్యాటింగ్ ఆరంభించిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు సుజీ బేట్స్(36), సోఫీ డివైన్ (28)లు శుభారంభం అందించారు. ఈ జోడి తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. ఆపై ఫస్ట్ డౌన్‌లో వచ్చిన లారెన్ డౌన్ డకౌట్ కాగా, కాసేపటికి సుజీ బేట్స్ కూడా పెవిలియన్ బాట పట్టడంతో కివీస్ 70 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. తర్వాత సాటెర్‌వైట్(31), అమీలా కెర్(28)లు 49 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించడంతో కివీస్ తేరుకుంది. చివర్లో హనహ్ రోవ్(25) రాణించడంతో కివీస్ 192 పరుగులు చేసింది. ఏక్తాబిస్త్, పూనమ్ యాదవ్‌లు తలో మూడు వికెట్లు సాధించగా, దీప్తి శర్మ రెండు వికెట్లు, శిఖా పాండేకు ఒక వికెట్ దక్కాయి.

# ఐపీఎల్‌లో వాటాలు కొనడం లేదు : బిగ్‌బీ



ముంబై : బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)జట్టులో వాటాలు కొనబోతున్నట్లు కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. వీటిపై తాజాగా బిగ్‌బి మీడియా ద్వారా స్పష్టత ఇచ్చారు. ఐపీఎల్‌జట్టులో వాటా కొనడంపై తనకే కాదు, తన కుటుంబీకులకు కూడా ఆసక్తి లేదని వెల్లడించారు. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌లో సగం వాటాలు విక్రయించేందుకు జట్టు యజమానులు యోచిస్తున్నట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. వీటిని కొనుగోలు చేసేందుకు బచ్చన్ కుటుంబీకులు ఆసక్తి చూపుతున్నారని, దీని గురించి జట్ల యజమానులతోనూ సంప్రదింపులు జరిపారని పలు మీడియా వర్గాలు వెల్లడించాయి. రాజస్థాన్ రాయల్స్‌లో బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్‌కుంద్రాకు ఒకప్పుడు వాటాలుండేవి. కానీ 2015లో సీఎస్‌కే, ఆర్‌ఆర్ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలు రావడంతో అవి చేతులు మారాయి. మరోపక్క అమితాబ్ ఫ్యామిలీకి ప్రో కబడ్డీ లీగ్‌లో జయపుర పింక్ పాంథర్స్ జట్టులో, ఇండియన్ సూపర్ లీగ్‌లోని చెన్నయన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో వాటాలున్నాయి.

# పాండ్య, రాహుల్‌కు ఊరట



**సస్పెన్షన్ ఎత్తివేసిన పాలకుల కమిటీ**

ముంబై : టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌కు ఊరట లభించింది. బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న కార్య క్రమంలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ వీరిపై వేటు పడిన విషయం తెలిసిందే. దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంతో పాల కుల కమిటీ(సీఓఏ) ఈ ఇద్దరిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు బీసీసీఐ వెల్లడించింది. ఈ వివాదంపై జరుగుతున్న విచారణను పెండింగ్‌లో పెట్టింది. ఆసీస్ పర్యటనలో ఉండగానే వీరిద్దరిపై వేటు వేస్తున్నట్లు పాలకుల కమిటీ ప్రకటించింది. దీంతో ఇద్దరూ పర్యటనలో మధ్యలోనే స్వదేశానికి తిరిగి వచ్చేయాల్సి వచ్చింది. అయితే వీరిద్దరిపై సస్పెన్షన్ విధించడం సరైంది కాదంటూ గతవారం బీసీసీఐ అధ్యక్షుడు సీకే ఖన్నా పాలకుల కమిటీకి లేఖ రాశారు. యువ క్రికెటర్లు చేసిన పొర పాటుకు ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నారని.. ఇక వారికి ప్రత్యేకంగా శిక్షేమీ అవసరం లేదంటూ ఆయన సీఓఏకు వివరించారు. ఈ దశలో వారిపై వేటు వేయడం వల్ల టీమిండియా ఖ్యాతికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఖన్నా అభిప్రాయ పడ్డారు. ఈ వివాదం ఏర్పడిన తర్వాత పాండ్య సామాజిక మాధ్యమాల వేదికగా క్షమాపణలు చెప్పాడు. రాహుల్ మాత్రం దీనిపై స్పందించకపోవడం గమనార్హం. సస్పెన్షన్ ఎత్తివేసిన నేపథ్యంలో పాండ్య న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే అవకాశం ఉంది. టీమిండియా-కివీస్ జట్ల మధ్య శనివారం రెండో వన్డే ప్రారంభం కానుంది.

# క్వార్టర్స్‌లో భారత షట్లర్లు



జకార్తా: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో క్వార్టర్స్‌కు చేరారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో భాగంగా మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సింధు 23-21, 21-7 తేడాతో గ్రిగోరియా మరిస్కా (ఇండోనేసియా)పై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. సింధు తొలి గేమ్‌ను పోరాడి గెలవగా, రెండో గేమ్‌ను అవలీలగా సొంతం చేసుకుంది. క్వార్టర్స్‌లో కరోలినా మారిన్(స్పెయిన్)తో సింధు తలపడే అవకాశం ఉంది. మరో సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ ఇండోనోసియాకే చెందిన ఫిట్రియానీపై 21-17, 21-15 తేడాతో విజయం సాధించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ పోరులో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ 21-14, 21-9 తేడాతో కెంటో నిషిమోటో (జపాన్)పై విజయం సాధించాడు. తొలి గేమ్‌ను 21-14తో గెలిచిన శ్రీకాంత్.. రెండో గేమ్‌లో పెద్దగా కష్టపడకుండానే సొంతం చేసుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమీత్ రెడ్డి జోడీ 5వ సీడ్ డెన్మార్క్ జోడీ కిమ్ అస్ట్రప్-రస్ముసేన్ చేతిలో 21-14, 17-21, 21-10 తేడాతో పోరాడి ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# కుప్పకూలిన శ్రీలంక



బ్రిస్‌బేన్ : ఆస్ట్రేలియా పర్యటనలో శ్రీలంక-ఆసీస్ మధ్య డేనైట్ టెస్టుగా జరుగుతున్న తొలి మ్యాచ్ మొదటిరోజు ఆటలో లంక 144 పరుగులకే కుప్పకూలి తొలి ఇన్నింగ్స్ ముగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన శ్రీలంక 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో డిక్‌వెల్లా (64 పరుగులు) రాణించినా అతడికి ఎవ్వరూ సహకారం అందించకపోవడంతో శ్రీలంక 56.4 ఓవర్లలో 144 పరుగులు చేసి మిగతా వికెట్లు కోల్పోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్ 4 వికెట్లు తీయగా అరంగేట్ర బౌలర్ రిచర్డ్సన్‌కి 3, స్టార్క్‌కి 2, లయన్‌కు 1 వికెట్టు దక్కాయి. తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 72 పరుగులు చేసి రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బర్న్స్ (15), ఖవాజా (11) చేసి అవుట్ కాగా మరో ఓపెనర్ హారిస్ (40), నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన లయన్ క్రీజ్‌లో ఉన్నారు.

# అశ్విన్‌ను కూడా పట్టించుకోండి : గంభీర్



న్యూఢిల్లీ: వన్డే వరల్డ్‌కప్‌కు సమయం దగ్గరపడుతున్న తరుణంలో భారత జట్టులో స్థానాలపై ఇప్పటికే చర్చ మొదలైంది. కొంతకాలంగా ఆటగాళ్లను పరీక్షిస్తూ వస్తున్న టీమిండియా యాజమాన్యం దాదాపు ఒక స్పష్టతకు వచ్చినట్లే కనబడుతోంది. అయితే టీమిండియా ప్రధాన ఆఫ్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్ పరిస్థితి డైలామాలో ఉంది. ప్రస్తుతం భారత స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్‌లు విశేషంగా రాణిస్తుండటంతో అశ్విన్‌కు చోటు కష్టంగానే కనబడుతోంది. కాగా, అశ్విన్‌కు మద్దతుగా నిలిచాడు టీమిండియా మాజీ క్రికెటర్ గౌతం గంభీర్. వరల్డ్‌కప్‌లో భాగంగా ఇంగ్లండ్‌కు వెళ్లే భారత జట్టులో అశ్విన్‌కు కచ్చితంగా స్థానం కల్పించాలని గంభీర్ అభిప్రాయపడ్డాడు. అశ్విన్ బౌలింగ్‌కు ఇంగ్లండ్ పిచ్‌లు బాగా నప్పుతాయని అభిప్రాయపడిన గంభీర్.. ప్రపంచకప్‌లో అతనికి అవకాశమివ్వాలని సూచించాడు. 'ప్రపంచకప్ సమయంలో ఫ్లాట్ పిచ్‌లు ఎదురైతే..? చేతి వేళ్లతో బంతిని తిప్పే అశ్విన్ బాగా ఉపయోగపడతాడు. అలా అని మణికట్టు స్పిన్నర్లని నేను ఏమీ తక్కువ చేయడం లేదు. ఏడాది కాలంగా కుల్దీప్, చాహల్ అత్యుత్తమంగా రాణిస్తున్నారు. కానీ ప్రపంచకప్ జట్టులో అశ్విన్ కూడా ఉంటే అది టీమ్‌కి అదనపు బలం. వరల్డ్‌కప్ ఆడే భారత జట్టులో అశ్విన్‌ను పరిగణలోకి తీసుకోండి' అని గంభీర్ తెలిపాడు.

# క్రికెట్‌కు బోథా గుడ్‌బై



హైదరాబాద్: దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జోహాన్ బోథా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు తాను అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు అధికారిక ప్రకటన చేశాడు. ఈ ఏడాది బిగ్‌బాష్ లీగ్(బీబీఎల్)లో భాగంగా హోబార్ట్ హరికేన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన బోథా బుధవారం సిడ్నీ సిక్సర్స్‌తో మ్యాచ్ అనంతరం తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని తెలిపాడు. ఈ సందర్భంగా బోథా మాట్లాడుతూ "ఇదొక ఎమోషనల్ మూమెంట్. నా కెరీర్‌లో తదుపరి ఫేజ్‌కు సమయం ఆసన్నమైందని భావించే ఈ నిర్ణయం తీసుకున్నా. 19 ఏళ్లుగా క్రికెట్ నా జీవితంలో కలిసిపోయింది" అని 36 ఏళ్ల బోథా పేర్కొన్నాడు. తన చివరి మ్యాచ్‌లో బోథా ఒక్క వికెట్ కూడా తీయక పోయాడు. 2005 నుంచి 2012 వరకూ దక్షిణాఫ్రికా జట్టు ప్రాతినిధ్యం వహించిన బోథాకు 2016లో ఆస్ట్రేలియా పౌరసత్వం లభించింది. దక్షిణాఫ్రికా తరపున 78 వన్డే మ్యాచ్‌లు, 40 టీ20 మ్యాచ్‌లు, 5 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. దక్షిణాఫ్రికా తరపున 10 వన్డేలకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. 2009లో బోథా నేతృత్వంలోని దక్షిణాఫ్రికా జట్టు నంబర్‌వన్ ర్యాంకును సొంతం చేసుకుంది. ఆ సిరీస్‌లో దక్షిణాఫ్రికా 4-1తో ఆసీస్‌పై గెలిచి అగ్రస్థానంలో నిలిచింది.

# కేంద్రంలో హంగ్...!

- తగ్గనున్న ఎన్‌డీఏ బలం
- కూటమేతరులే కీలకం
- ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్ సర్వే

న్యూఢిల్లీ : ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే హంగ్ ఏర్పడుతుందని ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్ సర్వేలో వెల్లడైంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్' పేరుతో చేసిన ఈ సర్వే ఫలితాల ప్రకారం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి లోక్‌సభలో సీట్లు భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఆ కూటమికి 237 సీట్లు మాత్రమే వస్తాయని వెల్లడైంది. యూపీఏకి 166, ఇతరులకి 140 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 272ని ఎన్డీఏ అందుకునే అవకాశాలు లేవు. 2014 కన్నా ఆ కూటమికి 99 సీట్లు తక్కువగా వస్తాయని సర్వే వెల్లడించింది. యూపీఏ కంటే ఎన్డీఏకి ఓట్ల శాతం కాస్త అధికంగా వస్తుంది. యూపీఏకి 2014 కన్నా 106 సీట్లు అధికంగా వస్తాయని తేలింది. ఈ రెండు కూటముల్లో లేని వారు గత ఎన్నికల్లో కంటే 13 సీట్లను కోల్పోనున్నట్లు సర్వే పేర్కొంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్' ప్రకారం ఎన్డీఏ 35 శాతం, యూపీఏ 33 శాతం ఓట్లను కైవసం చేసుకోనున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ 282 స్థానాలు గెలుచుకుని మిత్రపక్షాల అవసరం లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీ సాధించిన విషయం తెలిసిందే. హంగ్ ఏర్పడితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మెజార్టీ కోసం యూపీఏ యేతర పార్టీల మద్దతు కోసం ఎన్డీఏ ప్రయత్నాలు జరపాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఇతరులు కూడా ప్రధాన మంత్రి పదవి కోసం డిమాండు చేసే అవకాశాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగి, మేలో ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 44 సీట్లు మాత్రమే రాగా, ఈసారి ఆ సంఖ్య 100ను క్రాస్ అవుతుందని సర్వే వెల్లడించింది. గత నెల 28 నుంచి ఈనెల 8 వరకూ 97 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో 12,146మంది అభిప్రాయాలు సేకరించారు.

**పీడీపీ, ఎస్పీ, బీఎస్పీ మద్దతు ఉంటేనే...**

యూపీఏకి 166 సీట్లు వస్తే ఆ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రెండు అవకాశాలు ఉన్నాయి. యూపీఏ కూటమికి పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పీడీపీ) తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ), సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మద్దతు తెలపాల్సి ఉంటుంది. 543 సీట్లకు ఎన్నికలు జరగనుండగా ప్రభుత్వ ఏర్పాటుకు 272 సీట్లు అవసరం అవుతాయి. ఈ నాలుగు పార్టీలు యూపీఏకి మద్దతు తెలిపితే ఆ కూటమి ఓట్ల శాతం 44 శాతంగా నమోదవుతుంది. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏకి 234 సీట్లు, ఇతరులకు (ఎన్డీఏ, యూపీఏ కూటమిలో లేని పార్టీల వద్ద) 37 సీట్లు ఉంటాయి. ఇరు పార్టీల కూటములకు మద్దతు తెలపని పార్టీలు ఒకవేళ చివరి నిమిషంలో ఎన్డీఏకి మద్దతు తెలిపినప్పటికీ ఆ కూటమికి 271 సీట్లు మాత్రమే దక్కుతాయి. ప్రభుత్వ ఏర్పాటుకు మరో సీటు కావాల్సి ఉంటుంది. ఏ కూటమికీ మద్దతు తెలపకుండా ఉంటున్న టీఆర్ఎస్, బీజూ జనతా దళ్, అన్నాడీఎంకే, వైసీపీ ఎన్నికల తరువాత బీజేపీ మద్దతు తెలిపినప్పటికీ యూపీఏనే ముందంజలో ఉంటుంది. ఈ నాలుగు పార్టీలు ఎన్డీఏకి మద్దతు తెలిపితే ఈ కూటమి సీట్ల సంఖ్య 257కి పెరుగుతుంది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎవరికీ ఆధిక్యం దక్కని పరిస్థితే ఏర్పడితే ఎన్డీఏ ఇతర పార్టీలను తమ వైపునకు ఎలా ఆకర్షించగలదో చూడాల్సిందే.



ఈనెల 27న జనఘోష రైలు యాత్ర ఢిల్లీ పర్యటనకు మద్దతు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఇతర సీపీఐ నేతలను గురువారం సాయంత్రం విశాఖ సీపీఐ అల్లిపురం కార్యాలయంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు కలిసి మద్దతు కోరుతున్న దృశ్యం.
- విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో

# 19 ఏళ్లుగా రోడ్డు కోసం..!



**విసిగిపోయి.. తామే నిర్మించుకుంటున్న గ్రామస్తులు**

డెహ్రాడూన్: తమ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న కొండపై ప్రభుత్వం రోడ్డు నిర్మిస్తుందని ఆ గ్రామస్తులు 19 ఏళ్లుగా ఎదురు చూశారు. అయినప్పటికీ ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కాకపోవడంతో ఇక ప్రభుత్వం తమకు సాయం చేస్తుందన్న ఆశ వారిలో ఆవిరైపోయింది. కొండ మీదుగా తామే రోడ్డు మార్గాన్ని నిర్మించుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన పనులు మొదలు పెట్టారు. ఈ రోడ్డు మార్గం నిర్మాణానికి రూ.కోట్లలో ఖర్చు అవుతుంది. అయితే, రోజూ కొద్ది సేపు ఇక్కడ పని చేస్తే ఎప్పటికయినా ఈ రోడ్డు మార్గం పూర్తి కాకపోతుందా? అన్న ఆశతో పార, కొడవలి, గునపం వంటి పరికరాలను పట్టుకుని కష్టపడుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలోని సయూరీ మల్లి గ్రామస్తుల పరిస్థితి ఇది. ఈ పనులను మొదలు పెట్టి ఇప్పటికి రెండు వారాలు అవుతోంది. వారు కొండపై 150 మీటర్ల మేరకు మట్టిరోడ్డును నిర్మించారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్ విభజన జరిగిన 2000 నుంచి తాము కొండ మీదుగా రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఆశగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. 2017లో త్రివేంద్ర సింగ్ రావత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆ ప్రాంతంలో 6 కిలోమీటర్ల మేర రూ.3.77 కోట్ల ఖర్చుతో రోడ్డు నిర్మిస్తామంటూ శంకుస్థాపన చేశారు. ఆహామీ నీటి మూటగా మారడంతో గ్రామస్తులే రోడ్డుకోసం నడుంబిగించారు.

# రిపబ్లిక్‌డేకు సర్వం సిద్ధం

- ముస్తాబవుతున్న ఐజీఎం స్టేడియం
- ప్రగతి సూచికగా వివిధ శాఖల ప్రగతి రథాలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర గణతంత్ర దినోత్సవానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. 26న ఉదయం స్టేడియంలో పెరేడ్ కమాండర్ పెరేడ్‌ను లీడ్ చేస్తారు. అనంతరం డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ గౌరవ వందనం స్వీకరిస్తారు. పిదప రాష్ట్ర సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, డీజీపీ ఆర్‌పీ ఠాకూర్‌లు స్వాగతం పలుకుతారు. రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు సీఎం స్వాగతం పలుకుతారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత గవర్నరు రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్రీయ సెల్యూట్ చేస్తారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కవాతు ప్రదర్శిస్తారు. 4వ బెటాలియన్ కమాండర్ అజయ్‌కుమార్ ఫస్ట్ కమాండెంట్‌గాను, 6వ బెటాలియన్ కమాండెంట్ హనుమంతు రెండో కమాండెంట్‌గా వ్యవహరిస్తారు. కవాతు ప్రదర్శనలో భాగంగా ఇండియన్ ఆర్మీకి సుబేదార్ ముత్త పాండ్యన్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌గా అమిత్‌కుమార్ వ్యవహరిస్తారు. ఇండియన్ ఆర్మీ బ్యాండ్ బృందానికి అజిత్‌కుమార్ గొగైయ్, ఏపీ పోలీసు బ్యాండ్ విభాగానికి సుబ్రహ్మణ్యం, సోషల్ వెల్ఫేర్ బ్యాండ్ మాస్టర్‌బ్యాక్ పైప్ బ్యాండ్‌కి బాపూజీ నాయకత్వం వహిస్తారు. రాష్ట్రగవర్నర్ నరసింహన్ రాష్ట్రప్రజలనుద్దేశించి తన సందేశాన్ని ఇస్తారు. ఉత్తమ కవాతు ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేస్తారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించే విధంగా రూపొందించిన ప్రగతి వాహనాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. 15 శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన జరుగుతుంది. వ్యవసాయం, సీఆర్‌డీఏ, విద్య, అటవీ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సెర్ఫ్, పర్యా టక, జలవనరుల, స్త్రీశిశు సంక్షేమ, ఉద్యానవన, సాంఘికసంక్షేమ వంటి శకటాల ప్రదర్శన జరుగుతుంది. ఈనేపథ్యంలో శకటాలను తయా రు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కార్యక్రమం వీక్షించేందుకు వచ్చే సందర్శకుల నిమిత్తం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత వరుసగా ఐదో పర్యాయం గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.